ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 3

ఏప్రిల్, 2013

ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**డా॥ సి. నాగరాజు**
**హెచ్. కూర్మారావు**
**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**
**డా॥ వి. శివ శంకర ప్రసాద్**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు విస్తరణ శిక్షణా కేంద్రాలు కృషి చేయాలి ..... 3
ఉపప్రణాళికల అమలుకు దళిత ప్రజా సంఘాలు ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలి..... 5
గ్లోబల్ కమ్యూనికేషన్స్ సదస్సులో అపార్డుకు అవార్డులు ..... 7
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నియమాలు తెలుసుకుందాం ..... 9
భారత్ నిర్మాణ్ అమలు తీరుతెన్నులు ..... 11
పంచాయతీరాజ్ సంస్థలే ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్ళు ..... 13
చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చిన – వావిలాల ..... 15
పథకానికి పది ప్రశ్నలు – రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన ..... 17
యువతకు ఉపాధి నైపుణ్యాల శిక్షణకు రూ. 1000 కోట్లు కేంద్ర బడ్జెట్ ..... 19
ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో ఇనాం భూముల సమస్యలు ..... 20
సమాచార హక్కు చట్టం – గ్రామ పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారం ..... 22
మహిళల భాగస్వామ్యంతోనే సమాజం అభివృద్ధి ..... 25
గ్రామీణాభివృద్ధికి ఈసారి కేంద్ర బడ్జెట్‌లో 46 శాతం అదనపు కేటాయింపులు ..... 26
తీర ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్యాల యాజమాన్యానికి సమిష్టి కృషి అవసరం..... 28
'మలయజ' తో మారుతున్న మన్యం గ్రామాభివృద్ధి..... 29
పథకాల అమలులో పారదర్శకతకు సామాజిక చైతన్యం తప్పనిసరి ..... 31
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు..... 32
అత్యంత ప్రజాదరణ కలిగిన గొప్ప రాజనీతిజ్ఞుడు ..... 34
గొప్ప పరిపాలనా దక్షుడు బాబూ జగ్జీవన్‌రామ్..... 36
ఉగాది వేళ సంబరాల హేల ..... 37
చోళ సామ్రాజ్యంలో స్థానిక పాలన – కొన్ని ఆసక్తికరమైన విషయాలు ..... 39
394 మంది సుశిక్షితులైన పారిశుద్ధ్య దూతలను తయారు చేసిన ఎయంఆర్ అపార్డ్... 41
పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలు ..... 43
బాధ్యతాయుత భారత్ దిశగా... బిఎస్‌ఎన్‌ఎల్..... 47
ధరిత్రీ పరిరక్షణ బాధ్యత అందరిదీ ..... 48
చెదల నివారణ, రక్షణ చర్యలు..... 50
మహిళలపై హింసకు విరుగుడు సామాజిక దృక్పథంలో మార్పు ..... 52
ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వ పథకాలు..... 54
రైతు కూలీ నుండి కూరగాయల రైతుగా..... 56
జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో..... 57
పంచాయితీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి..... 58
పల్లె ప్రాంతాల ప్రగతి సోపానాలు గ్రామీణ సంతలు ..... 59
వాన నీటి సంరక్షణతో రైతుకు లాభాలు ..... 63

# పంచాయితీరాజ్‌లో ప్రజాస్వామ్య వీచికలకు 20 సంవత్సరాలు

1990దశకం వరకూ అంటే 20 ఏళ్లకు పూర్వం పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగ పరంగా, ప్రత్యేకమైన అస్తిత్వం, గుర్తింపు ఉండేది కాదు. ప్రభుత్వం అంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మాత్రమే. రాష్ట్రాలకు రాజ్యాంగంలోని 7వ షెడ్యూలు కొన్ని అంశాలను కేంద్ర జాబితాలో, మరికొన్నిటిని రాష్ట్రాల జాబితాలో ఉంచింది. ఆయా అంశాలపై శాసనాలను రూపొందించే అధికారం అటు కేంద్రానికి, లేదా రాష్ట్రాలకు ఉంటుంది. స్థానిక సంస్థలు కూడా రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశం.

పరిపాలనలో ప్రజలను భాగస్వామ్యులను చేసే ఉద్దేశ్యంతో పంచాయితీరాజ్ వ్యవస్థకు 1959లో అంకుర్పారణ జరిగింది. అయితే ఈ సంస్థలు కేవలం చట్టపరంగా ఏర్పాటు చేసిన సంస్థలుగానే తమ కార్యకలాపాలను నిర్వర్తించేవి. ఈ మూడంచెల పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి ఇవ్వడానికి 1989లో ఒక ప్రయత్నం జరిగింది. ఇందుకోసం 64వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. పంచాయితీరాజ్ సంస్థల పాలనను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఈ బిల్లు పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమైనప్పటికీ, బిల్లులోని కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. చివరికి రాజ్యసభలో బిల్లు వీగిపోయింది. స్థానిక సంస్థల సంస్కరణల రూపకల్పనలో రాష్ట్రాలకు పెద్దగా అధికారాలివ్వలేదనే విమర్శలు ఈ బిల్లు వీగిపోవడానికి కారణమయ్యాయి.

తరువాత 1992లో పార్లమెంట్ ఆమోదించిన 73వ, 74వ రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చగా, ఏప్రిల్ 24, 1993న, 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమల్లోకి వచ్చింది. నగరపాలిక చట్టంగా వ్యవహరింపబడుతున్న, 74వ సవరణ చట్టం జూన్ 1, 1993న అమల్లోకి వచ్చింది.

73వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చి ఈ ఏప్రిల్ 24కి సరిగ్గా 20 సంవత్సరాలు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూలులో పేర్కొన్నట్లు స్థానిక ప్రభుత్వాలు రాష్ట్ర జాబితాలో ఉండటంతో, స్థానిక సంస్థల్లో సంస్కరణలు తీసుకొచ్చే ఏ చట్టాన్నయినా రాష్ట్రస్థాయిలో రూపొందించవలసి ఉంటుంది. రాజ్యాంగ సవరణ చేస్తూ ఆమోదించిన పంచాయితీ రాజ్, నగరపాలిక చట్టాలకు అనుగుణంగా వివిధ రాష్ట్రాలు రాష్ట్ర స్థాయిలో నిబంధనలను రూపొందించుకున్నాయి. కేంద్ర స్థాయిలో 73వ రాజ్యాంగ సవరణ అమల్లోని పర్యవేక్షించటానికి 2004 ప్రత్యేక పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయింది. 73వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చిన తేదీ ఏప్రిల్ 24 ని పంచాయతీరాజ్ దివస్‌గా ప్రకటించటం కూడా జరిగింది.

పంచాయితీరాజ్ చట్టం గత 20 సంవత్సరాలలో భారతదేశ వ్యాప్తంగా తెచ్చిన మౌలికమైన మార్పులు గణనీయంగానే ఉన్నాయి. అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలుగా పంచాయితీరాజ్ సంస్థలు రూపాంతరం చెందటం వీటిలో ముఖ్యమైన మార్పు. అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి దోహదం చేసిన నిబంధనల్లో ముఖ్యంగా, ***పంచాయితీల్లో అన్ని స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించటం, ప్రతి 5 సంవత్సరాలకు తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించడం, పంచాయితీల జనాభాలో ఆయా వర్గాల నిష్పత్తికి అనుగుణంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సీట్లు కేటాయించటం, ఆయా వర్గాలకు కేటాయించిన స్థానాలతో సహా, జనరల్ స్థానాలలో కూడా మహిళలకు అన్ని స్థాయిల్లో మూడింట ఒక వంతు స్థానాలు కేటాయించడం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఒక స్వతంత్ర స్థాయి ఎన్నికల సంఘాన్ని నియమించటం*** వంటి వాటిని పేర్కొనవచ్చును.

ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల మహిళలకు గణనీయంగా స్థానాలు కేటాయించటంతో, అప్పటివరకూ పెత్తందారీ భూస్వాములకే పరిమితమై పోయిన అధికారం ఇతర వర్గాలకు సంప్రాప్తించింది. పంచాయితీల స్థాయిలో ప్రజాస్వామ్య వీచికలు వీయటం ప్రారంభించాయి. అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్యం వికసించింది.

కొత్తలో కొన్ని తప్పటడుగులు పడినా, కొత్తగా అధికారం సంప్రాప్తించిన ఈ వర్గాలు తరువాత కాలంలో పుంజుకుని, తమకు లభించిన అధికారాన్ని సార్థకం చేసుకున్నాయి. మహిళల సంగతి ప్రముఖంగా చెప్పాలి. అప్పటివరకు ఇంటికే పరిమితమైన వీరు, విధుల నిర్వహణలో పురుషులను మించారన్న ప్రశంసలనందుకున్నారు.

అట్టడుగు స్థాయిలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పంచాయితీలలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి దోహదపడిన 73వ రాజ్యాంగ సవరణకు జేజేలు. ***ఏప్రిల్ 24న పంచాయితీరాజ్ దినోత్సవం*** సందర్భంగా పంచాయితీ రాజ్ చట్టాన్ని మరింతగా సమీక్షించుకుని, ఈ స్థానిక సంస్థలను ముున్ముందుకు తీసుకెళ్లగలుగుతామని ఆశిద్దాం.

(కె. చంద్రమౌళి)




# ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు విస్తరణ శిక్షణా కేంద్రాలు కృషి చేయాలి

## గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డి. మాణిక్య వరప్రసాద్

**పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగంలోని క్షేత్ర స్థాయి సిబ్బంది సామర్థ్యాల పెంపుదల కోసం విస్తరణ శిక్షణ కేంద్రాలను అన్ని విధాలా బలోపేతం చేస్తామని రాష్ట్ర గ్రామీణావృద్ధి శాఖా మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మార్చి 17వ తేదీన గుంటూరు జిల్లా బాపట్లలో ఉన్న విస్తరణ శిక్షణాకేంద్రం (ఇ.టి.సి.) ఆవరణలో రూ॥ 1 కోటి 76 లక్షలతో నిర్మించిన వసతి గృహాన్ని ఆయన ప్రారంభించారు.**

ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి విశిష్ట అతిధులుగా స్థానిక ఎమ్మెల్యే శ్రీ గాదె వెంకటరెడ్డి, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్.లు హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు, గ్రామ స్థాయి పాలనపై మరింత అవగాహన కల్పించేందుకు విస్తరణ కేంద్రాలు మరింత కృషి చేయాలన్నారు.

అదే విధంగా అన్ని శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి, అధికారులకు వారి వారి శాఖా పరమైన విషయాలపై శిక్షణ ఇవ్వటంలో అపార్డ్ మరియు విస్తరణ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అన్నారు. బాపట్ల విస్తరణ కేంద్రాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ విస్తరణ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్) సంస్థను కమీషనర్ శ్రీ చంద్రమౌళి జాతీయ స్థాయిలోనే ఉత్తమ శిక్షణా సంస్థగా ప్రధమ స్థానంలో నిలిపారని ప్రశంసించారు. ఎమ్మెల్యే శ్రీ గాదె వెంకట రెడ్డి మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ సంస్థల విధులపై అవగాహనను పెంపొందించుకుని బాధ్యతాయుతంగా పని చేసేలా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వం ప్రవర్తనా నియమావళి రూపొందించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు బాగా అమలవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ





ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్. మాట్లాడుతూ, ప్రజలల్లో చైతన్యం వచ్చినప్పుడే సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలోని ప్రతి ఒక్కరికీ అందుతాయని ఆయనన్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలు గ్రామస్థాయిలో మరింత సంపూర్ణంగా అమలయ్యేందుకు కావలసిన మెళకువలపై యువతీ, యువకులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతకు సమాజంలో స్థితి గతులపై అవగాహన కల్పించడంతో పాటు వారి, ఆసక్తికి అనుగుణంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తునట్లు శ్రీ చంద్రమౌళి వివరించారు.

### కమిటీ సభ్యులతో సమీక్ష

ప్రారంభోత్సవ సభ అనంతరం శిక్షణా కేంద్రంలోని కమిటీ సభ్యులతో ఇ.టి.సి. పాలక వర్గ సమావేశం నిర్వహించారు. ఇ.టి.సి పాలక వర్గంలోకి స్థానిక ఎమ్మెల్యేలను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత జరిగిన తొలి




సమావేశానికి మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏటా లక్ష్యం మేరకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఇ.టి.సి. కి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిధులతో విస్తరణ కేంద్రంలో రూ. 6.5 కోట్లతో అభివృద్ధి పనుల కోసం అంచనాలు తయారు చేసి పంపించగా రూ. 3.75 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ నిధులతో ప్రస్తుతం అంతర్గత రోడ్లు, తరగతి గదులు, సిబ్బంది విశ్రాంతి గదులు, భోజనశాల మొదలగు వాటి నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు.

ఎమ్మెల్యే శ్రీ గాదె వెంకటరెడ్డి మాట్లాడుతూ, అటవీ శాఖ అధికారులను వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల సహాయంతో ఇ.టి.సి. భూముల్లో జీడి మామిడితో పాటు ఇతర పండ్ల తోటల పెంపకంపై చేపట్టాలని సూచించారు. ఇ.టి.సి. ఆవరణలో మొక్కలను పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు.

ఈ సమావేశంలో ఇ.టి.సి. ప్రిన్సిపాల్ డి. సత్యనారాయణ, గుంటురు జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. శ్రీ జయప్రకాష్ నారాయణ, గుంటూరు జిల్లా డ్వామా పి.డి. శ్రీ అనిల్ కుమార్, కృష్ణా జిల్లా సి.ఇ.ఓ. శ్రీ కొండయ్య శాస్త్రి, ప్రకాశం జిల్లా సి.ఇ.ఓ. శ్రీ నారాయణ రెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్.ఇ. సూర్య నారాయణ, ఇ.ఇ.ఎం. వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు శేషగిరి, ఇ.టి.సి. వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సుబ్బారావు పాల్గొన్నారు. ■

# ఉపప్రణాళికల అమలుకు దళిత ప్రజా సంఘాలు ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలి

**– మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ రావు**




**రాష్ట్ర వార్షిక ప్రణాళికలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజల అభివృద్ధి కోసం ఆయా సామాజిక వర్గాల జనాభా దామాషా ప్రకారం నిధులను తప్పని సరిగా వెచ్చించేందుకు ఉద్దేశించి, మన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎస్సీ, ఎస్టీ ఉపణాళికల చట్టం తీసుకొనివచ్చింది. ఈ చట్టం ప్రకారం 2001 రాష్ట్ర జనాభా లెక్కల ప్రకారం 16.2% గా ఉన్న షెడ్యూల్డు కులాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రణాళికా బడ్జెట్‌లో 16.2% శాతం నిధులను, అలాగే రాష్ట్ర జనాభాలో 6.6% గా ఉన్న షెడ్యూల్డు తెగల ప్రజల సంక్షేమానికి 6.6% నిధులను రాష్ట్ర బడ్జెట్ నుండి ప్రతిశాఖ తప్పని సరిగా కేటాయించాలి.**

ఈ ఉపప్రణాళికల చట్టంపై ప్రజలలో అవగాహన కల్గించి, చట్టం లక్ష్యాలను సాధించడానికి దళిత ప్రజా సంఘాలతో చర్చించేందుకు మార్చి 7న అపార్డ్ లో ఒక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు శ్రీ డి. మాణిక్యవరప్రసాద్, విశిష్ట అతిథులుగా ప్రధాన మంత్రి మాజీ కార్యదర్శి శ్రీ కె.ఆర్. వేణుగోపాల్ కీలకోపన్యాసం చేసారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. మాధవరావు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమన్వయ కమిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మెన్ శ్రీ టి. గోపాలరావు, అపార్డ్ కమీషర్ శ్రీ కె. చంద్రమౌళి, ట్రైఫెడ్ ఛైర్మన్ శ్రీ సూర్యానాయక్‌లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీ మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, ఉపప్రణాళికల చట్టం తీసుకురావడానికి ప్రభుత్వానికి ఎన్ని అడ్డంకులు ఏర్పడినప్పటికీ, అడ్డంకులన్నీ అధిగమించి ఈ బిల్లును తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం తీసుకువచ్చిన చట్టంలో కొన్ని లోటుపాట్లున్న మాట వాస్తవమేనన్నారు. అయితే, మొదట చట్టం వస్తే తరువాత దానిలో ఉన్న లోపాలను సవరించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతి నియోజక వర్గంలో రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ బాలికలకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు నిర్మిచుకునే గృహాల యూనిట్ వ్యయాన్ని పెంచి వచ్చే నాలుగేళ్ళలో ఎస్సీ,ఎస్టీలకు ఉపప్రణాళిక నిధులతో పక్కా గృహాలు నిర్మించే యోచనలో ప్రభుత్వం ఉందని ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల సాధికారతకు ఉద్దేశించిన చట్టాలు అన్నీ సక్రమంగా అమలు జరిగేలా చూసేందుకు ప్రజా సంఘాలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టంలో ఉన్న లోపాల్ని ప్రజా సంఘాలు ఎప్పటికప్పుడు వెలికి తీసి ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన కోరారు. ఇటువంటి చట్టాలు రూపొందించడం సాహసోపేతమైన చర్యగా ఆయన వర్ణించారు. ఇటువంటి చట్టాలు మరింత సమర్థవంతంగా రూపొందించాలంటే చట్టాలు రూపొందించే వారి ఆలోచనలో మార్పురావలసిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

పేదరికం అంటే కేవలం ఆకలితో ఉండటం మాత్రమే కాదని, ప్రజల దైనందిన అవసరాలు తీర్చే మౌలిక వసతులు లేకపోవడం, కూడా పేదరికకమేనన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పేదవాడిని అన్ని విధాల ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ప్రతి పేదవాడికి జీవనోపాధి భద్రత కల్పిస్తోందని, ఈ పథకమే లేకపోతే సమాజంలో శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లే దని మంత్రి పేర్కొన్నారు.

శ్రీ కె.ఆర్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఏ పథకమైనా, చట్టమైనా ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు కలిసి పనిచేస్తేనే విజయవంత మవుతుందని అన్నారు. పథకమైనా, చట్టమైనా ప్రభుత్వాలు చిత్త



శుద్ధితో అమలు చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు లబ్ది చేకూర్చేందుకు జిల్లా పరిషత్, పంచాయితీ సమితుల్లో రిజర్వేషన్లు 1959 లోనే కల్పించినప్పటికీ, అవి ఆశించిన రీతిలో వాస్తవ రూపం దాల్చలేదని అన్నారు.

అదే విధంగా 1978లో స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను తీసుకువచ్చినప్పటికీ, దాని ఉద్దేశ్యాలు నెరవేరకపోవడం వల్ల మన రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చుచేయాల్సిన 20 వేల కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని వేణుగోపాల్ అన్నారు. అయితే ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ నిధులు సక్రమంగా ఖర్చు చేసేందుకు ఉపప్రణాళికలు చట్టం తీసుకురావడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు.

అయితే ఈ సబ్‌ప్లాన్ చట్టంలో చాలా లోపాలున్నాయని, చట్టం 10 సంవత్సరాల వరకూ ఉంటే ఉపయోగం ఏముంటుందని, నోడల్ ఏజెన్సీలో ఒక్క దళిత సంఘం ప్రతినిధి కూడా లేరని ఆయన అన్నారు. ప్రభుత్వం చట్టాలు చేసేముందు వాటికి సంబంధించిన ప్రజా సంఘాలను కూడా భాగస్వామ్యులను చేయాలని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. పక్కదారి పట్టిన 20 వేల కోట్లు ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కోసం ఖర్చుచేయాలని ఆయన సూచించారు. చట్టంలో ఉన్న లోపాల్ని ఎత్తి చూపడం తమ ఉద్దేశ్యం కాదని ఉన్నటివంటి లోపాల్ని సవరించే విధంగా చర్యలను ప్రభుత్వానికి తెలియజేయడమేనని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యం, విద్య, వైద్య, పోషకాహారం మహిళా శిశు సంక్షేమం, పారిశుద్ధ్యం, పర్యావరణం, ఉపాధి తదితర రంగాలలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే గ్రామీణాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఐ.సి.డి.ఎస్ కార్యక్రమం దేశంలోనే గొప్ప కార్యక్రమమని; మనిషి శారీరకంగా, మానసికంగా చక్కని ఆరోగ్యంతో ఎదగడానికి బాల్యంలో పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్లనేనని, అందుకే ఐ.సి.డి.ఎస్ కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ప్రజా సంఘాలు ప్రభుత్వ చట్టాలు, పథకాలపై ప్రజలకు అవగాహన కల్గించాలని ఆయన కోరారు. ప్రభుత్వ చట్టాల పై ప్రజలకు అవగాహన కల్గిన రోజున చట్టంలో ఉన్న లోపాల్ని ఎత్తి చూపే ధైర్యం ప్రజలకు కల్గుతుందన్నారు. ప్రజల్లో సామాజిక చైతన్యం రానిదే మార్పు రాదని, అందుకు ప్రజాసంఘాలు, ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. మాధవరావు మాట్లాడుతూ, ఉపప్రణాళికల బిల్లు కోసం దళిత ఐక్యవేదిక సూచించిన 2 అంశాలు తప్ప మిగిలిన అంశాలన్నింటినీ పరిగణలోనికి తీసుకోవడం జరిగిందని, అదేవిధంగా కేబినెట్ సూచించిన 3 అంశాలు మినహా మిగిలిన అంశాలన్నింటినీ ప్రభుత్వం జి.ఓలోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. సబ్‌ప్లాన్ నోడల్ ఏజెన్సీలో మహిళతో కూడిన ఐదుగురు దళిత వర్గాల సభ్యులుండాలని ప్రభుత్వానికి సూచించామని, దాన్ని మాత్రం జి.ఓలో తీసుకురాలేదన్నారు. ఉపప్రణాళిక బిల్లు అమలయ్యే విధానంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ప్రజా సంఘాలను కోరారు.

ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే జాతీయ స్థాయిలో కూడా ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చే ఉపప్రణాళికల బిల్లు తీసుకొచ్చేందుకు కృషి చేయడం జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలలో చాలా మంది ఈనాటికీ దారిద్ర్యరేఖకు దిగువున నివసిస్తూ ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. ప్రపంచ చరిత్ర చూచినట్లయితే, ఆకలి వేసినప్పుడే ప్రజల్లో క్రోధం వెల్లువెత్తుతుందని, క్రోధం పుట్టినప్పుడే సమాజంలో హింస తలెత్తుతుందని ఆయన అన్నారు. అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. హక్కుల కోసం చేసే పోరాటాలలో షెడ్యూల్డ్ కులాల ప్రజలు స్పందించినంతగా షెడ్యూల్డ్ తెగల వారు స్పందించడం లేదన్నారు.

ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల సమన్వయ కమిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ శ్రీ టి. గోపాలరావు మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉపప్రణాళికలపై ప్రజా సంఘాలకు అవగాహన కలుగచేయడానికి చేసే ప్రయత్నంలో ఈ సమావేశం రెండవదని, మొదటి సమావేశంలో సూచించిన అంశాలన్నింటినీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని తెలిపారు. ఈ చట్టంలో ఉన్న అంశాలను మెరుగ్గా పరిశీలించి ఇంకా లోపాలు ఏమైనా ఉన్నట్లు అయితే వాటిని తెలియచేయటం ఈ సమావేశం ఉద్దేశ్యమని చెప్పారు. ఈ చట్టాన్ని పటిష్ట పరిచి సంరక్షించుకునే బాధ్యత ప్రజా సంఘాలదేనని ఆయన పేర్కొన్నారు.

జాతీయ గిరిజన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ శ్రీ సూర్యానాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని గిరిజనులు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు వారు, షెడ్యూల్డ్ తెగలు వారు కలసి తమ తమ హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో దాదాపు 60 దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు, అపార్డ్ సెంటర్ హెడ్స్, ఫాకల్టీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ■

పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ గొడుగులోని రాష్ట్ర స్థాయి శిక్షణా కేంద్రం ఎ.ఎం.ఆర్. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ (అపార్డ్) ఖాతాలో మరో 3 అవార్డులు వచ్చి చేరాయి. జాతీయ స్థాయిలో పౌర సంబంధాల నిపుణులు, కార్పోరేట్ రంగంలోని సమాచార నిపుణులు, సమాకార ప్రసారరంగ నిపుణులతో ఏర్పడిన సంస్థ అయిన పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని పార్క్ హోటల్‌లో జరిగిన 7వ ప్రపంచ సమాచార సదస్సులో ఈ అవార్డులను అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్. అందుకున్నారు.

ఈ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఎన్నికల కమీషనర్ శ్రీ హెచ్.ఎస్. బ్రహ్మ, విశిష్ట అతిథులుగా కేర్ ఫౌండేషన్ కార్యదర్శి ప్రొ॥ అరుణ్ తివారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.కే. గోయల్, పి.ఆర్.సి.ఐ. గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ శ్రీ ఆర్. నీలమేఘం, చీఫ్ మెంబర్ శ్రీ యం.బి. జయరామ్, అధ్యక్షుడు శ్రీ ఎన్.డి. రాజ్‌పాల్, సదస్సు చైర్మన్ శ్రీ అజయ్‌కుమార్ అగర్వాల్, వైస్ చైర్మన్ శ్రీ రాకేష్ గులాటిలు హాజరైనారు.

ఈ సందర్భంగా ఎన్నికల కమీషనర్ శ్రీ బ్రహ్మ మాట్లాడుతూ, ఆర్థిక వృద్ధికీ, అభివృద్ధికీ కమ్యూనికేషన్ చాలా కీలకమని చెప్పారు. గతంలో వార్తా ప్రసారాల విషయంలో ప్రభుత్వ




# గ్లోబల్ కమ్యూనికేషన్స్ సదస్సులో అపార్డ్‌కు అవార్డులు

నియంత్రణ గణనీయంగా ఉండేదని, ప్రస్తుతం ఇంటర్నెట్ విస్తృతంగా వాడకంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి మారిందని ఆయనన్నారు. సమాచార విప్లవం వల్ల ప్రభుత్వాలలో జవాబుదారీ తనం పెరుగుతుందన్నారు. మీడియా సైతం వ్యాపార ప్రయోజనాల కన్నా దేశ ప్రయోజనాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. అంతర్జాలం పుణ్యమా అని సర్కారుకు సంబంధించిన సమాచార



లభ్యత ప్రజలకు అందుబాటులోకి వచ్చి వారి జీవన విధానాన్ని మెరుగు పరుస్తోందని చెప్పారు. దేశంలో ఓటర్లు ఎక్కడున్నా కూడా ఓటు హక్కు వివరాలు తెలుసుకునేలా వెసులుబాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

కేర్ ఫౌండేషన్ కార్యదర్శి శ్రీ అరుణ్ తివారి మాట్లాడుతూ, నేటి యువత అన్నింటికీ అంతర్జాలంపైనే ఆధారపడుతోందని తెలిపారు. దేశం కోసం ఓటు వేయాలని, వ్యక్తుల కోసం కాదని హితవు పలికారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.కె. గోయల్ మాట్లాడుతూ, రేడియో రావడం సమాచార విప్లవంలో కీలకమైనదని అభివర్ణించారు. మొదటగా సమాచారం కోసం పోరాడిన వ్యక్తి మార్టిన్ లూథర్ కింగ్ కాగా, ప్రజలు అనే భావనను సోక్రటీస్ తీసుకురావడం జరిగిందన్నారు. అయితే పౌర సంబంధాలు అనే అంశాన్ని తీసుకొచ్చింది మాత్రం చాణుక్యడేనని వెల్లడించారు. కౌగిలింత, స్పర్శ, నడక, చర్చలు అనే నాలుగు అంశాలు కమ్యూనికేషన్‌లో చాలా ప్రధానమయినవని ఆయన అన్నారు. పి.ఆర్.సి.ఐ నేషనల్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, 8 ఏళ్ళ తరువాత ప్రపంచ సదస్సును హైదరాబాద్‌లో




నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 350కి పైగా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని, దేశీయ పౌరసంబంధాల రంగ వ్యాపారం ప్రతి సంవత్సరం రూ. 700-800 కోట్లు మేర ఉంటుందని ఆయన వివరించారు.

తదుపరి నిర్వహించిన టెక్నికల్ సెషన్స్‌లో "ప్రభుత్వంలో సమాచార పోకడలు" అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్టికి అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అపార్ట్ కమీషనర్ మాట్లాడుతూ, సంప్రదాయ పద్ధతుల ద్వారా ప్రభుత్వ పథకాల సమాచారం ప్రజలకు చేరటం లేదని అన్నారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజా బహుళ్యాన్ని చేరటం భారతదేశం వంటి సువిశాల దేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితిలో సాధ్యం కాదని, అందుకే ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం క్షేత్రస్థాయిలోనే జరగాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం అర్హులైన కుటుంబాలకు చేరాలంటే గ్రామంలోనే బాధ్యత తీసుకొనే వాలంటరీ వ్యవస్థ ఒకటి ఉండాలని అన్నారు. ఇప్పటికే అపార్డ్ ఈ దిశలో కృషిని ప్రారంభించి 2000 పైగా గ్రామాలలో 35,000 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లను రూపొందించినట్లు తెలిపారు.

"సమాచారం- సుపరిపాలన" అనే అంశంపై రాష్ట్ర యువజన సంక్షేమ కార్యదర్శి శ్రీ లవ్ అగర్వాల్, "సమాచారం - సవాళ్ళు" అనే అంశంపై శ్రీ జితేంద్ర భార్గవ్, "పౌర సంబంధాలు - గుర్తింపు" అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామాత్యులు శ్రీ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, "ప్రజా సంబంధాలు - శిక్షణ" అనే అంశంపై డా॥ సి.వి. నరసింహరెడ్డి ప్రసంగించారు.

అనంతరం వివిధ కేటగిరీలలో అవార్డులు ప్రధానం చేసారు.

### అపార్డు పొందిన అవార్డుల వివరాలు

గ్రామీణాభివృద్ధి మరియు పంచాయితీరాజ్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించే నిమిత్తం ఫిబ్రవరి 2009 నుండి 27,000 పత్రుల సర్క్యులేషన్‌తో ప్రచురింపబడుతున్న "స్థానికపాలన" మాసపత్రికకు కార్పోరేట్ హౌస్ జర్నల్ కేటగిరీలో బ్రాంజ్ అవార్డు లభించింది. వివిధ గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, విధానాలు,




వివరాలతో కూడిన వాస్తవాలను ఈ మాసపత్రికలో అపార్డ్ ప్రచురిస్తుంది. ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే ఒక అంతర్జాతీయ వేదికపై ఈ అవార్డు దక్కించుకోవడం చెప్పుకోదగ్గ విశేషం. అపార్డు వెబ్‌సైట్ (www.apard.gov.in) కు కూడా కాంస్య అవార్డు దక్కింది. ఈ వెబ్‌సైట్‌లో అపార్డు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు, ల్యాబ్ - టు-ల్యాండ్, కీ-క్యాప్, యాక్షన్ రీసెర్చి కార్యక్రమ వివరాలను విస్తరణ శిక్షణా కేంద్రాలలో జరిగే కార్యక్రమాలు ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరుగుతుంది. గ్రామీణాభివృద్ధిలో రంగంలో ఆసక్తి కల్గిన వారు ఈ సౌకర్యం ద్వారా ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని పొందడమేకాక, క్షేత్ర స్థాయిలో తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం అపార్డుతో పంచుకోవడం జరుగుతుంది. అదే విధంగా గ్రామీణాభివృద్ధికి సంబంధించిన విజ్ఞానాన్ని నలుగురికి అందించాలనే ఉద్దేశ్యంతో వివిధ అంశాలపై రూపొందించిన సుమారు 800 పైగా వీడియోలను యూ ట్యూబ్‌లో నిక్షిప్తంచేసి ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచటం జరిగింది.

అదే విధంగా అపార్డు రూపొందించిన 2011-12 వార్షిక నివేదికకు సంబంధిత కేటగిరీలో బ్రాంజ్ అవార్డు లభించింది.

మహేంద్రా & మహేంద్రా టాఫే సిస్కో, కోకోకోలా, మొదలైన 150కి పైగా కార్పోరేట్ సంస్థలతో పోటీపడి ఒక ప్రభుత్వ శిక్షణా సంస్థ ఈ అవార్డులను దక్కించుకోవడం ఒక విశేషం.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నియమాలు తెలుసుకుందాం

**మన రాష్ట్రంలో పంచాయితీరాజ్ సంస్థల ఎన్నికలు నిర్వహణ కార్యక్రమంలో నిమగ్నమయిన ప్రతిఒక్కరూ ఎన్నికల నిర్వహణ నియమాల గురించి తెలుసుకొనవలసిన అవసరమున్నది.**



73వ రాజ్యాంగ సవరణ జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 30-5-1994 నుండి అమలులోనికి వచ్చింది. ఆ తరువాత పంచాయితీరాజ్ సంస్థలకు 1995, 2001, 2006 సం॥రాలలో మూడు సాధారణ ఎన్నికలు జరిగాయి. చివరిసారిగా 2006 సం॥లో ఎన్నిక కాబడిన పాలకవర్గాల గడువు 22.8.2011 నాటికి పూర్తి అయినది. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1997 సెక్షన్ 143 (3) ని అనుసరించి గ్రామ పంచాయితీలకు ప్రత్యేకాధికారులను నియమించిఉన్నారు.

ప్రత్యేకాధికారులు సెక్షను 143(4) ను అనుసరించి గ్రామ పంచాయితీలకు ఎన్నికైన సభ్యులు, సర్పంచ్ తమ తమ పదవులలో చేరు వరకూ, వారి అధికార కృత్యాలు నిర్వహించవలసి యున్నది. ప్రస్తుతము జరగబోవు ఎన్నికలు జీ.వో.ఎం.ఎస్.నం. 142 పి.ఆర్. మరియు ఆర్.డి. (నియమాలు) మే 3, 2006ను అనుసరించి జరగడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది.

ప్రతి గ్రామ పంచాయితీ, దాని జనాభా ననుసరించి, సర్పంచ్ మరియు సభ్యుల సంఖ్యాబలం ఈ క్రింద వివరించిన విధంగా ఉంటుంది.

| | గ్రామ పంచాయితీ జనాభా | సభ్యులు మరియు సర్పంచ్‌తో కలిపి మొత్తము సంఖ్యా బలము |
|---|---|---|
| 1 | 300 వరకు | 5 |
| 2 | 300 మించి 500 మించితే | 7 |
| 3 | 500 మించి 1500 మించితే | 9 |
| 4 | 1500 మించి 3000 మించితే | 11 |
| 5 | 3000 మించి 5000 మించితే | 13 |
| 6 | 5000 మించి 10,000 మించితే | 15 |
| 7 | 10,000 మించి 15,000 మించితే | 17 |
| 8 | 15,000 మించితే | 19, 20కి మధ్య ఉంటుంది. |

పై వివరాల ననుసరించి. ప్రతి గ్రామపంచాయితీ సంఖ్యా బలం (సభ్యుల సంఖ్య సరి సంఖ్యగా నుండి, సర్పంచ్‌లో కలసి బేసి సంఖ్యగా ఉంటుంది.) గ్రామ పంచాయితీ సంఖ్యా బలం, ఆ గ్రామ జనాభా ఆధారంగా పైన వివరించిన విధంగా నిర్ణయిస్తారనే విషయం గమనార్హం.

చివరి సారిగా 2006 సం॥రం లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు 2001 సం॥ జనాభాననుసరించి జరిగాయి. ప్రస్తుతం జరగవలసిన ఎన్నికలు కూడా 2001 జనాభాననుసరించి జరపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాబట్టి, పంచాయితీల సంఖ్యాబలం (సర్పంచ్‌తో

కలిపి పార్టీ సభ్యుల సంఖ్య)లో ఎటువంటి మార్పు ఉండదు.

గమనించవలసిన మరొక ముఖ్య విషయం. పంచాయితీల సంఖ్యా బలం (వార్డుల సంఖ్య) పెరగనప్పటికీ ఆ వార్డులలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశమున్నదని గమనించాలి.

గ్రామ పంచాయితీల ఎన్నికల ఓటర్ల జాబితా సంబంధిత శాసనసభ నియోజక వర్గపు ప్రస్తుత ఓటర్ల జాబితాలోని ఆయా గ్రామాలకు సంబంధించిన భాగం (పోలింగ్ స్టేషన్లు) గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితాగానుండును. గ్రామ పంచాయితీల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేవరకు, శాసనసభ ఓటర్ల జాబితాలో ఆ గ్రామానికి సంబంధించి చేసిన చేర్పులు మార్పులు, చేర్పులు, సవరణలు గ్రామ పంచాయితీల ఓటర్ల జాబితాలో చోటు చేసుకుంటాయి. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1997 సెక్షన్ 143 (3)

ముఖ్యంగా, గ్రామపంచాయితీ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణలు కోరేవారు, శాసనసభ 'ఎలక్టోరల్' రిజిస్ట్రేషన్ అధికారి అయిన సంబంధిత రెవిన్యూ డివిజన్‌లో అధికారి వారికి సంబంధిత నమూనా ఫారంతో క్లయిమ్ దాఖలు చేసి పరిష్కరించు కొనవచ్చును. ఇది నిరంతర కార్యక్రమం అని గమనించాలి.

గ్రామపంచాయితీల ఓటర్ల జాబితాలు ప్రచురణాధికారి అయిన జిల్లా పంచాయితీ అధికారి గ్రామపంచాయితీ ఓటర్ల జాబితాను సంబంధిత వార్డులలో నివసిస్తున్న ఓటర్లు ప్రతిభాగంలో ఉండే విధంగా ఎన్ని వార్డులు ఉంటే, అన్ని భాగాలుగా విభజించాలి. ముఖ్యంగా జిల్లా పంచాయితీ అధికారి శాసనసభ ఓటర్ల జాబితాలో లేని ఎట్టి మార్పులు గాని చేర్పులు గాని , తొలగింపులుగాని సవరణలుగాని తనంట తానుగా చేయరాదు. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1997 సెక్షన్ 143 (3)

### పోటీ చేసే అభ్యర్థులు - అర్హతలు - అనర్హతలు కొన్ని అంశాలు

- సభ్యునిగా లేక సర్పంచ్ పోటీ చేసే అభ్యర్థి గ్రామపంచాయితీ ఓటర్ల జాబితాలో పేరు నమోదు అయి ఉండి. 21 సం॥ నిండి ఉండాలి. (సెక్షను 17, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994)
- కేంద్ర, రాష్ట్ర. ప్రభుత్వ ఉద్యోగి, గ్రామ సేవకుడు మొదలగువారు అర్హులు కారు (అనర్హులు) (సెక్షను 18)
- క్రిమినల్ న్యాయస్థానంచే దోషస్థాపన చేయబడినచో అర్హులుకాదు (సెక్షను 19 (1), 20)
- సమర్థన్యాయ స్థానముచే, మతిస్థిమితం లేదని ప్రకటించిన వ్యక్తి అర్హులు కాదు.(సెక్షను 19 (2))
- చెవిటి, మూగ, కుష్టు వ్యాధితో బాధపడే వ్యక్తి అర్హులు కాదు (సెక్షను 19)
- దివాలా దారునిగా న్యాయ నిర్ణయమునకై దరఖాస్తు పెట్టుకొన్న వ్యక్తి లేక దివాలా దారునిగా ఉన్న వ్యక్తి అర్హులు కాదు. (సెక్షను 19 (2), సి)
- నగర పంచాయితీ లేదా పురపాలక సంఘ సభ్యుడు అర్హులు కాదు. సెక్షను 19 (2)
- గ్రామ పంచాయితీ - మండల పరిషత్ - జిల్లా పరిషత్ పనులలో చలామణిలో ఉన్న కంట్రాక్టర్లు అర్హులుకారు (సెక్షను 19(2), జి)
- ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు గల వ్యక్తి సెక్షను 19 (3) ననుసరించి అర్హులు కాదు.
- పంచాయితీకి బాకీ పడిన వ్యక్తి లేదా ఆడిట్ డిపార్టు మెంట్ వారిచే సర్‌ఛార్జి విధింపబడినవారు (అప్పీలు చేయకుంటే) అర్హులు కాదు.

### నామినేషన్ పత్రం దాఖలు చేసే సమయంలో గమనించవలసిన ముఖ్య అంశములు

- సర్పంచ్ అభ్యర్థికి పోటీ చేసే వ్యక్తికి, లేదా వార్డు సభ్యునికి పోటీ చేసే వ్యక్తికి 21 సం॥ వయస్సు నిండిఉండాలి. (U/S 17) ఓటర్ల జాబితాలో పేరు, నమోదు అయి ఉండాలి. నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి వయస్సు లెక్క కట్టబడుతుంది.
- సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థిని బలపరచే ప్రతిపాదకులు సంబంధిత గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితాలో ఏదైనా వార్డులోని ఓటరు అయి ఉండవలెను.
- వార్డు సభ్యునిగా పోటీ చేసే అభ్యర్థి సంబంధిత గ్రామ పంచాయితీలో ఓటర్ల జాబితాలో రిజిష్టరు అయిన ఓటరు అయి ఉండాలి. బలపరిచే వ్యక్తి (ప్రతిపాదకులు) సంబంధిత వార్డు నందు ఓటరు అయి ఉండాలి.
- నామినేషన్ పత్రం దాఖలు చేసి, రశీదు తీసుకోవాలి. అందు నామినేషన్ పరిశీలించే సమయము తేదీ, ప్రదేశం వివరాలు ఉండాలి.
- ఉపసంహరించుకొన్న నామినేషన్‌కు -ఎట్టి పరిస్థితులలోను - ఉపసంహరణ రద్దు చేసుకొనటానికి అనుమతించబడదు.

ముఖ్యంగా తిరస్కరించిన నామినేషన్లపై సంబంధిత రెవిన్యూ డివిజన్లు ఆఫీసర్ వారికి నామినేషన్ పరిశీలన జరిగిన తదుపరి రోజున అప్పీలు దాఖలు చేసుకొనవచ్చును అప్పీలు దాఖలు చేసిన వెంటనే తదుపరి రోజున అప్పీలు పరిష్కరించబడాలి.

పై వివరాలన్నింటినీ. రాష్ట్ర ఎన్నికలలో కమీషనర్ ఎప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహణ నిమిత్తము జారీ చేసే నియమ నిబంధనలకు, అదే విధంగా చట్టము నందు వచ్చే మార్పులకు లోబడి ఇక్కడ పేర్కొనటం జరిగింది.

**- కె.వి. రాఘవులు**

**రిటైర్డ్ పంచాయితీల విస్తరణాధికారి, ప.గో.జిల్లా**

# భారత్ నిర్మాణ్ అమలు తీరుతెన్నులు

**గ్రామాల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకమిది. ఇందులో ప్రధానంగా రహదారులు, గృహకల్పన, తాగునీరు, సాగునీరు, టెలికం-ఐటీ సేవల కల్పన, విద్యుదీకరణ.... ఇలా ఆరు పథకాలు ఉన్నాయి. వీటిలో రోడ్లు, గృహాలు, తాగునీటి సరఫరా పథకాలు గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోకి వస్తాయి.**

2005-09 మధ్య భారత్ నిర్మాణ్ తొలి దశ అమలు చేశారు. దీనికి మొత్తం బడ్జెట్ రూ. 1.74 లక్షల కోట్లు. ప్రస్తుతం రెండో దశ అమల వుతోంది. ఇందులో ఒక్క రహదారుల అభివృద్ధికే రూ. 1.32 లక్షల కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకాలకు నిధులు భారీగానే కేటాయిస్తున్నారు. ఈ వివరాలు ఒక్కసారి పరిశీలిద్దాం.

- 2012-13లో 30.09 లక్షల లబ్ధిదారులను నమోదు చేశారు. ఇందులో 20.57 లక్షల మందికి ఇళ్లు మంజురయ్యాయి. ఆగస్టు నాటికి 3.83 లక్షల ఇళ్ళు నిర్మించారు.
- **ఆర్థిక సాయం పెంపు:** ప్రస్తుతం సాధారణ స్థలాల్లో నిర్మించే ఇంటికి లబ్ధిదారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ. 45,000గా, కొండ ప్రాంతాల్లో ఇంటికి రూ. 48,500 గా అమల్లో ఉంది. మైదాన ప్రాంతాల్లో సాయాన్ని రూ. 70,000కు, కొండప్రాంతాల్లో రూ. 75,000కు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం 2013-14 బడ్జెట్‌లో ప్రకటించారు. ఇంకా 82 మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో ఒక్కో ఇంటికి సాయాన్ని రూ. 48,500గా నిర్ణయించారు.

## ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై) కేటాయింపులు

| | |
|---|---|
| **2013-14** | **రూ. 15,184 కోట్లు** |
| **2012-13** | **రూ. 11,075 కోట్లు** |

- 2002 జనాభా లెక్కల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న కుటుంబాలు, ఎస్‌సి/ఎస్‌టిలు, వికలాంగులు, బీపీఎల్ మైనారిటీలు ఈ పథకంలో లబ్ధిదారులు.
- 2011-12లో దేశవ్యాప్తంగా మొత్తం 28.77 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, 19.19 లక్షల ఇళ్లను మంజూరు చేశారు. పూర్తయినవి 6.22 లక్షలు (21.64 శాతం మాత్రమే).

## ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన కేటాయింపులు

| | |
|---|---|
| **2013-14** | **రూ. 21,700 కోట్లు** |
| **2012-13** | **రూ. 24,000 కోట్లు** |

- మారుమూల గ్రామీణ ప్రాంతాలకూ రోడ్డు సదుపాయాన్ని కల్పించే ఉద్దేశంతో 2000లో ప్రారంభించిన ఈ పథకానికి పూర్తిగా కేంద్రం నిధులు అందిస్తుంది. 2005లో కేంద్ర ప్రభుత్వం దీన్ని భారత్ నిర్మాణ్‌లోకి చేర్చింది.





- 2012-13లో కొత్త నిర్మాణ లక్ష్యం భారీగా తగ్గిపోయి, 3,000 కిలోమీటర్లకే పరిమితమైంది. ఇందులో కూడా కేవలం 996 కిలోమీటర్లే (అక్టోబర్ వరకూ) పూర్తయ్యాయి. మొత్తం 505 ప్రాంతాలకు గాను 75 ప్రాంతాల్లోనే కార్యక్రమం జరిగింది. ఇక గత ఏడాది అక్టోబర్ నాటికి రూ. 1,700 కోట్లు ఖర్చయ్యాయి.
- ఫేజ్-1 దశలో పూర్తిగా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన 7 రాష్ట్రాలకు ఫేజ్-2 దశలో రోడ్ల నిర్మాణం కోసం నిధుల ను కేటాయించనున్నట్లు బడ్జెట్‌లో శ్రీ చిదంబరం ప్రకటించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఫేజ్-1 కొనసాగుతుంది.



Sthanika_BW_April13.indd 21 02/04/13 3:55 PM

## రాజీవ్‌గాంధీ తాగునీటి మిషన్ కేటాయింపులు

**2013-14 రూ. 11,000 కోట్లు**

**2012-13 రూ. 10,500 కోట్లు**

★ దేశంలో తాగునీటి సౌకర్యం లేని (అన్‌కవర్డ్) అన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాలకూ తాగునీటని అందించాలనేది ఈ పథకం లక్ష్యం.

★ 2012-18లో నాణ్యమైన తాగునీటి సౌకర్యం లేని 26,521 ప్రాంతాలకు ఈ పథకం కింద నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా, సెప్టెంబర్ నాటికి 4,036 ప్రాంతాలు (15.22%) కవర్ అయ్యాయి.

★ పాక్షిక తాగునీటి సౌకర్యం ఉన్న 1,15,139 ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీటిని అందించాలనేది 2012-13 లక్ష్యం. ఇందులో సెప్టెంబర్ నాటికి 27,273 ప్రాంతాలు (23.61%) సౌకర్యానికి నోచుకున్నాయి.

★ సెప్టెంబర్ వరకు దాదాపు రూ. 3 వేల కోట్ల నిధులు మాత్రమే ఖర్చయ్యాయి.

★ కరువు ప్రభావిత ప్రాంతాల్లో 2012-13 ఏడాదికి గాను ఈ పథకానికి అదనపు నిధులను కేంద్రం మంజూరు చేసింది.

## రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుదీకరణ యోజన కేటాయింపులు

**2013-14 రూ. 4,500 కోట్లు**

**2012-13 రూ. 4,900 కోట్లు**



★ విద్యుత్ సౌకర్యం లేని లక్ష గ్రామాలకు కరెంటు... దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న 2.34 కోట్ల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంతో 2005లో ఈ పథకం ప్రారంభమైంది. నోడల్ ఏజెన్సీగా ఆర్ఈసీ వ్యవహరిస్తోంది.

★ ఇప్పటిదాకా కనీసం 300 కుటుంబాలున్న గ్రామాలకు విద్యుదీకరణ లక్ష్యంకాగా, ఇకపై 100 కుటుంబాలున్న గ్రామాలకూ పూర్తి విద్యుదీకరణ చేయాలనేది ప్రణాళిక.

★ 2012-13లో 14,500 విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలను లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటిదాకా 5,050 గ్రామాలకు విద్యుత్ సదుపాయాన్ని కల్పించగలిగారు.

★ ఇక 36.80 లక్షల బీపీఎల్ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలన్న లక్ష్యంలో 11.20 లక్షల కుటుంబాలకు ఈ సదుపాయం కలుగ చేశారు.

★ ఇక 2013-14లో 3,300 విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు విద్యుదీకరణ, 20 లక్షల బీపీఎల్ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



## గ్రామీణ టెలిఫోన్ పథకం కేటాయింపులు

**2013-14 రూ. 3,000 కోట్లు**

**2012-13 రూ. 3,000 కోట్లు**



★ 2014 కల్లా గ్రామాల్లో ప్రతి 100 మందిలో కనీసం 40 మందిని వినియోగదారులుగా చేయాలనేది లక్ష్యం. దేశంలోని మొత్తం 2.5 లక్షల గ్రామ పంచాయితీలకు బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్, పంచాయితీ స్థాయిలో భారత్ నిర్మాణ్ కామన్ సర్వీస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

★ గతేడాది జనవరి నాటికి 1,43 714 పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించారు. ఇక 62,302 గ్రామాలకు గాను 62,046 గ్రామాల్లో విలేజ్ పబ్లిక్ టెలిఫోన్ (వీపీటీ)లను అందించారు.

★ టెలికం శాఖకు చెందిన యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ నిధి (యూఎస్ఓఎఫ్) నుండి ఈ స్కీమ్‌కు ఫండ్స్‌ను అందిస్తున్నారు. ఈ ఫండ్‌కు 2013-14 బడ్జెట్‌లో రూ. 3,000 కోట్లను కేటాయించారు.

## సత్వర సాగునీటి పథకం కేటాయింపులు

**2013-14 రూ. 1,207 కోట్లు**

**2012-13 రూ. 1,081 కోట్లు**

★ 2005-09 మధ్య కోటి హెక్టార్లకు అదనంగా సాగునీటి వసతి కల్పించాలనేది లక్ష్యం. కేంద్ర జలవనరుల శాఖ నేతృత్వంలో ఇవి చేపడుతున్నారు.

★ ఇందులో 42 లక్షల హెక్టార్ల లక్ష్యాన్ని ఇప్పటికే కొనసాగుతున్న భారీ, మధ్య స్థాయి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా సాధించాలని ప్రణాళిక.

★ మరో 10 లక్షల హెక్టార్లకు ప్రస్తుత ప్రాజెక్టుల విస్తరణ, అధునికీకరణతో పాటు కమాండ్ ఏరియా అభివృద్ధి, వాటర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియల ద్వారా సాగునీటిని అందించాలని నిర్ణయించారు.


★ 2008-09 మధ్య మరో 19.3 లక్షల హెక్టార్లు. 2009-10లో 18.5 లక్షల హెక్టార్లను సాగునీటి వసతి పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించారు. 2010-11లో వివిధ రాష్ట్రాలు 8.1 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించినట్లు నివేదించాయి.

◆



Sthanika_BW_April13.indd 22 02/04/13 3:55 PM

# పంచాయతీరాజ్ సంస్థలే ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్ళు



## 1959 అక్టోబర్ 2న రాజస్థాన్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రసంగం

**మనదేశంలో ప్రజాస్వామ్య పరిపాలనకు పునాదిరాయి వంటి పంచాయతీరాజ్ వ్యవస్థకు ఈ రోజు శ్రీకారం చుట్టబోతున్నాము. చారిత్రాత్మకంగా మరియు భౌగోళికంగా రాజస్థాన్ రాష్ట్రం మనదేశానికి హృదయ స్థానంలో ఉంది. రాజస్థాన్‌లోని పల్లెల్లో మరియు పట్టణాల్లో ఉండే ప్రజానీకమంతా ఈ ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఈ బృహత్తర బాధ్యతను తీసుకోవటానికి ముందుకు రావటంతో రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టం ద్వారా ఈ పరిపాలనా బాధ్యతలను ప్రజలకు అప్పగించింది. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. అంతేకాకుండా మహాత్మాగాంధీ జన్మదినాన ఈ పంచాయతీరాజ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టడం మనకు ఎంతో గర్వకారణం.**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనదేశంలో ప్రజాస్వామ్యపాలనను ఏర్పాటు చేసుకున్నాం. దేశంలోని ప్రతీ పౌరునికీ ఓటు హక్కు కల్పించాం. రాష్ట్ర శాసనసభలకు, లోక్‌సభకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకొనే హక్కును ప్రతీ పౌరుడు ఆనందంగా వినియోగించుకున్నాడు. ఓటు హక్కు వినియోగించుకోవటం ప్రజాస్వామ్యంలో ఆహ్వానించదగ్గ పరిణామయినప్పటికీ, నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధించినట్లు కాదు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలలో రాజకీయ చైతన్యం వెల్లివిరిసినప్పుడే మనదేశం ప్రగతి సాధిస్తుంది. దేశం యొక్క ప్రగతి, గ్రామాల యొక్క ప్రగతితోనే ముడిపడి ఉంది. అప్పుడే మనదేశం బలీయదేశంగా ఆవిర్భవిస్తుంది, ప్రపంచంలోని ఏ శక్తి మనల్ని ప్రగతి ప్రధాన నడవకుండా ఆపలేదు.

సరిగ్గా ఏడు సంవత్సరాల క్రితం మనం సాముదాయక అభివృద్ధి ప్రాజెక్టులను, జాతీయ విస్తరణ సేవల పథకాన్ని ప్రారంభించుకోవటం



ద్వారా మనం ఈ మహా ఉద్యమాన్ని ప్రారంభించుకున్నాం. ఈ రెండు కార్యక్రమాలు దేశంలోని మూడు లక్షలపై చిలుకు గ్రామాలలో అమలు చేయబడుతున్నాయి. మొత్తం మీద అద్భుతమైన పని జరిగింది. కానీ సాధించిన విజయాలు ఆశించిన రీతిలో లేవు. ఈ నత్తనడకకు కారణం మనం అధికార యంత్రాంగంపై విపరీతంగా ఆధారపడటమే. అధికారులకు ఉన్న విషయ పరిజ్ఞానంతో ప్రజలకు వారు సహకరించగలరే తప్ప, ప్రజలు బాధ్యత తీసుకోనిదే పనులు నిర్వహించటం సాధ్యంకాదు. అందుకే ప్రజలకు అధికారాన్ని అప్పగించాలి. బాధ్యతలు నిర్వర్తి ంచే విధంగా వారికి తగిన శిక్షణ అందచేయాలి.

అందుకే ప్రజలకు బాధ్యతలకు పంపిణీ చేయటానికి ఒక ధృఢమైన చర్య తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రక్రియలో కేవలం ప్రజలతో సంప్రదింపులు జరపటమే కాక అందుకు అవసరమయిన అధికారాలు కూడా బదలాయించాలి. అందుకే మేమంతా ఆలోచించి ప్రతీ గ్రామంలో ఒక గ్రామ పంచాయతీని అన్ని అధికారాలతో ఏర్పాటు చేయాలి, అదే విధంగా గ్రామ ఆర్థిక వ్యవహారాలను పరిపుష్టం చేయటానికి ఒక సహకార సంఘం ఉండాలి.

గ్రామ పరిపాలనకు సంబంధించిన దైనందిన వ్యవహారాలను చూడటానికి గ్రామపంచాయితీ, గ్రామ ఆర్థిక లావాదేవీలను సహకార సంఘం నిర్వహిస్తాయి. పరిపాలనా బాధ్యతలు కేవలం కొద్ది మంది అధికారుల చేతిలో ఉండకూడదు, ఈ బాధ్యతలు 400 మిలియన్ ప్రజల మధ్య పంపిణీ జరగాలి. ప్రజలందరూ ఒకే త్రాటిపైకి వచ్చి, పరస్పరం సహకరించుకొనేలా మరియు ఒకరితోఒకరు చర్చించుకోనేలా మనం చర్యలు తీసుకోవాలి. గ్రామంలో అత్యవసరంగా ఏర్పాటు చేసుకోవలసిన మూడవ సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రతీగ్రామంలో ఒక పాఠశాల ఏర్పడి పిల్లలంతా మంచి విద్యను పొందగలగాలి. మహిళలకు కూడా చదువుకోవటానికి సమానమయిన అవకాశాలను కలుగ చేయాలి.

మనం ఇప్పుడు రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉన్నాం. ఇది పూర్తికావటానికి ఇంకా దాదాపు ఒక సంవత్సరం వ్యవధి ఇంకా దాదాపు ఒక సంవత్సరం వ్యవధి ఉంది. మూడవ ప్రపంచ వర్ష ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. ప్రణాళికలు రూపకల్పన మరియు అభివృద్ధి పథకాలు అమలు పరిచే బాధ్యతలను ప్రజలకు బదలాయించటానికి అనువైన సమయం వచ్చింది. అందుకే నేను మిమ్మల్ని ఈ బాధ్యతలు తీసుకోవటానికి ధైర్యంగా ముందుకు రమ్మని పిలుపునిస్తున్నారు. ప్రజలకు బాధ్యతలను అప్పగిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఇది కేవలం ఒక్క రాజస్థాన్‌లోనేకాక, దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఇదేవిధంగా మంచి ఫలితాలు వస్తాయనే ధృఢ విశ్వాసం నాకు ఉంది.

పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఈ సుదినాన మీరు తీసుకున్న ఈ చారిత్రాత్మక చర్యను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ పంచాయతీరాజ్ వ్యవస్థను మీరు విజయవంతం చేయాలి.

గతంలో ప్రజలకు, రాజ్యాలను పరిపాలించిన మహారాజులకు మధ్య పూడ్చలేని అగాధాలు ఉండేవి. కానీ ప్రస్తుతం పాలకులకు, పాలితులకు మధ్య భేదం తొలగిపోయింది. కొన్ని సందర్భాలలో అధికారులు సర్వస్వం తామే అన్నట్లుగా ప్రవర్తిస్తుంటారు. కానీ సర్పంచ్‌లు, ప్రెసిడెంట్‌లు ఆ విధంగా ప్రవర్తించరనే విశ్వాసం నాకుంది. పనిచేసే అధికారులు ప్రజామన్నను అధికారంతో పొందలేరు. కానీ ఒక మంచి అధికారి 'సమానత్వం' అనే స్ఫూర్తితో పనిచేస్తారు. అప్పుడే ఆ అధికారి ఇతరులకు శిక్షణ అందచేయగలగుతాడు. మీరంతా పరస్పర సహకార ధోరణితో పనిచేసాడు. రాజకీయంగా ప్రతి ఒక్కరికీ ఓటుహక్కుంది, ఆర్థిక వ్యవహారాల్లో ప్రతీ ఒక్కరికీ సమాన అవకాశాలున్నాయి. పంచాయితీలలో కూడా ప్రతీ ఒక్కరూ సమానంగా పరిగణింపబడాలి, స్త్రీలకు పురుషులకు, ఉన్నతులు నిమ్నజాతి వారు అనే భేదం ఉండకూడదు. మనమందరం ఒక్కటే అనే భావంతో, సౌభ్రాతృత్వంతో, మరియు కర్తవ్య నిర్వహణలో మనపై మనకు విశ్వాసంతో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి.


ఈ దిశలో సాగుతున్న మనల్ని, యావత్ ప్రపంచం వేయి కళ్ళతో గమనిస్తూ ఉంటుంది. మీరు మీ కర్తవ్య నిర్వహణలో ప్రక్కదారి పట్టి, మీలో మీరు గొడవలు పడి, ముఠాలుగా జతకడితే మీ ప్రయత్నంలో సఫలీకృతులు కాలేరు. రాజస్థాన్‌లోని ప్రజలను మీరు మేల్కొల్పాలి. ఇది ఒక మహత్తరమైన కార్యం. ప్రజాస్వామ్యానికి ఈ దేశంలో ఒక ధృఢమైన పునాదిని మీరు వేశారని భవిష్యత్తు తరాల వారు గర్వంగా చెప్పుకొనేలా మీరు మార్గదర్శకులు కావాలి.

**సేకరణ, అనువాదం:**

**డా. వి. శివ శంకర ప్రసాద్**

# చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చిన - వావిలాల

## (29 ఏప్రిల్, 10వ వర్ధంతి సందర్భంగా.....)



**జాతిపిత ఆశయాల కోసం ఆది నుండి అంతం దాకా కృషి చేసి అందరిచేత "ఆంధ్రాగాంధీ" అనిపించుకున్న అనితర సాధ్యమైన మనీషి, నిజమైన జాతీయవాది, నిస్వార్ధ స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య. విశాలాంధ్ర వీరుడుగా ఈ త్యాగధనుడు పేరుపొందారు. సుమారు తొమ్మిది దశాబ్దాల పాటు వెలుగొందిన త్యాగాల జ్వాల మన వావిలాల.**

వావిలాల నరసింహం, పేరిందేవి దంపతులకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 1906 సెప్టెంబరు 17న జన్మించిన బాలుడే గోపాలకృష్ణయ్య. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్న చందంగా నాల్గవ తరగతి చదివే రోజుల్లోనే గురువులు చెప్పే జాతినేతల జీవిత చరిత్రలు విని ప్రేరేపితుడై, తాను కుడా అలా చేయాలనే భావం పెంచుకున్నాడు. 1921లో జరిగిన సహాయ నిరాకరణోద్యమంలో బాలుడైన 14 ఏళ్ల గోపాల కృష్ణయ్య పాఠశాలను బహిష్కరించి, ఉద్యమంలో పాల్గొని పోలీసుల చేత చిక్కాడు. మైనారిటీ తీరని ఈ బుల్లి దేశ భక్తుడ్ని రాజకీయ ఖైదీగా జైలుకు పంపే వీలులేక వదిలి వేశారు.

ఈ ఉద్యమ నేపథ్యం వావిలాల వారి భావి ఉద్యమ జీవితానికి శ్రీకారం చుట్టింది. పెరిగి పెద్దవాడై ఆయన సాగించిన స్వరాజ్య సమర ప్రస్థానంలో 1929 నుండి రాజకీయ ఖైదీగా 14 సార్లు అరస్టయి, మొత్తం ఏడున్నర సంవత్సరాలు కారాగార శిక్ష అనుభవించారు. రాజమండ్రి, కోరాపుట్, కడలూరు, నెల్లూరు, బళ్లారి, మద్రాసు, కలకత్తా, అలీపురం జైళ్లలో దుర్భర జీవితం అనుభవించారు. రాజమండ్రి జైలులో ఉద్యమ ఖైదీల సంఖ్య పెరగడంతో కొందరిని కోరాపుట్ జైలుకు తరలించారు. అందులో వావిలాల కూడా వున్నారు. వారిలో చాలామందికి మలేరియా జ్వరం సోకింది. వావిలాలకు కూడా జ్వరమే. రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు చేరే సరికి వావిలాలకు జ్వరతీవ్రత పెరిగి పడిపోయారట! చనిపోయాడనుకుని బ్రిటీష్ పోలీసులు అమానుషంగా ఆయన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. తరువాత నెమ్మదిగా తెప్పరిల్లి స్వరాజ్య కాంక్ష ఇచ్చిన శక్తితో ఆ సంఘటన నుండి బయటపడి ఆనారోగ్యం నుండి కోలుకుని తిరిగి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు.

ఆద్యంతం గాంధేయవాదంతో మెలిగిన వావిలాల దేశ ప్రగతికి సోషలిజమే శరణ్యమని నమ్మారు. వావిలాల తన 97 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాసేవా జీవితంలో శాసన సభ్యుడిగా మాత్రమే గాక, ప్రజాసేవకుడిగా, పత్రికా రచయితగా, గ్రంధాలయ ఉద్యమ కర్తగా, తొలి అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడిగా, ఇలా ఎన్నో పదవులను చిత్తశుద్ధితో చేపట్టి ప్రతి పదవికీ వన్నెతెచ్చారు.

ముతక ఖద్దరు లాల్చీ, చేతిలో ఖద్దరు సంచీ, చెరగని చిరునవ్వుతో ఎదుటి వారిని ఇట్టే ఆకట్టుకునే వావిలాల 1952 నుండి 1972 వరకూ నాల్గు సార్లు వరుసగా గుంటూరు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజక వర్గం నుండి శాసన సభకు ఎన్నికయ్యారు. మొదటిసారి అవిభక్త మద్రాసు అసెంబ్లీకి, రెండవ సారి ఆంధ్రరాష్ట్ర శాసన సభకు, మూడవ నాల్గవ సార్లు ఆంధ్రప్రదేశ్ శాసన సభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన ఆయన ప్రజానాయకుడు.

అసెంబ్లీ సమావేశాల్లో ఆయన గనుక గొంతు విప్పితే అది సింహగర్జనే అని తోటి సభ్యులు వ్యాఖ్యానించేవారు. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికై పరిస్థితులను బట్టి పాలక పక్షంలో గాని, ప్రతిపక్షంలో గాని పని చేసేవారు. తెలుగును అధికార భాషగా అమలు పర్చాలని డిమాండ్ చేస్తూ అయిదారు సార్లు అసెంబ్లీలో అనధికార బిల్లు ప్రవేశ పెట్టారు. చివరకు ఆయన ఒత్తిడి తట్టుకొలేక, రాష్ట్ర ప్రభుత్వం 1969లో ఆ బిల్లును ఆమోదించి కేంద్రం పరిశీలనకు పంపింది. పిదప అది శాసనంగా మారి, 1974 మార్చి 19 న అధికార భాషా సంఘం ఒక ప్రభుత్వ శాఖగా ఏర్పడింది. దానికి వావిలాల గోపాల కృష్ణయ్య గారే మొదటి అధ్యక్షుడు. ఆ పదవికి కేబినెట్ హోదా ఉన్నప్పటికీ, ఆయన ఆ పదవిలో ఉన్న మూడు సంవత్సరాలు ఒక్క రూపాయి కూడా జీతం తీసుకోలేదు. ప్రభుత్వం ప్రయాణ సౌకర్యాల్లో

మొదటి తరగతి సౌకర్యం కల్పించినప్పటికీ, ఆయన మాత్రం ఎప్పుడూ రెండవ తరగతిలోనే ప్రయాణించేవారు.

ఆయన శాసన సభ్యుడిగా ఉన్నంత కాలం అసెంబ్లీ సమావేశాలకు ముందు, తరువాత కూడా తమ నియోజక వర్గ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వానికి వివరించేవారు. సమావేశ సమయాల్లో కూడా చాలా హుందాగా వ్యవహరిస్తూ ఒక్క అనవసర మాట కూడా మాట్లాడేవారు కాదు. ప్రతిమాట నిర్మాణాత్మకంగా, ప్రయోజనకరంగా వుండేది.

వావిలాల వారు రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంఘాల్లో సభ్యుడుగా ఉంటూ, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, శ్రీశైలం, వంశధార ప్రాజెక్టుల సాధనకు తన వంతు కృషి చేశారు. కృష్ణ, గోదావరి నదీ జలాల పంపిణీలో కూడా ఆయనది ప్రముఖ పాత్ర. ఆనాటి గంథ్రాలయ ప్రచారోద్యమంలో వావిలాల ప్రధాన పాత్ర పోషించారు. 1952 లో సత్తెనపల్లిలో శారదా గ్రంధాలయం స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సహాయ కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశారు. తెనాలి, భీమవరం, తాడేపల్లి గూడెం, సత్తెనపల్లిలలో గ్రంధాలయ యాత్రలు నిర్వహించారు. 1937లో గ్రంధాలయ బిల్లును ప్రకటించారు. రాజా రామ్మోహనరాయ్ ట్రస్ట్ గ్రంథ నిర్వాహక సంఘంలో వీరు సభ్యులుగా పనిచేశారు. మద్రాసు లైబ్రరీ బిల్లులో లేని అనేక ప్రధానమైన అంశాలను రాష్ట్ర లైబ్రరీ బిల్లులో చేర్చారు.

వావిలాల ప్రముఖ విద్యావేత్త కూడా. మన రాష్ట్రంలోని ఆనాటి అన్ని విశ్వ విద్యాలయాల్లో సెనేట్ సభ్యులుగా పని చేశారు. అంతేకాదు, ఆంధ్ర, ఉస్మానియా, నాగార్జున, వెంకటేశ్వర విశ్వ విద్యాలయాలకు ఒకే సారి సెనేట్ సభ్యునిగా పని చేసిన ఘనత ఒక్క వావిలాలకే దక్కింది. ఆయన సంఘ సేవా తత్పరత ఎంతగా వుందో, రచనా తత్వం కూడా అంతగానే ఉంది. తెలుగులోనే గాక ఆంగ్లంలో కూడా అనేక పుస్తకాలు రాశారు. పత్రికా రచయితగా కూడా వెలుగొందిన వావిలాల గోలకొండ పత్రిక, ఆంధ్రప్రభ, తెలంగాణా పత్రిక, ఆంధ్రవార్త, విజయప్రభ, దినవాణి పత్రికలకు రచనలు చేయడమేగాక, ఆంధ్రపత్రిక, బాలభారతి, భారతి, పత్రికలకు సహాయ సంపాదకులుగా; విద్యార్థి, జ్యోతి పత్రికలకు సంపాదకులుగా పని చేశారు. వీటిలో ఈయన రాసిన



07-04-1992 - 'పద్మభూషణ్' స్వీకరణానంతరం రాష్ట్రపతి వెంకట్రామన్‌తో వావిలాల



హైదరాబాద్‌లో 1987 లో శ్రీ వావిలాలకు 'ఆంధ్రరత్న' బిరుదును ప్రదానం చేస్తున్న మానవతామూర్తి మదర్ థెరిసా

సంపాదకీయాలు చిరస్మరణీయమైనవి.

ఆనాటి సాంఘిక దురాచారమైన అంటరానితనం రూపుమాపడానికి హరిజనుల దేవాలయ ప్రవేశం కోసం కూడా వావిలాల వారు విశేషంగా కృషి చేశారు.

1933లో గాంధీజీ పిలుపుపై మంతెనవారిపాలెంలో హరిజనుల ఆలయ ప్రవేశ కార్యక్రమం జరగాల్సి వుండగా, అక్కడి పూజారి పారిపోవడంతో వావిలాల వారే అర్చకుడై, వచ్చిన హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించారు.

గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి త్యాగశీలుర సహచర్యంలో పనిచేసిన వావిలాల వారు నిరాడంబరుడు. నిగర్వి. ఆంధ్రరాష్ట్ర శాంతి సంఘం అధ్యక్షునిగా వావిలాలవారు విదేశీ పర్యటన చేసి, ప్రపంచ శాంతి కోసం తన వంతు కృషి చేశారు. ప్రజా సేవకుడిగా ఆయన చేయని ఉద్యమం లేదు. అక్షరాస్యతా ఉద్యమం ఆయన ఊపిరి. సారా వ్యతిరేక ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి నెల్లూరు జిల్లా 'దూబగుంట'' గ్రామ మహిళలు చేసిన సారా వ్యతిరేక ఉద్యమానికి. అధ్యక్షునిగా వ్యవహరించి, ఆనాటి ఎన్టీఆర్ సారథ్య తెలుగు దేశం ప్రభుత్వం మద్యపాన నిషేధం చేసేదాకా కృషి చేసిన కార్యదక్షుడు ఆయన.

వావిలాల వారు నిస్వార్థంగా చేసిన ప్రజా సేవకు బిరుదులు తృణ ప్రాయం అయినా, 1992 లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో, ఆంధ్రవిశ్వ విద్యాలయం కళాపూర్ణ బిరుదుతో ఆయన్ను సత్కరించాయి. కళాసరస్వతి, ఆంధ్రరత్న, మాదన్న మంత్రి వంటి అరుదైన బిరుదులను కూడా ఆయన పొందారు.

అవిశ్రాంత సంఘసేవకుడైన వావిలాల పెళ్లి, పిల్లలు, సంసారం వంటి బాధ్యతలు సమాజ సేవకు ప్రతిబంధకాలు అన్న ఉద్దేశంతోనేమో అవివాహితునిగానే ఉండి పోయారు. ఆంధ్రదేశంలో జరిగే అన్ని ప్రజా ఉద్యమాలకు జ్యోతిగా భాసిల్లిన వావిలాల 29 ఏప్రిల్ 2003న భౌతికంగా విశ్రమించినా, అభిమానుల గుండెల్లో ఆంధ్రాగాంధీగా సదా గుర్తుండి పోతారు.

- అమ్మిన శ్రీనివాసరాజు

పథకాలపై అవగాహన పెంచటానికో చిరుప్రయత్నం

# పథకానికి పది ప్రశ్నలు



# వలస కార్మికులకు మేలు చేసే రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన

**ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. మన ఆరోగ్యాన్ని మనం జాగ్రత్తగా పరిరక్షించుకుంటే లక్షలాది రూపాయలను పరోక్షంగా పొదుపు చేసుకున్నట్లే. కానీ తరచుగా సంభవించే అనారోగ్యాల వల్ల పేదలకు కలిగే ఆర్థిక నష్టం పలు రూపాల్లో వారిని ప్రభావితం చేస్తుంది. అనారోగ్యం వలన వారి ఆదాయ మార్గాలు కుంటుపడే ప్రమాదముంది.**

చికిత్స చేయించుకోవలసిన అవసరం తలెత్తినా అందుకు ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడం వల్ల అనారోగ్యం ముంచుకు వచ్చే వరకూ చికిత్స గురించి పట్టించుకోరు. అదే ధనిక వర్గాల్లో అయితే వైద్య బీమాను చేయించుకోవటం ద్వారా ఈ సమస్యలను అధిగమిస్తుంటారు. ధనికులతో సమానంగా వైద్య ఆరోగ్య సేవలను పేద ప్రజలకు కూడా కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది

**1. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్.ఎస్.బి.వై.) ఎప్పుడు ప్రారంభమైంది?**

జ. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాలకు ఆరోగ్య బీమా సదుపాయాన్ని వర్తింపచేయడానికి భారత ప్రభుత్వ కార్మిక మరియు ఉద్యోగ మంత్రిత్వ శాఖ రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకాన్ని 2008 ఏప్రిల్ 1 న ప్రారంభించింది.

**2. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్.ఎస్.బి.వై.) ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి ?**

జ. దారిద్ర్య రేఖకు దిగువున ఉండి అనారోగ్య సమస్యల కారణంగా ఆర్థికంగా దెబ్బతినే కుటుంబాలకు రక్షణ కల్పించడమే రాష్ట్రీయ స్వాస్థ్య



బీమా యోజన పథకం ముఖ్య ఉద్దేశం.

**3. ఆర్.ఎస్.బి.వై. పథకం ద్వారా లబ్ధిదారునికి ఎంత మొత్తంలో బీమా సౌకర్యం లభిస్తుంది ?**

జ. ఈ పథకం పరిధిలోకి వచ్చే ఆసుపత్రులన్నిటికీ చాలా రకాల వైద్యాలకు సంబంధించి ప్రభుత్వ ప్యాకేజీ రేట్లను నిర్ణయించింది. ఆ ప్రకారం లబ్ధిదారునికి 30,000/- మేరకు భీమా సౌకర్యం లభిస్తుంది.

**4. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకంలో చేరాలంటే ఎంత మొత్తంలో రుసుము చెల్లించవలసి వుంటుంది ?**

జ. ఆర్.ఎస్.బి.వై. పథకంలో చేరాలంటే లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ రుసుముగా కేవలం రూ. 30/- చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 750/- చెల్లించటం జరుగుతుంది. బీమా సౌకర్యం మొత్తాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వేలం ద్వారా ఎంపిక చేసిన బీమా సంస్థకు చెల్లిస్తాయి.

**5. ఆర్.ఎస్.బి.వై. పథకం కింద కుటుంబంలో ఎంత మంది వరకూ బీమా సౌకర్యం లభిస్తుంది ?**

జ. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన కింద ప్రతి కుటుంబంలో అయిదు మందికి కవరేజి లభిస్తుంది. భార్యా భర్తలకు, వారిపై ఆధారపడ్డ ముగ్గురు వ్యక్తుల వరకూ ఈ సదుపాయం వర్తిస్తుంది.

**6. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకంలో బీమా సంస్థ పాత్ర ఏమిటి?**

జ. ఆర్.ఎస్.బి.వై. పథకంలో నమోదు చేయించుకున్న ఒక్కో కుటుంబం రిజిస్ట్రేషన్ రుసుము మొత్తం బీమా సంస్థకే చెల్లించవలసి వుంటుంది. కాబట్టి దారిద్ర్య రేఖ దిగువున వున్న ప్రజలలో సాధ్యమైనన్ని కుటుంబాలను ఈ పథకంలో చేర్పించడానికి బీమా సంస్థ ప్రయత్నం చేస్తుంది. తద్వారా ఈ పథకం ద్వారా మరింత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుతుంది. ఈ పథకంలో పాల్గొనే ఆసుపత్రులు అనవసరమైన చికిత్సలు చేయకుండా, మోసంతో ఎక్కువ మొత్తాన్ని రాబట్టకుండా బీమా సంస్థలు జాగ్రత్త తీసుకుంటాయి.

**7. ఆర్.ఎస్.బి.వై. పథకంలో ఆసుపత్రుల పాత్ర ఏమిటి ?**

జ. చికిత్స అందించిన ప్రతి వ్యక్తికిగాను ఆసుపత్రి వారికి డబ్బు చెల్లించడం జరుగుతుంది. కాబట్టి ఎక్కువ మందికి చికిత్స అందిస్తే ఆసుపత్రి వారికి ఎక్కువ డబ్బు ముడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రి

# మన గ్రామం కోసం – మనమందరం







## ప్రజా మన్నన పొందుతున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలు

**కీ-క్యాప్‌లో భాగంగా వై.యస్.ఆర్. కడప జిల్లా, వల్లూరు మండలం, కొప్పోలు గ్రామంలో భారత నిర్మాణ్ వాలంటీర్ల బృందం ద్వారా గ్రామ అభివృద్ధికి అమలవుతున్న కార్యక్రమాలు ప్రజా మన్ననలు పొందుతున్నాయి.**

గ్రామ అభివృద్ధిలో భాగంగా వీరు తమ సొంత ఖర్చులతో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భారత నిర్మాణ్ వాలంటీర్ల బృందం నాయకుడు ధన కొండయ్య మాట్లాడుతూ, గ్రామంలోని 30 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధికి చేయూత నిస్తున్నావరని చెప్పారు. రాత్రి సమయంలో చీకటి వుండడం వలన విష పురుగులు ఎక్కువగా తిరుగుతున్నాయని, వీటి వలన ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, దీనిని నివారించటానికి మండల ప్రాథమిక పాఠశాల నుండి గంగమ్మ గుడి వద్ద 30 వీధి దీపాలను ఉచితంగా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అందరూ తమ గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు జిల్లా పరిషత్ శిక్షణా మేనేజర్ పాల్గొన్నారు.

**- ఏ.వి. సురేష్ కుమార్**

**జిల్లా పరిషత్ శిక్షణా మేనేజర్, వై.యస్.ఆర్. కడప జిల్లా**

వారికి సైతం ఈ ఆర్.ఎస్.బి.వై. పథకం కింద రోగులకు వైద్య సేవ లందించినందుకుగాను ప్రోత్సాహకం ఉంటుంది. బీమా సంస్థ వారి నుండి నగదు నేరుగా సంబంధించిన ఆసుపత్రికి మాత్రమే చేరుతుంది.

**8. ఈ పథకంలో లబ్ధిదారులు ఏ విధంగా ఆసుపత్రులలో గుర్తింప బడతారు ?**

జ. ఈ ఆర్.ఎస్.బి.వై. పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుకి వారి వేలిముద్రలతో, ఫొటోలతో కూడిన బయో మెట్రిక్ ఎనేబిల్డ్ (వేలిముద్రలతో పనిచేసే) స్మార్ట్ కార్డులు ఇవ్వబడతాయి. ఆర్.ఎస్.బి.వై. పథకంలో ఉన్న ఆసుపత్రులన్నింటిలో కంప్యూటర్లు ఉంటాయి. ఇవన్నీ ఒక జిల్లా స్థాయిలో ఒక సర్వర్ కంప్యూటర్‌తో అనుసంధానింపబడి ఉంటాయి. దీని వలన సేవల వినియోగం గురించిన సమాచారం ఒకచోట నుండి మరొక చోటకి సులభంగా అందుతుంది.

**9. వైద్యం అనంతరం నగదు రహిత, కాగిత రహిత లావాదేవీలను ఎవరు నిర్వహిస్తారు ?**

జ. ఆర్.ఎస్.బి.వై. లబ్ధిదారులు డబ్బులు లేకుండా నియమిత ఆసుపత్రులలో చికిత్స పొందగలరు. వారు కేవలం తమ స్మార్ట్ కార్డును తీసుకెళ్ళి వారి వేలిముద్రలతో గుర్తింపబడితే సరిపోతుంది. వైద్య సేవలందించేవారు చికిత్సకు సంబంధించిన పత్రాలన్నింటినీ బీమా సంస్థకు పంపనవసరం లేదు. వారు వారికి రావలసిన మొత్తం వివరాలను కంప్యూటర్ ద్వారా పంపితే వారికి ఎలక్ట్రానిక్ పద్ధతిలో డబ్బు ముడుతుంది.

**10. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి, రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకానికి భేదం ఏమిటి ?**

జ. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం మాత్రమే కాబట్టి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటితే ఈ పథకాన్ని ఉపయోగించుకునే వీలు లేదు. అయితే ఆరోగ్యశ్రీతో పోల్చుకుంటే చిన్న మొత్తంలో బీమా సౌకర్యం కలిగిన పథకమైనప్పటికీ, ఈ రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం కాబట్టి, లబ్ధిదారులు తమ స్మార్ట్ కార్డులను మొత్తం దేశంలో ఈ పథకం పరిధిలోకి వచ్చే ఏ ఆసుపత్రిలోనైనా వినియోగించుకుని వైద్యసదుపాయం పొందవచ్చు. ఒక రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు జీవనోపాధులకు వలసవెళ్ళే వలస కార్మికులకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది. వలస కార్మికుల విభాగం కార్డును వారితో విడిగా తీసుకెళ్ళడానికి వీలుగా కార్డును విడగొట్టే సదుపాయం కూడా ఉంది. ■

# యువతకు ఉపాధి నైపుణ్యాల శిక్షణకు రూ. 1000 కోట్లు



## కేంద్ర బడ్జెట్

**2013-14 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ పి. చిదంబరం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో యువతకు పెద్దపీట వేశారు. అనేక వినూత్నమయిన అవకాశాలను కల్పించటంతో పాటు రూ. 1000 కోట్ల నిధులను యువతలో నైపుణ్యాల పెంపుదలకు కేటాయించారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా 10 లక్షల మంది యువతకు నైపుణ్యాల పెంపుదలకు ఈ నిధులను వెచ్చిస్తారు.**

బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సందర్భంలో ఆర్థిక మంత్రి చిదంబరం మాట్లాడుతూ, "యువతను సాన బెట్టాలి. వారిలోని నైపుణ్యాలను వెలికి తీయాలి. ఆ దిశగా యువతను ప్రోత్సహించాలి. అందుకు కేంద్రం గతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగమే నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎన్.ఎస్.డి.సి.). వివిధ నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడే విధంగా విద్యా ప్రమాణాలు, పాఠ్యాంశాలను రూపొందించడం దీని విధి. ఏ సంస్థ అయినా ముందుకొచ్చి ఎన్.ఎస్.డి.సి. ప్రమాణాల ప్రకారం శిక్షణా కోర్సులను అందించవచ్చు" అని తెలియజేశారు.

ఈ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు అధికారిక ధృవీకరణ సంస్థలు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైతే వారికి సర్టిఫికెట్‌తో పాటు సగటున రూ. 10,000 నగదు కూడా అందిస్తారు. ఈ శిక్షణ ద్వారా యువతలో ఉపాధి నైపుణ్యాలు, ఉత్పాదకత, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

అంతేకాక, స్వయం ఉపాధి ప్రోత్సహించడానికి సాంకేతికపరంగా తీసుకోవలసిన చర్యలను వేగవంతం చేస్తారు. ఇందుకై అదనపు వసతులు, టెక్నాలజీ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దీనికయ్యే ఖర్చు మొత్తం రూ॥ 2200 కోట్లు రూపాయలను ప్రపంచ బ్యాంకు ద్వారా సమకూర్చుతారు. ఉన్నత విద్య కోసం రూ॥ 6587 లు కేటాయించారు. ఇది గత సంవత్సరం కేటాయింపుల కన్నా 17% శాతం అదనం.

అదే విధంగా రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్‌కు గత సంవత్సర బడ్జెట్ కేటాయింపుల కన్నా 25% శాతం అదనంగా కేటాయించడం జరిగింది. సమాజంలో బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ మైనారిటీల పిల్లలకు రూ॥ 5284 కోట్లను స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించడం జరిగింది. ఇంత మొత్తంలో స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించడం ద్వారా ఎటువంటి అవాంతరాలు లేకుండా సరైన సమయంలో వారి వారి స్కాలర్‌షిప్‌లను పొందడం జరుగుతుంది.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్, గౌహతి మరియు ఇన్‌టాక్ మొదలగు నాలుగు ప్రావీణ్యత కలిగిన విశ్వవిద్యాలయాల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.100 కోట్లు కేటాయించడం జరిగింది. అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ తరహాలో గత సంవత్సరం ఏర్పాటు చేసిన 6 వైద్య సంస్థలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆసుపత్రుల కోసం రూ॥ 1650 కోట్లను కేటాయించారు.

ఫలితంగా ఈ సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రజలకు సేవలు అందజేస్తాయి. దేశంలో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో పాటియాలా వద్ద జాతీయ క్రీడా శిక్షణా సంస్థను ఏర్పాటు చేయడం కోసం 250 కోట్లను కూడా ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. ■

# ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో ఇనాం భూముల సమస్యలు



**1. ఇనాం భూములు అంటే ఏమిటి ?**

తెలంగాణా ప్రాంతంలో ఇనాం భూములనగా నైజాముగాని, జాగీర్ధారు కాని, సంస్థానాధీశుడుగాని, ఇతర సమర్ధాధికారి గాని సేవలందించే నిబంధనపై గాని, లేదా అటువంటి నిబంధన లేకుండా గాని బహుమానంగా మంజూరు చేసిన భూములు. అట్టి భూములపై భూమి శిస్తు, పూర్తిగా గాని, పాక్షికంగా గాని మినహాయింపు కలిగి ముంతఖాబు ద్వారా నిర్ధారింపబడినది. అదే విధంగా ఆంధ్ర ప్రాంతంలో ప్రతిభాపాటవాలకు మరియు సేవలందించినందుకు గాను ప్రభుత్వం వారు కేటాయించిన భూములు. వీటిపై కూడా పూర్తిగా గాని, పాక్షికంగా గాని శిస్తు మినహాయింపు ఉంటుంది.

**2. ఆక్యుపెన్సీ రైట్సు సర్టిఫికెట్ (ఓ.ఆర్.సి.) అంటే ఏమిటి?**

ఓ.ఆర్.సి. అంటే తెలంగాణా ప్రాంతంలో ఇనాం భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన వారికి ఆంధ్రప్రదేశ్ ఇనాంల రద్దు (తెలంగాణా ప్రాంతం) చట్టం - 1955 ప్రకారం ఫారం-3లో జారీ చేసే స్వాధీన హక్కు పత్రం.

**3. ఇనాం భూములు కొనుగోలు చేయవచ్చా? కొనుగోలు చేస్తే పట్టా వస్తుందా?**

ఇనాం భూములు అనుభవించటానికి గాని అన్యాక్రాంతం చేయటానికి వీలు లేదు. ఇనాం భూములు రద్దుకాబడిన తర్వాత చట్ట ప్రకారం ఆంధ్రా ప్రాంతంలో రైత్వారీ పట్టా, తెలంగాణ ప్రాంతంలో ఆక్యుపెన్సీ రైట్సు సర్టిఫికెట్ పొందవచ్చును. అప్పుడు సర్వహక్కులు వస్తాయి. ఆంధ్రప్రదేశ్ ఇనాంల రద్దు (తెలంగాణా ప్రాంతం) చట్టం 1955, ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రా ఏరియా) ఇనాముల రద్దు మరియు రైత్వారిగా మార్పు చట్టం - 1956 లోని సెక్షన్-10(బి) ప్రకారం ఇనాందారు తన ఇనాం భూమిని అప్పటి విలువ ప్రకారం పూర్తి క్రయధనం పొంది మరొకరికి విక్రయించినట్లైతే, ఆ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తినే ఇనాందారుగా పరిగణించి ఓ.ఆర్.సి / రైత్వారీ పట్టా మంజూరు చేస్తారు.

**4. ఇనాం భూములకు పట్టా తెచ్చుకోవాలంటే, ఏం చెయ్యాలి?**

ఇనాం భూములకు సంబంధించి ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు వేర్వేరు చట్టాలున్నాయి. ఆంధ్ర ప్రాంతంలో ఇనాంలు రద్దుపరచిన తర్వాత రైత్వారీ పట్టా కోసం సంబంధిత తహశీల్దారుకు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన తర్వాత తహశీల్దారు విచారణ చేసి, రికార్డులు పరిశీలించి ఫారం - 8లో పట్టా జారీ చేస్తారు.

తెలంగాణా ప్రాంతంలో ఓ.ఆర్.సి పొందటానికి సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి దరఖాస్తు చేయాలి. రెవెన్యూ డివిజనల్ అధికారి విచారణ జరిపించి ఓ.ఆర్.సి.ని జారీ చేస్తారు.

**5. ఇనాం భూములకు పట్టా పొందడానికి ఎంత రుసుము చెల్లించాలి?**

ఆంధ్ర ప్రాంతంలో ఇనాం భూములకు పట్టా పొందటానికి ఏ విధమైన రుసుము చెల్లించనవసరం లేదు. తెలంగాణా ప్రాంతంలో మాత్రం ఆక్యుపెన్సీ రైట్సు సర్టిఫికెట్ పొందడానికి నిర్ధారించిన శిస్తుకు 9 నుండి 60 రెట్లు పది సంవత్సరాలపాటు సమాన వాయిదాలలో చెల్లించవలసి ఉంటుంది.

**6. ఇనాం భూములను కౌలుకు తీసుకున్న వారికి పట్టాదారు పాసు పుస్తకం,టైటిల్ డీడ్ ఇస్తారా?**

ఇనాం భూములను కౌలుకు తీసుకున్న వారికి కూడా ఓ.ఆర్.సి. ఇవ్వడానికి చట్టంలో అవకాశముంది. తెలంగాణా ప్రాంతంలో ఓ.ఆర్.సి. పొందిన తర్వాత ఫారం-6(ఎ)లో దరఖాస్తు చేసుకుంటే ఆర్.ఓ.ఆర్ చట్టం క్రింద విచారణ చేసి పాసు పుస్తకం / టైటిల్ డీడ్ పొందవచ్చు. ఆంధ్ర ప్రాంతంలో 7.1.1948 నాటికి కౌలుదారుగా ఆ భూమి అనుభంలో ఉన్నట్లుగా నిర్ధారించుకోగలిగితే, ఆ భూమిపై 1/3వ వంతు ఇనాందారుకు, 2/3 వరకు కౌలుదారుకు రైత్వారీ పట్టా ఇస్తారు. రైత్వారీ పట్టా పొందినవారికి పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్ ఇస్తారు.

**7. ఆంధ్ర ప్రదేశ్ (తెలంగాణ ప్రాంతం) ఇనాముల రద్దు చట్టం, 1955 క్రింద ఏ ఏ రకాల వ్యక్తులకు ఇనాం భూములకు స్వాధీన ధృవీకరణ పత్రం (ORC) జారీ చేయబడును?**

1. ఖాబిజు ఖదీము 2. ఇనాందారు 3. శాశ్వత కౌలుదారు, 4. రక్షిత కౌలుదారు, 5. అరక్షిత కౌలుదారులకు స్వాధీన ధృవీకరణ పత్రాలను ఆర్.డి ఓ. జారీ చేస్తారు. 1-11-1973 నాటికి వారి స్వాధీనంలో ఆ భూమి ఉండాలి.

**8. స్వాధీన ధృవీకరణ పత్రం (ORC) పొందడానికి దరఖాస్తును ఏ అధికారికి ఇవ్వాలి? జత చేయవలసిన ఇతర పత్రాలు ఏవి ?**

దరఖాస్తు ఫారం నెం. 1 లో వ్రాసి, భూమి ఇనాం భూమిగా ధృవీకరించే పత్రం (ఖాస్ర పహాణీ నకల్), 1973-74 మరియు దరఖాస్తు చేసుకున్న సంవత్సర పహాణీ, నకళ్ళను ఆర్.డి.ఓ. గారికి ఇచ్చినట్లయితే తగు విచారణానంతరం ఫారం-III పై స్వాధీన ధృవీకరణ పత్రం జారీ అవుతుంది. తర్వాత పట్టాదారు పాసు పుస్తకం మరియు టైటిల్ డీడులు జారీ చేయబడతాయి.

**9. ఏ రకాలైన ఇనాం భూములు పట్టాలపై ఇవ్వకూడదు?**

గ్రామస్తుల సామాజిక అవసరాలకు కావలసిన భూములు, సేద్యంలో లేని మరియు సేద్యయోగ్యంకాని భూములు, పచ్చిక బయళ్ళు, అడవులు, గనులు, క్వారీలు, వాగులు, చెరువులు, శిఖం భూములు, మత్స్యశాఖ భూములు మరియు గ్రామాలలో సంతలు నిర్వహించే భూములకు ORC ఇవ్వబడదు.

**10. ధర్మాదాయ, మతపరమైన ఇనాం భూములకు సంబంధించి స్వాధీన ధృవీకరణ పత్రములు (ORC) కొరకు ఎవరికి దరఖాస్తు చేసుకొనవలెను ?**

ట్రస్టీలు, మేనేజ్‌మెంటు కమిటీల వారు, ఎగ్జిక్యూటివ్ అధికారులు ఆర్.డి. ఓ.కి దరఖాస్తు చేసుకోవాలి. తగు విచారణానంతరం ఆర్.డి. ఓ. సంస్థల పేర్లపై మాత్రమే ORCలు జారీ చేస్తారు.

**11. రెవెన్యూ డివిజనల్ అధికారి ఉత్తర్వులపై అసంతృప్తులైన వారు ఎవరికి అప్పీలు చేసుకోవాలి?**

జిల్లా కలెక్టరు గారికి, ఉత్తర్వు తేదీ నుండి 30 రోజులలో అప్పీలు చేసుకోవాలి. హైకోర్టులో కలెక్టరు ఆర్డరుపై 3 మాసాలలో రివిజన్ వేయవచ్చు.

**12. "దస్తగర్దా" ఇనాములు అనగా ఏవి?**

1955 వ, సంవత్సర ఇనాం భూముల రద్దు చట్టం, తెలంగాణ ప్రాంతంలో 20/7/1955 తేదీన అమలులోనికి వచ్చింది. పర్యవసానంగా, రద్దయిన ఇనాం భూములన్నింటి యాజమాన్యపు హక్కులు ప్రభుత్వ పరమైనవి. ఇట్టి ఇనాంలపై గతంలో మాఫీ చేసిన శిస్తును కూడా రద్దు చేసి, ఇతర పట్టా భూములపై వసూలు చేయబడే భూమి శిస్తుకు సమానంగా వసూలు చేసినారు. ఈ రకంగా రద్దయిన ఇనాంలను "దస్తగర్దా ఇనాములు" అంటారు.

**13. ఇనాం భూములపై రక్షిత కౌల్దారుగా ఉన్నవారికి పట్టాదారు పాసు పుస్తకం,టైటిల్ డీడ్ ఇస్తారా?**

తెలంగాణా ప్రాంతంలో రక్షిత కౌలుదారులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు వారు 38- ఇ సర్టిఫికెటు పొంది యాజమాన్యపు హక్కులు కలిగి ఉంటే ఆర్.ఓ.ఆర్. చట్టం ప్రకారం పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్ పొందడానికి అర్హులు.

**14. ఇనాం భూములను అమ్ముకోవచ్చా?**

ఇనాం భూములను అనుభవించాలి కానీ అన్యాక్రాంతం చేయరాదు. ఇనాం భూములకు పట్టా పొందిన తరువాత ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు వస్తాయి. కాబట్టి ఇనాం భూములకు పట్టాలు / (ORC) లు పొందిన తరువాత వాటిని అమ్ముకోవచ్చు.

**15. ఇనాం భూమికి పట్టా పొందటానికి ఎలాంటి ఆధారాలు కావాలి?**

ఆంధ్ర ప్రాంతంలో ఇనాం ఫెయిర్ రిజిష్టర్ (ఐ.ఎఫ్.ఆర్)లో సంబంధిత వ్యక్తి పేరు ఇనాందారుగా నమోదై ఉండాలి. ఇనాం గ్రాంటు తాలూకు ఉత్తర్వులు, కౌలుదార్లయితే 7.1.1948 నాటికి వారి పేర్లు కౌలుదార్లుగా భూమి రికార్డుల్లో ఉండాలి. అలాగే తెలంగాణా ప్రాంతంలో ఇనాం రిజిష్టరులో సంబంధిత వ్యక్తి పేరు నమోదు కాబడి ఉండాలి. ఇనాం భూమి, సంబంధిత వ్యక్తిగాని అతని వారసులు కానీ తేది 20.7.1955 నాటికి స్వాధీనానుభవంలో భూమిపై ఉండాలి.

**16. ఇనాం భూమికి పట్టా రాలేదు. ఈ భూమి భూ సేకరణ క్రింద పోయింది. నష్ట పరిహారం వస్తుందా?**

ఇనాం భూమికి పట్టాకానీ, ఓ.ఆర్.సి. గాని ఉంటేనే భూమిపై హక్కులు ఏర్పడతాయి. భూమిపై హక్కున్నవారికి మాత్రమే నష్టపరిహారం వస్తుంది. అటువంటి పరిస్థితులలో నష్టపరిహారాన్ని సివిల్ కోర్టులో డిపాజిట్ చేస్తారు. ఇనాం భూమికి పట్టాగానీ, ఓ.ఆర్.సి. కానీ వచ్చిన తర్వాత మాత్రమే కోర్టు ద్వారా నష్టపరిహారం పొందవచ్చు.

**17. ఇనాం భూమిని సాగు చేసుకుంటున్నాను. నేను ఇనాందారున్ని కాదు. నాకు పట్టా వస్తుందా?**

ఆంధ్రా ప్రాంతానికి సంబంధించి 7.1.1948 నాటికి కౌలుదారుగా ఇనాం భూమిని సాగు చేస్తున్న వారికి, అలాగే తెలంగాణా ప్రాంతంలో 12.7.1955 నాటికి కౌలుదారుగా గానీ, రక్షిత కౌలుదారుగా గానీ భూమిని సాగు చేస్తుంటే అటువంటి వారికి మాత్రమే పట్టా వస్తుంది. సెక్షన్ 10బి ప్రకారం ఇనాందారు తన ఇనాం భూమిని అమ్మితే, కొనుగోలు చేసిన వ్యక్తిని ఇనాందారుగా పరిగణించి పట్టాఇవ్వవచ్చు.

**(అపార్డ్ ల్యాండ్ సెల్ సౌజన్యంతో)**

# సమాచార హక్కు చట్టం

## గ్రామ పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారం

**భారతదేశంలో సమాచారహక్కు చట్టం 2005 నుండి అమలులో ఉన్నపటికీ, నేటికినీ అమలులో, అన్వయంలో ఎవరికి తోచిన విధంగా వారు తమకు ఇబ్బంది కలగని విధంగా దారి మరల్చడానికి ప్రయత్నిస్తున్నారే తప్ప చట్టం యొక్క ఉద్దేశ్యాలు, లక్ష్యాలకు అనుగుణంగా కావలసినన్ని చర్యలు తీసుకోవటం లేదు. ప్రజా సంఘాలు, ప్రభుత్వ శిక్షణా సంస్థల ద్వారా ఎన్ని శిక్షణలు ఇచ్చినప్పటికీ అమలులో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నట్లుగా గమనిస్తున్నాం.**

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 (1) (బి) అనే దానికి విస్తృతమైన అర్థం, పరిధి కలిగి ఉన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. చట్టం యొక్క లక్ష్యమైన పారదర్శకత, జవాబుదారీతనం అనే పదాలకు సెక్షన్ 4 (1)(బి)కి ముడిపడి ఉన్నది.

సమాచార హక్కు బిల్లు-2005ను పార్లమెంటు అమోదించిన తర్వాత జూన్ 5, 2005న రాష్ట్రపతి ఆమోదించారు. 'సమాచార హక్కు చట్టం-2005' ని జూన్ 21, 2005 న భారత్ ప్రభుత్వ గెజిట్ నెం. 25లో వచ్చింది.

సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజాసాధికారి (పబ్లిక్ అథారిటి) చట్టం అమలులోకి వచ్చిన 120 రోజులలో, అనగా తేది. 23.09.2005/ 12.10.2005 వరకు తప్పనిసరిగా కొన్ని విధులను నిర్వర్తించవలసి ఉంది.

కార్యాలయంలోని రికార్డులు అన్నీ విషయసూచిక (క్యాటలాగ్) ఆధారంగా క్రమపద్ధతిలో తయారు చేసుకోవాలి. వనరులు ఉన్నట్లయితే, ముఖ్యమైన రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించాలి. సమాచారాన్ని ఇంటర్‌నెట్ ద్వారా దేశ ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలి.

ఈ చట్టం సెక్షన్ 4 (1)(బి) ప్రకారం చట్టం అమలులోకి వచ్చిన 120 రోజులలో ప్రజాసాధికారి చాప్టర్ 2 నుండి 17 లలో సూచించిన 17 అంశాలపై సమాచారాన్ని తయారుచేసి, ప్రజలకు, పౌరసంఘాలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు, సమాచార అధికారులకు, అప్పిలేట్ అధికారులకు కూడా అర్థం అయ్యే విధంగా సమాచారాన్ని ఉంచాలి.

### 4 (1) (బి) యొక్క ఉద్దేశ్యం

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 (1) (బి) యొక్క ఉద్దేశ్యం, వివిధ సంస్థలలోని సమాచారాన్ని సానుకూలంగా వెల్లడి చేయాలని, అంటే ఎవరో వచ్చి సమాచారాన్ని అడిగేదాకా ఉండకుండా చట్టం అమలు లోకి వచ్చిన 120 రోజులలో ఆ శాఖకు సంబంధించిన సమాచారాన్ని ప్రకటించాలి. జూన్ 21, 2005 నుండి 120 దినాలలో ఎలక్ట్రానిక్ పద్ధతిలో కాని, పుస్తక రూపంలో కాని ఈ క్రింది 17 చాప్టర్ల ద్వారా తయారు చేసిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అలా ఎవరూ అడగకుండా తనకు తానుగా ఆ సంస్థ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడమే 4 (1) (బి) ఉద్దేశ్యం.

## సమాచార హక్కు చట్టం-2005 లోని సెక్షన్ 4 (1) (బి) ఏమి చెబుతుందో తెలుసుకుందాం

*గ్రామ పంచాయితీలలో 4 (1) (బి)కి సంబంధించి 17 ఛాప్టర్‌ల గురించి తెలుసుకుందాం:*

### పంచాయితీ 4 (1) (బి) రిజిస్టర్

#### ఛాప్టర్ -1

గ్రామ పంచాయితీకి ప్రజాసాధికారులు (పబ్లిక్ అథారిటి) క్రింది విధంగా ఉంటారు. ఆ సంస్థ యొక్క నిర్మాణ స్వరూపం, విధులు, కర్తవ్యాల వివరాలు, అనగా పంచాయితీ ఎందుకోసం ఏర్పాటు చేయబడినది, అది అందించే సేవలు, దాని ద్వారా నిర్వహించే పనుల ను పొందుపర్చాలి.

#### సెక్షన్ 4 (1) (బి)

సమాచార హక్కు చట్టం -2005

| క్ర.సం | అధికారి హోదా | అధికారి పేరు | ఫోన్ నం. |
|---|---|---|---|
| 1 | ప్రజా సమాచార అధికారి | ఇ.ఓ.పి.ఆర్.ఆర్.డి | |
| 2 | సహాయ ప్రజా సమాచార అధికారి | పంచాయితీ కార్యదర్శి | |
| 3 | అప్పిలేట్ అధికారి | యం.పి.డి.ఓ | |

### గ్రామ పంచాయితీ విధులు- బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం సెక్షన్ 45 ప్రకారం, పంచాయితీ విధులను చాప్టర్-1 లో రాసుకోవాలి. ముఖ్యంగా పారిశుద్ధ్యం, లైటింగ్, అంటువ్యాధుల నివారణకు, త్రాగునీటి సరఫరా వంటి సేవలకు సంబంధించిన అన్ని విధులు ఈ చాప్టర్‌లో వస్తాయి. (జీ.ఓ.నెం. 138 పి.ఆర్. తేది 18.04.2004 రూల్సు విడుదల చేయబడినవి)

#### ఛాప్టర్ -2

#### సెక్షన్ 4 (1) (బి) (2)

**2. సంస్థలోని అధికారులు, ఉద్యోగుల అధికారాలు, విధులు**

అధికారులు, ఉద్యోగులకున్న అధికారాలు, విధులు జి.ఓ.నెం. 199 ప్రకారం, పంచాయితీ కార్యదర్శి విధులు క్రింద రాయాలి (జాబ్ చార్టులు రాయాలి).

| క్ర.సం | అధికారి పేరు | అధికారి హోదా | అధికారి విధులు | ఫోన్. నెం. |
|---|---|---|---|---|
| 1. | | పంచాయితీ కార్యదర్శి | జి.ఓ.యమ్ఎస్.నె. 199 ప్రకారంగా తన విధులను రాయాలి. | |
| 2. | | జూనియర్ సహాయకులు | విధులు రాయాలి. | |
| 3. | | శానిటరీ ఇన్స్‌పెక్టర్ | విధులు రాయాలి. | |
| 4. | | బిల్ కలెక్టర్ | విధులు రాయాలి. | |
| 5. | | పంప్ ఆపరేటర్ | విధులు రాయాలి. | |



Sthanika_BW_April13.indd 23 02/04/13 3:55 PM

## ఛాప్టర్-3
### సెక్షన్ 4 (1) (బి) (3)

**3. పర్యవేక్షణ, జవాబుదారీతనంతో సహా నిర్ణయాలు చేసే ప్రక్రియలో అనుసరించే కార్య విధానం.**

పర్యవేక్షణ, జవాబుదారీతనానికి సంబంధించిన మార్గాలతో పాటు నిర్ణయ ప్రక్రియలో అనుసరించే విధానాలు. నిర్ణయ ప్రక్రియలో కమిటీ ఈ క్రింది విధంగా ఉంటుంది.

1. సర్పంచ్ - అధ్యక్షతన కమిటీ సమావేశం అవుతుంది.
2. ఉప సర్పంచ్ - ఉపాధ్యక్షులు
3. వార్డు సభ్యులు - 8 నుండి 22 మంది ఉంటారు
4. మండల ప్రజా సభ్యులు - పై కమిటీతో నిర్ణయాలు తీసుకోబడుతాయి.

గ్రామ పంచాయితీ సమావేశాలలో విధాన నిర్ణయాలు చేస్తారు. జి.ఓ. నెం. 227 పి.ఆర్.ఆర్.డి రిలీఫ్ (ఎం.2) తేదీ: 13.04.1995లలో సమావేశాల రూల్సును అనుసరించి, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 సెక్షన్ 37, 38 & 41 ప్రకారంగా పర్యవేక్షణ, జవాబుదారీతనంతో నిర్ణయాలు చేయబడతాయి.

ప్రతిరోజూ విధి నిర్వహణలో భాగంగా పనిచేస్తున్నప్పుడు వచ్చే సమస్యలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది నిర్ణయాలు తీసుకొని పరిష్కరిస్తారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవటం, పర్యవేక్షణ చేయటం జరుగుతుందని పై ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్-4
### సెక్షన్ 4 (1) (బి) (4)

**4. కార్యకలాపాలు నిర్వర్తించేందుకు రూపొందించినటువంటి ప్రమాణాలు.**

**కార్యనిర్వహణలో పాటించే సూత్రాలు :** ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పంచాయితీరాజ్ చట్టం-1994 అనుసరించి పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటారు. మీటింగ్స్ జి.ఓ నెం. 227 పి.ఆర్.ఆర్.డి రిలీప్ (ఎం.2) తేది: 13.04.1995 పౌర సేవా పత్రం ప్రకారం పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటారు. పౌర సేవా పత్రం వివరాలు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ - 5
### సెక్షన్ 4 (1) (బి) (5)

**5. కార్యకలాపాలు నిర్వర్తించేందుకు తమ ఉద్యోగులకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, ఆదేశాలు లేదా తమ నియంత్రణ క్రింద ఉన్న లేదా ఉపయోగించే నియమాలను వివరించే సంపుటలు, రికార్డులు ఈ ఛాప్టర్‌లో రాయాలి.**

ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం -1994 ప్రకారం, వివిధ రకాలైన ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం వారు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా పరిపాలనలో ఉద్యోగులు నియమ నిబంధనలు పాటిస్తారు అనే విషయం తెలిసే విధంగా రాయాలి.

## ఛాప్టర్ - 6
### సెక్షన్ 4 (1) (బి) (6)

**6. తాము కలిగి ఉన్న లేదా తమ నియంత్రణ క్రింద ఉన్న డాక్యుమెంట్లు, వర్గీకరణ వివరాలు.**

నియంత్రణలో ఉన్న పత్రాల రకాలకు సంబంధించిన ప్రకటన ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం-1994 పంచాయితీ నిర్వహణకు ప్రభుత్వం నుండి వచ్చిన జి.ఓ.లు, సర్క్యులర్‌లు, గ్రామ పంచాయితీలో నిర్వహించే అన్ని రిజిష్టర్ల పేర్లు రాయాలి. అనగా నగదు పుస్తకం మొదలుకొని జనన, మరణ రిజిష్టర్ల వరకు మొత్తం పంచాయితీలో నిర్వహించే దాదాపు 40 రిజిష్టర్ల పేర్లు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్- 7
### సెక్షన్ 4 (1) (బి) (7)

**7. తమ విధాన రూపకల్పనకు సంబంధించి లేదా దాని అమలు విషయంలో ప్రజలను సంప్రదించేందుకు లేదా వారు విజ్ఞప్తి చేసుకునేందుకు కలిగి ఉన్న ఏదైనా ఏర్పాటు వివరాలు.**

విధానాల రూపకల్పన కోసం, లేక వాటి అమలు కోసం పౌరులతో సంప్రదింపులు జరిపేందుకు లేక వారి ప్రాతినిధ్యం స్వీకరించేందుకు ఏదైనా పద్ధతి ఉన్నట్లు అయితే, దాని వివరాలు, గ్రామసభ నిర్వహణ తేదీలు 2 జనవరి, 14 ఏప్రిల్, 1 జులై, 3 అక్టోబర్ తేదీలలో గ్రామసభ ద్వారా ప్రజలను సంప్రదిస్తారనే విషయం తెలపాలి. జి.ఓ. సంఖ్య 162 పి.ఆర్ ఆర్.డి. డిపార్ట్‌మెంట్, తేది: 04.04.1997 ప్రకారం గ్రామసభ, 227 ప్రకారం గ్రామపంచాయితీ నిర్వహణ నిబంధనలు అనుసరించి ప్రజల అభిప్రాయాలను స్వీకరించి లేదా సంప్రదించి విధానాలను రూపొందించడం జరుగుతుంది అని రాయాలి.

## ఛాప్టర్ -8
### సెక్షన్ 4 (1) (బి) (8)

**8. తమ విధానంలో భాగంగా లేదా సలహాలు పొందటం కోసం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులతో ఏర్పాటై ఉన్న బోర్డులు, కౌన్సిళ్లు, కమిటీలు, తదితర సంస్థల వివరాలు. ఈ బోర్డులు, కౌన్సిళ్లు, కమిటీలు, తదితర సంస్థల సమావేశాలకు ప్రజలు హాజరు కావచ్చునా?**

1. సర్పంచ్ - అధ్యక్షతన కమిటీ సమావేశం అవుతుంది.
2. ఉప సర్పంచ్ - ఉపాధ్యక్షులు
3. వార్డు సభ్యులు - 8 నుండి 22 మంది ఉంటారు
4. మండల ప్రజా సభ్యులు - పై కమిటీతో నిర్ణయాలు తీసుకోబడుతాయి.

పంచాయితీ సమావేశాలకు ప్రజలను అవసరమైన సందర్భాలలో అనుమతిస్తారు. జి.ఓ. 227 ప్రకారం గ్రామ పంచాయితీలో జరిగిన సమావేశ తీర్మానాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. అట్టి సమావేశాల చర్చల వివరాలను ప్రజలు తెలుసుకోవచ్చును. వివరాలను పొందవచ్చు అని రాయాలి.

## ఛాప్టర్ -9
### సెక్షన్ 4 (1) (బి) (9)

**9. తమ అధికారులు, ఉద్యోగుల డైరెక్టరీ**

| క్ర.సం | అధికారి పేరు | అధికారి హోదా | ఫోన్. నెం. |
|---|---|---|---|
| 1 | | పంచాయితీ కార్యదర్శి | |
| 2 | | జూనియర్ సహాయకులు | |
| 3 | | శానిటరీ ఇన్‌స్పెక్టర్ | |
| 4 | | బిల్ కలెక్టర్ | |
| 5 | | పంప్ ఆపరేటర్ | |


Sthanika_BW_April13.indd 24 02/04/13 3:55 PM

## ఛాప్టర్-10
### సెక్షన్ 4 (1) (బి) (10)

**10. తమ అధికారులు, ఉద్యోగులలో ప్రతి ఒక్కరు తీసుకునే నెలవారీ ప్రతిఫలం తమ నిబంధనలలో వీలు కల్పించిన విధంగా పరిహారం విధానం.**

అధికారులు, ఉద్యోగులు పొందే నెలవారీ వేతనం, దాని నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపు విధానం వివరాలను రాయాలి.

| క.సం | అధికారి పేరు | అధికారి హోదా | పొందుతున్న జీతం |
|---|---|---|---|
| 1 | | పంచాయితీ కార్యదర్శి | |
| 2 | | జూనియర్ సహాయకులు | |
| 3 | | శానిటరీ ఇన్‌స్పెక్టర్ | |
| 4 | | బిల్ కలెక్టర్ | |
| 5 | | పంప్ ఆపరేటర్ | |
| 6 | | స్వీపర్స్ | |

## ఛాప్టర్ -11
### సెక్షన్ 4 (1) (బి) (11)

**11. అన్ని ప్రణాళికలు, ప్రతిపాదిత వ్యయాలు, జరిపిన చెల్లింపుల వివరాలు విడివిడిగా పేర్కొంటూ దాని కింద ఉన్న అన్ని ఏజన్సీలకు కేటాయించిన బడ్జెట్ వివరాలు ఆదాయ, వ్యయ పట్టికలు క్రింద పద్దులవారీగా రాయాలి.**

1. గ్రామ పంచాయితీ బడ్జెట్ వివరాలు
2. గ్రామపంచాయితీకి వచ్చే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, 13వ ఆర్థిక సంఘం నిధుల, వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు, ఫండ్‌కు సంబంధించిన ప్రణాళికలను (యాక్షన్‌ప్లాన్)ను పొందుపర్చాలి.
3. చేసిన ఖర్చులకు సంబంధించిన వివరాలు రాయాలి.
4. ఏజన్సీలకు కేటాయించిన వివరాలు.
5. గ్రామ పంచాయితీ సాధారణ నిధులు, ఆదాయ, వ్యయాల వివరాలు ఈ ఛాప్టర్‌లో ముద్రించాలి.

## ఛాప్టర్ - 12
### సెక్షన్ 4 (1) (బి) (12)

**12. సబ్సిడీ కార్యక్రమాలను అమలు పరిచే పద్ధతి, కేటాయించిన మొత్తాలు, ఆ కార్యక్రమాల లబ్ధిదారుల వివరాలు.**

1. గ్రామపంచాయితీ సబ్సిడీ పథకాలను అమలు చేయదు. కాని ఆ గ్రామానికి సంబంధించి మండలంలో సబ్సిడి పథకాల మంజూరుకి సంబంధించిన సమాచారాన్ని సేకరించి పథకాల వారీగా రికార్డులు నిర్వహించాలి.

సబ్సిడీ పథకాల అమలు తీరు, వాటికి కేటాయించిన నిధులు, ఆ పథకాల లబ్ధిదారుల వివరాలు, సబ్సిడీలపై లోన్‌లు పొందిన వారి వివరాలు, ఎస్.సి కార్పోరేషన్, ఎస్.టి కార్పోరేషన్ లబ్ధిదారులు గ్రామంలో ఉంటే వారి వివరాలు సేకరించి పొందిన సబ్సిడీ వివరాలు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ -13
### సెక్షన్ 4 (1) (బి) (13)

**13. రాయితీలు పొందే వారి వివరాలు, తాము మంజూరు చేసే పర్మిట్లు లేదా అనుమతుల వివరాలు.**

గ్రామంలో ఏవైనా మినహాయింపులు, అనుమతులు పొందిన లబ్ధిదారులు ఉంటే వారి వివరాలు తెలపాలి. అనగా నిరుపేదలైన కుటుంబాలవారు, గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాల వారు ఇంటి పన్నులాంటి మినహాయింపులు పొంది ఉంటే ఇక్కడ వాటి వివరాలు రాయాలి. గృహ నిర్మాణ అనుమతులు పొందుతున్న వారి వివరాలు పొందుపరచాలి.

## ఛాప్టర్ - 14
### సెక్షన్ 4 (1) (బి) (14)

**14. తమ వద్ద లభ్యంగా ఉన్న లేదా తాము కలిగి ఉన్న, ఎలక్ట్రానిక్ రూపంలోకి తగ్గించబడినట్టి సమాచారానికి సంబంధించిన వివరాలు.**

అందుబాటులో ఉన్న లేక నియంత్రణలో ఉన్న సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో కుదించి ఉంటే ఆ వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తమైన వివరాల సైటు అడ్రసు రాయాలి. అనగా ప్రియాసాఫ్ట్, పి.ఇ.యస్. (పంచాయితీ ఎంటర్ ప్రైజెస్ సూట్) సైటు వివరాలు రాయాలి. ఉదా: పంచాయితీ జిఓవి.ఇన్ లాంటివి ఈ ఛాప్టర్‌లో పొందుపరచాలి.

## ఛాప్టర్ -15
### సెక్షన్ 4 (1) (బి) (15)

**15. ప్రజల ఉపయోగార్థం లైబ్రరీని లేదా రీడింగ్‌రూంను నిర్వహిస్తున్నట్లయితే వాటి పనివేళలతో సహా సమాచారం పొందడంలో పౌరులకు లభ్యమయ్యే సదుపాయాల వివరాలు.**

ప్రజల కోసం ఏదైనా గ్రంథాలయం, లేక పఠనాలయం నిర్వహిస్తూ ఉండి ఉంటే వాటి పని వేళలతో పాటు, సమాచారం పొందడానికి ప్రజలకున్న సదుపాయాల వివరాలు.

ఉదా: 'గ్రంథాలయం ప్రతిరోజు ఉదయం 8 గంIIల నుండి 11 గంIIల వరకు, 4 గంIIల నుండి 8 గంIIల వరకు పనిచేస్తుంది' అనే బోర్డు రాయాలి. దానికి సంబంధించిన వివరాలు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ -16
### సెక్షన్ 4 (1) (బి) (16)

**16. పౌర సమాచార అధికారుల పేర్లు, హోదా, ఇతర వివరాలు**

పౌర సమాచార అధికారుల పేర్లు, హోదా, ఇతర వివరాలు జి.ఓ.యమ్.యస్. నెం. 465 పి.ఆర్ ఆర్.డి గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్, లేదా: 19.03.2012

| క్ర.సం | అధికారి పేరు | అధికారి హోదా | ఫోను నెం. |
|---|---|---|---|
| 1. | | ప్రజా సమాచార అధికారి, ఇ.ఓ.పి.ఆర్.డి | |
| 2 | | సహాయ ప్రజా సమాచార అధికారి, పంచాయితీ కార్యదర్శి | |
| 3 | | అప్పిలేట్ అధికారి, యం.పి.డి.ఓ | |

## ఛాప్టర్- 17
### సెక్షన్ 4 (1) (బి) (17)

**17. ఇతర నిర్దిష్ట సమాచారం**

నిర్ణయించిన తీరుగా ఇతర సమాచారం ఏదైనా, ఆ తర్వాత ఆ ప్రకటనలన్నిటినీ ప్రతి ఏడాది తాజా సమాచారంతో సరిచేసి మళ్లీ ప్రకటించడం.

*- డాII జి. ఆంజనేయులు*
*డిప్యూటీ డైరెక్టర్ (శిక్షణ), ఎ.ఎమ్.ఆర్.అపార్డ్*



Sthanika_BW_April13.indd 25 02/04/13 3:55 PM



# మహిళల భాగస్వామ్యంతోనే సమాజం అభివృద్ధి

**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8, 2013న అపార్డ్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్డ్ సిబ్బందికి, శిక్షణార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు.**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, సెర్ప్ సి.ఇ.ఓ శ్రీ బి. రాజశేఖర్, టిస్ హైదరాబాద్ డైరక్టర్ ప్రొ॥ లక్ష్మీలింగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అపార్డ్ కమీషనర్ శ్రీ చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో ప్రత్యేక చట్టాలు, పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఇంకా సమాజంలో మాతమ్మలు, బసవినులు, జోగినులు నేటికీ ఉన్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే చట్టాలు, పథకాలపై ప్రజలకు అవగాహన కల్గించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ ఒక్కో భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా తయారవ్వాలన్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 (ఎ)లోని అంశాలను దేశంలో యువతీ యువకులందరికీ అతని బాధ్యత, కర్తవ్యం మొదలైన అంశాలను తెలియజేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం, చట్టం సక్రమంగా అమలవుతాయన్నారు.

మహిళా సాధికారత కోసం చేసే ప్రతి కార్యక్రమంలో కూడా పురుషులను భాగస్వామ్యం చేయాలన్నారు. అప్పుడే కోరుకున్న మార్పు రావటానికి అవకాశం ఉంటుందన్నారు.

సెర్ప్ సి.ఇ.ఓ శ్రీ బి. రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ రోజు ప్రతి మహిళ కుటుంబాన్ని నడపగలిగే శక్తిగా ఎదిగిందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి మహిళకు గుర్తింపు వచ్చిందన్నారు. మహిళలకు మెరుగైన సేవలను అందించేందుకు సెర్ప్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

ఏ సంస్థ ఐతే ప్రజలతో మమేకమై వారి భాగస్వామ్యంతో పనిచేస్తోందో అక్కడ ఎలాంటి పథకమైనా విజయవంతం అవుతుందని, దాదాపు 1 కోటి 14 లక్షల మంది మహిళలతో 10 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాల గల ఒక వ్యవస్థ విజయవంతంగా నడుపుతున్న ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదేనని తెలియజేశారు.

దేశంలో భ్రూణ హత్యలు అక్కడక్కడ ఇంకా జరుగుతున్నాయని వీటిని అరికట్టటానికి ప్రతి మహిళా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని అపార్డ్‌లోని మహిళా శిశు అభివృద్ధి కేంద్రం నిర్వహించింది. ఈ విభాగాధిపతి శ్రీమతి ఆర్. శివపార్వతి సమన్వయపర్చగా, ఫ్యాకల్టీ సభ్యులు మాధురి, ఉషారాణి, సుగుణ, సునీత, సత్యవాణి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించటంలో సహకరించారు.

ఈ కార్యక్రమంలో అపార్ట్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది. అపార్డులో శిక్షణకు విచ్చేసిన శిక్షకులు, మరియు టిస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



Sthanika_Color_Apil13.indd 21 02/04/13 3:31 PM

# గ్రామీణాభివృద్ధికి ఈసారి కేంద్ర బడ్జెట్‌లో 46 శాతం అదనపు కేటాయింపులు

**యుపిఎ ప్రభుత్వం రెండో విడత అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశ పెట్టిన చివరి పూర్తిస్థాయి 2013-14 సంవత్సర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం సమర్పించారు. గ్రామీణులు, గృహిణులు, వేతన జీవులు, పారిశ్రామిక, వాణిజ్య వర్గాల వారు ఈ బడ్జెట్ నుంచి చాలా ఆశించారు. అయన సమర్పించిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వెలువడింది. ఈ నాటికీ మన దేశ జనాభాలో 69 శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. గ్రామీణాభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తారు.**

2013-14 వార్షిక బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి రూ. 80,194 కోట్లు కేటాయించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం, ప్రధానమంత్రి సడక్ యోజన్ వంటి కీలక పథకాలను గ్రామీణాభివృద్ధి శాఖ అమలు పరుస్తోంది. 2012-13 బడ్జెట్‌తో పోలిస్తే, 2013-14 సంవత్సర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి 46 శాతం నిధులు పెంచడం గమనార్హం.

### ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు మంచినీటి సరఫరా

రక్షిత మంచినీరు అందించేందుకు 2013-14 వార్షిక బడ్జెట్‌లో రూ. 15,200 కోట్లు ప్రతిపాదించారు. ఫ్లోరైడు పీడిత గ్రామాలలో నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుంది. ఇందుకుగాను బడ్జెట్‌లో రూ. 1,400 కోట్లు ప్రతిపాదించారు. ఈ కేటాయింపుల వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 332 ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలకు సురక్షిత మంచినీరు లభ్యమవుతుంది. మన రాష్ట్రంలోని ప్రకాశం, నల్లగొండ జిల్లాల్లో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉంది. ప్రకాశం జిల్లాలోని 195 గ్రామాల ప్రజలు, నల్లగొండ జిల్లాలోని 61 గ్రామాల ప్రజలు ఫ్లోరైడు సమస్యతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం

గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి 2013-14 బడ్జెట్‌లో రూ. 33,000 కోట్లు ప్రతిపాదించారు. ఈ పథకాన్ని 2006 ఫిబ్రవరి 2వ తేదీన ప్రవేశ పెట్టినప్పుడు సగటున రూ. 65 ఉన్న వేతనం ఇప్పుడు రూ. 115 కు పెరిగింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 4.39 కోట్ల కుటుంబాలకు 156.01 కోట్ల పనిదినాలు కల్పించారు. ఈ పథకం వలన 53% మహిళలు, 22% ఎస్సీలు, 16% ఎస్టీలు ప్రయోజనం పొందారు. ఉపాధి హామీ పథకానికి 2012-13 బడ్జెట్‌లో రూ. 33 వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పటివరకు రూ. 25,894 కోట్లు విడుదల చేశారు.

ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గుతోంది. ఈ పథకానికి 2011-12 బడ్జెట్‌లో 40 వేల కోట్ల రూపాయలు కేటాయించినా, ఖర్చు చేసింది రూ. 35,840 కోట్లు. 2012-13 వార్షిక బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి 33 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. 2013-14 వార్షిక బడ్జెట్‌లో కూడా ఉపాధి హామీ పథకం అమలుకు గత సంవత్సరం కేటాయించిన రూ. 33,000 కోట్లనే కేటాయించారు. ఈ కేటాయింపులను పూర్తిగా వినియోగిస్తారని ఆశిద్దాం.

### ఇందిరా ఆవాస్ యోజన్

ఈ పథకానికి 2013-14 బడ్జెట్‌లో రూ. 15,184 కోట్లు కేటాయించారు.

## కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశంలో తొలి మహిళా బ్యాంకు

- ప్రాథమిక మూలధనంగా రూ. 1000 కోట్లు
- నవంబర్‌లో ప్రారంభం
- మహిళలే సర్వస్వంగా ఏర్పాటు



దేశంలో తొలిసారిగా మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక బ్యాంకును ఏర్పాటు చేయనుంది. మహిళాభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఈ కొత్త బ్యాంకుకు ప్రాథమిక మూలధనంగా రూ. 1000 కోట్లను కేంద్ర ప్రభుత్వం సమకూర్చుతుంది.

కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో ఈ మేరకు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో భారతదేశపు మొట్టమొదటి మహిళా బ్యాంకును ఏర్పాటు చేస్తాం. ఈ బ్యాంకు ఏర్పాటుకు అవసరమైన అనుమతి, లైసెన్స్‌లు అక్టోబర్ నాటికి సిద్ధమవుతాయని భావిస్తున్నాను" అని చిదంబరం అన్నారు. బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన తర్వాత అయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది నవంబర్‌లోనే మహిళా బ్యాంకును ప్రారంభిస్తామని చెప్పారు.

ఈ బ్యాంకు నిర్వహణ, లావాదేవీలు అన్నీ మహిళలే కేంద్రంగా సాగుతాయి. సిబ్బందిలో అత్యధిక శాతం స్త్రీలే ఉంటారు. పురుషులు డిపాజిట్లు చేయవచ్చు. ప్రధానంగా మహిళా వ్యాపారవేత్తలకు రుణాలు ఇవ్వడం, స్వయం సహాయక బృందాలకు మద్ధతివ్వడం, స్త్రీల జీవనోపాధికి అండగా నిలవడం లాంటి కార్యకలాపాలను ఈ ప్రతిపాదిత బ్యాంకు నిర్వహిస్తుంది.

మన రాష్ట్రంలో ఇప్పటికే స్త్రీ నిధి పేరుతో మహిళా స్వయం సహాయక సంఘ సభ్యుల పరపతి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం "స్త్రీ నిధి' పేరుతో మహిళా బ్యాంకును ఏర్పరచిన విషయం పాఠకులకు విదితమే. ◆



Sthanika_Color_Apil13.indd 17 02/04/13 3:31 PM

దేశంలోని నిరుపేదలకు గృహవసతి కల్పించాలన్నది ఈ పథకం ఆశయం. ప్రస్తుతం ఈ పథకం కింద ఒక్కో పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం మైదాన ప్రాంతాలలో ఇళ్ళు నిర్మించుకునేవారికి రూ. 45,000, కొండ ప్రాంతాలలో ఇళ్ళు నిర్మించుకునేవారికి రూ. 48,500 చొప్పున కేంద్ర ప్రభుత్వం ధన సహాయం చేస్తుంది. ఈ పరిమితిని 2013-14 ఆర్థిక సంవత్సరం నుండి వరుసగా రూ. 70 వేలు, రూ. 75 వేలకు పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## అందరికీ ఆరోగ్యం

అందరికీ ఆరోగ్యం తమ ప్రభుత్వ ప్రాధాన్య అంశమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి, ఇందుకోసం 2013-14 బడ్జెట్‌లో నిధులు పెంచింది. కుటుంబ నియంత్రణ శాఖకు రూ. 37,330 కోట్లు కేటాయించారు. గత సంవత్సర బడ్జెట్‌తో పోలిస్తే, ఇది 24 శాతం అధికం. చాప కింద నీరులా వ్యాపిస్తున్న ఎయిడ్స్ నివారణకు బడ్జెట్‌లో రూ. 1,785 కోట్లు కేటాయించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌కు 2013-14 బడ్జెట్‌లో కేటాయింపులు అధికం చేశారు. ప్రతిపాదిత పట్టణ ఆరోగ్య మిషన్, గ్రామీణ ఆరోగ్యమిషన్‌తో కలిపి నూతనంగా తీసుకు వచ్చిన జాతీయ ఆరోగ్య మిషన్ పథకానికి రూ. 21,239 కోట్లు కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలకు అందించే నిధులు, విరాళాలకు పన్ను తగ్గింపు సదుపాయాన్ని బడ్జెట్‌లో కల్పించారు.

## గ్రామాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం అత్యావశ్యకం

ఈ నాటికీ అనేక గ్రామాలలో సరైన రోడ్ల నిర్మాణం జరగనందువలన గ్రామీణులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 2013-14 బడ్జెట్‌లో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకానికి రూ. 21,700 కోట్లు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని పూర్తి గావించి వాటి ఆధునీకరణ కోసం ఎదురుచూస్తున్నట్లు ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

## అందరికీ విద్య

అందరికీ విద్య లక్ష్యంతో 2013-14 బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 65,860 కోట్లు ప్రతిపాదించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ నాటికీ అనేక గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే, కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలి. 2012-13 సంవత్సర బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే ఎక్కువ నిధులను విద్యాహక్కు, సర్వశిక్షా అభియాన్‌లకు కేటాయించారు. గత సంవత్సరం ఇందుకోసం రూ. 25,255 కోట్లు కేటాయించారు. మాధ్యమిక విద్యకు ఈ సంవత్సరం 25.6 శాతం నిధులను అదనంగా కేటాయించారు. అంగన్‌వాడీ వర్కర్లకు బీమా సదుపాయాన్ని కల్పించనున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించడం హర్షదాయకం.

## గ్రామీణ ప్రాంతాలలో నక్సల్స్ ప్రభావం

ఈ కారణంగా గ్రామాల్లో అశాంతి నెలకొని ఉందని భావించిన ప్రభుత్వం నక్సల్స్‌పై పోరాటానికి రూ. 10,818 కోట్లు ప్రతిపాదించింది. గత ఆగస్టు వరకూ చిదంబరం హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి అనుభవంతోనే మావోయిస్టులను నిర్మూలించేందుకు సీ.ఆర్.పి. ఎఫ్‌కు ఎక్కువ నిధులు కేటాయించి ఉండవచ్చు.

'రైతేరాజు' అన్నారు ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో. రైతు బాగుండాలని కోరుకున్నారు. పైరు పచ్చగా ఉంటే దేశం స్వయం సమృద్ధమవుతుందన్నారు. ఈ కారణంగానే వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎరువుల దగ్గర నుండి వ్యవసాయానికి అవసరమైన అన్ని వస్తువుల సేవల ధరలు బాగా పెరిగి సేద్యం ఖర్చులు గణనీయంగా పెరిగాయి. అందుకు అవసరమైన ఆర్థిక సాయం రైతులకు లభ్యం కావడంలేదు. ఈ నాటికీ అనేక మంది రైతులు రుణాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దేశంలోని రుణాలలో 8% కూడా రైతులకు అందడంలేదు.

2013-14 ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఇచ్చే స్వల్పకాల పంట రుణాలను రూ. 7 లక్షల కోట్లకు పెంచారు. ఇది గత సంవత్సరంలోని కేటాయింపుల కంటే రూ. 1.25 లక్షల కోట్లు అధికం. సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించే రైతులకు 4 శాతం వడ్డీకే రుణాలు ఇస్తారు. ఈ పథకాన్ని ఇప్పటి వరకూ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు అమలు పరుస్తున్నాయి. ఇక మీదట ఈ రుణాలను ప్రైవేటు రంగంలోని షెడ్యూల్డ్, సహకార బ్యాంకులు కూడా రైతులకు సమకూరుస్తాయి.

తూర్పు భారతంలో మరో హరిత విప్లవం పథకం విజయవంతం అవుతున్న దృష్ట్యా, ఇందుకోసం వెయ్యి కోట్ల రూపాయలను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. హరిత విప్లవం తరువాత ప్రభుత్వపరంగా ఆశించిన స్థాయిలో పరిశోధనలు జరుగలేదు. 2013-14 వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ పరిశోధనకు రూ. 3,415 కోట్లు కేటాయించారు. మన దేశంలోని రైతులలో ఎక్కువ మంది చిన్న, సన్న కారు రైతులు. వీరు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ సంవత్సరం బడ్జెట్‌లో వీరి సంక్షేమం కోసం రూ. 5,830 కోట్లు కేటాయించడం మంచి నిర్ణయం 2013-14 బడ్జెట్‌లో వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కోసం రూ. 5,387 కోట్లు ప్రతిపాదించారు.

రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర లభించినప్పుడే అమ్మే స్థితిలో ఉండాలి. దీనికి కోల్డు స్టోరేజీలను నిర్మించాలి. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 500 కోట్లు ప్రతిపాదించారు. సరైన మార్కెట్ వసతులు లేక రైతులు కష్టపడుతున్నారు. ఈ సమస్యను కొంతమేర పరిష్కరించడం కోసం మార్కెట్ వసతులను మెరుగు పరిచేందుకు రూ. 50 కోట్లు ప్రతిపాదించారు. ఈ నిధులతో రైతుల ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేస్తారు. నిధుల సమస్యతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేయలేని ప్రాజెక్టులకు సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సత్వర సాగునీటి ప్రయోజన పథకానికి 2013-14 బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. ఇందుకోసం 2013-14 వార్షిక బడ్జెట్‌లో రూ. 14,242 కోట్లు కేటాయించగా, 2013-14 బడ్జెట్‌లో రూ. 12,962 కోట్లు కేటాయించారు. దేశీయంగా పట్టు పురుగుల పెంపకాన్ని పరిరక్షించడానికి ముడిపట్టు పైన దిగుమతి సుంకాన్ని 5% నుండి 15% పెంచారు.

2012-13 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులను గ్రామీణాభివృది శాఖ ఖర్చు చేయలేకపోయింది. గ్రామీణ పేదల అభివృద్ధికి ఉద్దేశించిన పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 75 వేల కోట్లను కేటాయిస్తే కేవలం రూ. 55 వేల కోట్లను మాత్రమే ఈ శాఖ ఖర్చు చేసింది. 2013-14 గ్రామీణాభివృద్ధికి అదనంగా 46% నిధులను కేటాయించారు. ఈ నిధులనైనా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఖర్చు చేసి, గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందని ఆశిద్దాం.

*- డా.పి. మోహన్‌రావు*



Sthanika_Color_Apil13.indd 18 02/04/13 3:31 PM

# తీర ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్యాల యాజమాన్యానికి సమిష్టి కృషి అవసరం

## కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే

**ఆయన కేంద్ర కేబినెట్ మంత్రి, పైగా హోం శాఖ మంత్రి సుశీల్ కుమార్ షిండే.**

ఆయన పర్యటనకు విచ్చేసింది ఒక కుగ్రామానికి. పట్టుమని పదిహేను వందల జనాభా కూడా లేని సముద్ర తీర ప్రాంత గ్రామానికి, వేరే పంచాయితీలో శివారు గ్రామంగా వున్న కుగ్రామానికి.

ఆయన శంకుస్థాపన చేసినది ఒక భారీ ప్రాజెక్టుకు రూ. 8.21 కోట్ల ఖర్చుతో నిర్మించే వంతెనకు. మత్స్యకారులు నివసించే ప్రాంతాలలో రహదారి, రవాణా సౌకర్యాలు మెరుగు పరచటం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి వున్నాయనటానికి ఈ వంతెన నిర్మాణం ఒక తార్కాణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప.గో. జిల్లా, భీమవరం సమీపంలోని కాళ్ళ మండలం, కల్వపూడి శివారు మోడీ గ్రామంలో కేంద్ర మంత్రి సుశీల్‌కుమార్ షిండే ఈ వంతెనకు మార్చి 17న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షిండే సుదీర్ఘ ప్రసంగం చేశారు. తీర ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించటం కోసం, విస్తారంగా నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. తుఫాన్ తదితర విపత్తులకు సంబంధించిన సమాచారం తీర ప్రాంత ప్రజలకు అందించటం కోసం అధునాతన యంత్ర పరికరాలను సిద్ధం చేస్తున్నట్లు షిండే చెప్పారు. మోడి గ్రామం వద్ద మొగ దిండి డ్రైన్‌పై రూ. 8.21 కోట్ల వంతెన నిర్మాణమే కాక, బండారు డ్రైన్‌పై మరో డ్రైన్ వంతెన నిర్మాణానికి రూ. 10 కోట్లు కేటాయిస్తానని షిండే హామీ ఇచ్చారు.

ప్రపంచ బ్యాంకు సహాయంతో చేపట్టిన నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు మొదటి దశగా ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాలకు ప్రాధాన్యత కల్పించామన్నారు. దీనిలో రూ. 780? ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినట్లు చెపుతూ ఆగస్టు రెండవ దశలో పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కేరళ, గుజరాత్ రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. 1977లో దివి సీమ ఉప్పెన, 1977లో ఒడిస్సా ఉప్పెన వల్ల



అపారంగా ఆస్తి, ప్రాణనష్టం జరిగాయని, తుపాను తీవ్రతను సత్వరమే ప్రజలకు తెలియజేసే ఆధునిక సదుపాయాలు లేకనే ఇలాంటి నష్టాలు తరుచూ పునరావృతమైనట్లు కేంద్రం గుర్తించి, వాటి నివారణకు పుష్కలంగా నిధులు కేటాయించాలనే కృత నిశ్చయంతో వున్నారు. ప్రకృతి విపత్తుల సమాచారం ఇప్పటివరకు రాష్ట్ర, జిల్లా అధికారులకు మాత్రమే అందుబాటులో వుండేదని, సమాచార వ్యవస్థను విస్తరించటం ద్వారా సామాన్య ప్రజలకు మాత్రమే కాకుండా, సముద్రంలో వేటకు వెళ్ళిన జాలర్లకు కూడా సత్వరమే విపత్తు సమాచారం అందించటం సాధ్యమౌతుందని, ఇందుకోసం అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసే పథకం రూపొందిస్తున్నామన్నారు.

జాతీయ విపత్తుల నివారణ సంస్థ వైస్ చైర్మన్ శ్రీ మర్రి శశిధర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, విపత్తు నివారణ చర్యల్లో భాగంగా విస్తృత ప్రచారం చేసి, ప్రజలను అప్రమత్తం చేయటం కోసం దళాలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు మంగళగిరి (గుంటూరు జిల్లా) వద్ద ఒక కేంద్రాన్ని ప్రారంభించి, 1,130 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. యన్.సి.ఆర్. యం.పి ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో రూ. 90 కోట్లు ఖర్చయ్యాయని, మిగిలిన నిధులు 2015 ఏప్రిల్‌కి ఖర్చు చేయాల్సి వుందన్నారు. నిర్ణీత వ్యవధిలో మొదటి దశలో కేటాయించిన నిధులను సద్వినియోగ పరుచుకొంటే, రెండో దశలో కూడా మరిన్ని నిధులు రాబట్టడానికి అవకాశం వుంటుందన్నారు. భవిష్యత్తులో తుపాను విపత్తులను విమానాల ద్వారా గుర్తించే పరిశోధనలకు సమాయత్తమౌతున్నట్లు చెప్పారు. "లాస్ట్ మైల్ కనెక్టివిటీ" అనే కార్యక్రమం చేపట్టనున్నట్లు చెపుతూ, దీనివల్ల సముద్రంలో వుండే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ముందస్తు హెచ్చరికలు జారీ చేసే అవకాశం వుందన్నారు.

కేంద్రమంత్రి ఆంగ్ల ప్రసంగాన్ని ఏలూరు యం.పి. కావూరి సాంబశివరావు తెలుగులో అనువదించారు. రాష్ట్రమంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పితాని సత్యనారాయణ, వట్టి వసంతకుమార్, నర్సాపురం యం.పి, కనుమూరి బాపిరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**- దాసరి ఆళ్వారుస్వామి**





# 'మలయజ' తో మారుతున్న మన్యం గ్రామాభివృద్ధి

**సరైన దిశానిర్దేశం చేస్తే, నేటి యువత సాధించలేనిది ఏదీ ఉండదు అని నిరూపించారు తూర్పుగోదావరి జిల్లా గంగవరం మండలం ఆముదాల బంద గ్రామ గిరిజన యువతీ యువకులు. షెడ్యూల్డు ప్రాంతంలో నివశిస్తూ, అభివృద్ధికి ఆమడ దూరంలో ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న గిరిజన సమూహాలకు వీరు మేమున్నామంటూ అండనిస్తున్నారు. అపార్డు ప్రారంభించిన 'మలయజ' కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన 47 మంది మన్యం ప్రాంతానికి చెందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో స్ఫూర్తిదాయకమైన పనులు చేపట్టి ప్రజల మన్ననలను పొందు తున్నారు.**

గ్రామంలో విద్యుత్ సదుపాయం ఉన్నా స్తంభాలు లేకపోవడం, ఉన్న స్తంభాలకు బల్బులు పెట్టకపోవడం వంటి సమస్యలతో గ్రామంలో తరుచూ చీకటి రాజ్యమేలేది. ఈ సమస్యను అధిగమించాలనే ఉద్ధేశ్యంతో శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు నడుంబిగించారు. విద్యుత్ స్తంబాలు లేని చోట సంబంధిత అధికారులతో మాట్లాడి స్తంభాలు మంజూరు చేయించుకున్నారు. దాదాపు 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తీసుకువచ్చి స్వయంగా గుంతలు తీసి నిలబెట్టుకున్నారు.



కుటుంబానికి 20/- లు చొప్పున విరాళంగా పోగుచేసి గ్రామంలో ప్రతి స్తంభానికీ విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకప్పుడు చీకటి రాజ్యమేలే వీధుల్లో కాంతి వెదజల్లుతోంది.

గ్రామంలో పరిశుభ్రత ఆమడ దూరంలో ఉండేది. ఎక్కడ చెత్తా చెదారం అక్కడే పేరుకుపోయి ఉండేది. కుళాయి నుండి వృధాగా పోయే నీరు గ్రామంలో వీధుల గుండా ప్రవహించేది. అంటు రోగాలు, మలేరియా వంటి ప్రాణాంతకమైన వ్యాధులతో గ్రామం తల్లడిల్లేది. గిరిజనుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టినా సరైన మార్గదర్శకం లేక వాటిని వినియోగించుకోలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురియ్యేవారు.

ఈ పరిస్థితులన్నీ గమనించిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ముందుగా గ్రామంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి గ్రామంలో పేరుకుపోయిన చెత్తనంతటినీ తొలగించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల చుట్టు ప్రక్కల ఉన్న తుప్పలను తొలగించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పాడైపోయిన వీధి కుళాయిలకు స్వయంగా మరమత్తులు చేసి ఆన్,ఆఫ్ రెగ్యులేటర్ సిస్టంలను ఏర్పాటు చేసి నీటి దుర్వినియోగాన్ని అరికట్టారు.




ఓ.హెచ్.ఎస్.ఆర్. ట్యాంకును శుభ్రపరిచి క్లోరినేషన్ చేశారు. వారానికి ఒకసారి ఓ.హెచ్.ఎస్.ఆర్. ను క్లీనింగ్ చేయడానికి ఏర్పాటు చేసుకున్నారు. అంటు రోగాలు ప్రబలకుండా గ్రామస్తులకు అవగాహన కల్గించారు. వీటికి సంబంధించి వైద్య శిబిరాలు నిర్వహించుకున్నారు. ఐ.టి.డి.ఏ. వారి సహాయంతో ప్రతి ఇంటికీ దోమ తెరలు సరఫరా చేశారు. ఒకప్పుడు మలేరియా బారిన పడిన ఆముదాలబంద గ్రామంలో 2011-12 వ సంవత్సరం ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదు.






నేటి ప్రపంచీకరణ వల్ల పూర్వ సంస్కృతులు, సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. అయితే, ఆముదాలబంద భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పూర్వ సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకునేందుకు పూనుకున్నారు. గిరిజనుల సాంప్రదాయ భాష అయిన కోయ భాషను ప్రజలు విస్మరించినందున కోయ భాషను నేర్చుకునేందుకు, గ్రామంలో యువతకు నేర్పించేందుకు కృషి చేశారు. గ్రామంలో పునాది పాఠశాల ఏర్పాటు చేసుకుని సుమారు 50 మంది కోయభాషను నేర్చుకున్నారు. గ్రామంలో తమ సేవలను అందుబాటులో ఉంచే నిమిత్తం గ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఒక సేవా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ సభ నిర్వహణతో పాటు, గ్రామ అభివృద్ధి కోసం చేసే పనుల ప్రణాళికలను తయారు చేసుకోవడం మరియు వివిధ కార్యక్రమాలను ఈ సేవా కేంద్రం ద్వారానే చేపడుతున్నారు.

యువతలో అత్యంత కీలకమైన శక్తి నిబిడీకృతమై ఉంది. యువత తలుచుకుంటే యావత్తు ప్రపంచాన్నే మార్చేయవచ్చు అన్న వివేకానంద మాటలను నిజం చేస్తూ గ్రామంలో అనుకున్న కార్యక్రమాలను పూర్తి చేసి ఇంకా చేయవలసిన కార్యక్రమాలకు ప్రణాళికలు చేపడుతూ విజయ పరంపర దిశగా కొనసాగుతూ బి.ఎన్.వి.లు గ్రామాన్ని పురోగమనం దిశగా పయనింపజేస్తున్నారు.

**- ఎం. ప్రదీప్ కుమార్,**
**రీసెర్చ్ అసోసియేట్, అపార్డ్**



# పథకాల అమలులో పారదర్శకతకు సామాజిక చైతన్యం తప్పనిసరి

**గ్రామీణ ప్రాంతాలో నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్యాల ను పెంపొందింపజేసి సమాజంలో వారి కర్తవ్యాలను తెలియజేసే పక్రియలో భాగంగా సోషల్ ఆడిట్ సంస్థ ఇ.జి.ఎమ్.ఎమ్ మరియు అపార్డ్ సంయుక్తంగా ఫిబ్రవరి 25, 2013న ప్రారంభించిన 2వ బ్యాచ్, సర్టిఫికెట్ కోర్సు మార్చి 16, 2013 తో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో తెలంగాణ జిల్లాలకు చెందిన 40 మంది షెడ్యూల్డు కులాల మహిళలు పాల్గొన్నారు.**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపడుతున్న సామాజిక తనిఖీ కార్యక్రమం గురించి వివరించడంతో పాటు అనేక పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్గించడం జరిగింది.

ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభి వృద్ధి ముఖ్య కార్య దర్శి శ్రీ రెడ్డిసుబ్రమణ్యం ఐ.ఎ.ఎస్.ఫోన్ ద్వారా తన సందేశాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు సామాజిక తనిఖీ ద్వారా ప్రజల్లో ఒక ఒక కొత్త చైతన్యం కలిగించి వారిలో సంకల్ప బలం నింపాలన్నారు.

సామాజిక తనిఖీ ద్వారా ఉపాధిహామీ పథకంలో ఒక సామాజిక మార్పు గ్రామాల్లో తీసుకురావాలని తెలియజేశారు. ఇది కేవలం గ్రామాల్లో ఉన్న యువత ద్వారానే సాధ్యపడుతుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ సోషల్ ఆడిట్ విభాగంలో 'జిల్లా రిసోర్స్ పర్సన్' (డి.ఆర్.పి)లుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ, సమాజంలో తప్పును తప్పుగా ఖండించగలిగినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ప్రతి వ్యక్తి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. సమాజానికి సేవ చేయాలంటే కొంత శ్రమించవలసి వుంటుందని తెలియజేశారు.

పూర్వకాలం నుండి గమనించినట్లయితే ఎందరో మహానుభావులు ఏ విధమైన ప్రతిఫలం ఆశించకుండా సమాజానికి సేవ చేశారని కాని ప్రస్తుత కాలంలో సమాజ సేవ చేసే ప్రతి ఒక్కరికి ఎంతోకొంత ప్రతి ఫలం దక్కుతోందన్నారు. అందువల్ల చేసే సేవ మరింత విలువైనదిగా ఉండాలని అన్నారు. ఒక మంచి విత్తనం నాటితే అది వృక్షంగా మారి సమాజానికి ఎలా నీడనిస్తుందో అదే విధంగా గ్రామాల్లో ప్రతి యువతీ యువకుడు నిరుపేద ప్రజలకు సేవ చేయలన్నారు.

ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ అధికారి శ్రీ మురళి, సోషల్ ఆడిట్ సెంటర్‌హెడ్ శ్రీమతి ఉషారాణి సోషల్ ఆడిట్ సిబ్బంది మరియు అపార్డు సిబ్బంది పాల్గొన్నారు.

◆



Sthanika_Color_Apil13.indd 24 02/04/13 3:31 PM




ది. 07.03.2013న నెల్లిమర్ల మహరాజా మెడికల్ కాలేజి వారి సహకారంతో దానయ్యపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సారిపల్లి, కొత్తపేట గ్రామాల భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



శ్రమదానం కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస మండలం బొబ్బిలి పేట గ్రామ భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు



తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సమావేశంలో పాల్గొన్న ఎం.పి.డి.ఓ. శ్రీమతి శారారాణి, జిల్లా శిక్షణా మేనేజర్ శ్రీ పి. వెంకటేశ్వరరావు.

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల



ది. 13.03.2013 న దూరదర్శన్ ద్వారా అపార్డు ప్రసారం చేసిన గ్రామ వికాసం కార్యక్రమంలో పాల్గొన్న నల్గొండ జిల్లా తాళ్ళ ఖమ్మంపహాడ్ గ్రామ బి.ఎన్.వి. శ్రీ నారాయణ, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎం.పి.డి.ఓ. శ్రీ కె. యాదయ్య, అపార్డ్ కన్సల్టెంట్ శ్రీ జి. జయపాలరెడ్డి, దూరదర్శన్ యాంకర్ శ్రీమతి సుజాత.



ది. 20.03.2013న దూరదర్శన్ ద్వారా అపార్డ్ ప్రసారం చేసిన గ్రామ వికాసం కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణాజిల్లా ఈదులమద్దాలి బి.ఎన్.వి. శ్రీమతి కృష్ణవేణి, కర్నూలు జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. శ్రీ సూర్యప్రకాష్, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్, దూరదర్శన్ యాంకర్ శ్రీమతి సుజాత.



ది. 08.03.2013న అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం జిల్లా గొట్టివాడ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



శ్రమదానం కార్యక్రమంలో విజయనగరం జిల్లా కేరంగి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలం ముదుమాల గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



ది. 08.03.2013 అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్వయం సహాయక మహిళలతో ర్యాలీలో పాల్గొన్న మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

# అపూర్వ విజయాలు




యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా విజ్ఞాన యాత్రకు బయలుదేరిన కర్నూలు జిల్లా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు. జెండా ఊపి యాత్రను ప్రారంభించిన జిల్లా క క్టర్ శ్రీ సి. సుదర్శన్ రెడ్డి మరియు జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. శ్రీ ఎ. సూర్యప్రకాష్.



అనంతపురం జిల్లా భానుకోట గ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల చొరవతో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను ప్రారంభించిన అపార్డ్ కమీషనర్ శ్రీ కె.చంద్రమౌళి జిల్లా ఇన్‌ఛార్జ్ కలక్టర్ శ్రీ సత్యనారాయణ.




రంగారెడ్డి జిల్లా పరిషత్తులో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా మేడిపల్లి గ్రామ బి.ఎన్.వి. శ్రీ నరసింహ

Stha_AprilSpread.indd 3 02/04/13 3:37 PM

# అత్యంత ప్రజాదరణ కలిగిన గొప్ప రాజనీతిజ్ఞుడు

**భారత మాత బిడ్డలలో అస్పృశ్యునిగా జన్మించి, ప్రచండ మేధావిగా ప్రసిద్ధి చెంది, భారత రాజ్యాంగ ముఖ్య నిర్మాతగా పేరుతెచ్చుకొన్న మట్టిలో పుట్టిన మాణిక్యం భారతరత్న డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్ప విజ్ఞానగని, అత్యంత ప్రజాదరణ కలిగిన గొప్ప రాజనీతిజ్ఞుడు. ఆయన జన్మదినం ఏప్రిల్, 14.**

మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబవాడ గ్రామానికి చెందిన శ్రీ రామ్‌జీ సక్పాల్ అంబవాడేకర్ నేటి మధ్యప్రదేశ్‌లోని మౌ అనే కంటోన్మెంట్ పట్టణంలో సైన్యంలో సుబేదార్ మేజర్‌గా పనిచేస్తున్న సమయంలో రామ్‌జీ, రమాభాయి దంపతులకు 14 వ సంతానంగా భీంరావు రామ్‌జీ అంబేద్కర్ ఏప్రిల్ 14, 1891 వ సంవత్సరంలో జన్మించారు.



**ఏప్రిల్ 14**
**డా ॥ అంబేద్కర్ జయంతి**

సుబేదార్ ఉద్యోగ విరమణ అనంతరం, మహారాష్ట్రలోని కొంకణ ప్రాంతమైన దపోలీలోగల పాఠశాలలో అంబేద్కర్‌ను ఐదవ సంవత్సరంలో చేర్చారు. తల్లి చనిపోవటంతో ఏడవ సంవత్సరంలో సతారాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరిన తరువాత, పరిస్థితులు కారణంగా బొంబాయి చేరుకొని అక్కడ ఎల్ఫిన్‌స్టెన్ హైస్కూలులో చేరి 1907 వ సంవత్సరంలో మెట్రిక్యులేషను పరీక్షలో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు.

బాల్య వివాహ వ్యవస్థ కారణంగా తన పదహారవ ఏట రమాబాయితో వివాహం జరిగిన తరువాత ఎల్ఫిన్ కళాశాల నుండి ఇంటర్మీడియెట్, బరోడా మహారాజు ఆర్థిక సహాయంతో 1912 సంవత్సరంలో బి.ఎ. పట్టాను సాధించారు.

బరోడా మహారాజు ఉపకార వేతనం సహాయంతో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరిన తరువాత ప్రాచీన భారతదేశ వాణిజ్యంపై పరిశోధనా వ్యాసానికి 1915వ సంవత్సరంలో ఎం.ఏ డిగ్రీని, భారత జాతీయాదాయం - దాని చారిత్రక విశ్లేషణపై జూన్ 8, 1916 లో వ్రాసిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేటు పట్టాను కొలంబియా విశ్వ విద్యాలయం అంబేద్కర్‌కి ప్రదానం చేసింది.

విదేశాలలో విద్యను ముగించుకొని, ఉపకార వేతన మంజూరు ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణ శాఖ కార్యదర్శిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన అంబేద్కర్, కుల రక్కసి కోరలలో చిక్కుకొని, ఆ ధృతరాష్ట్ర కౌగిలిని విదిలించుకొని, ఉద్యోగం మాని, ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ బొంబాయిలోని సైడన్ హ్యాం కళాశాలలో ఆర్థిక శాస్త్రంలో ప్రొఫెసరుగా 1918 నవంబరులో చేరి 1920 వరకు అదే ఉద్యోగంలో పనిచేశారు.

నిమ్న జాతుల వారికి ఓటింగు హక్కు, వారికి శాసన సభలలో ప్రత్యేక రిజర్వేషన్లు ఉండాలని 1919లో సౌత్ బరోడా కమిటీ ముందు తన అభిప్రాయాలను డా॥ అంబేద్కర్ తెలియజేశారు. అస్పృశ్యత, నిరక్షరాస్యత, దుర్భర దారిద్ర్యంలో మగ్గుతూ మూగజీవులుగా బ్రతుకుతున్న నిమ్న జాతులలో చైతన్యం తీసుకు వచ్చి, వారి హక్కుల గురించి తెలియ చేస్తూ, వారిని మేల్కొల్పటానికి జనవరి 31, 1920 వ సంవత్సరంలో మూక్ నాయక్ పేరుతో ఒక పక్ష పత్రికను స్థాపించారు.

నిమ్న జాతుల వారికి పాఠశాలలు, హాస్టళ్ళు, లైబ్రరీలు, హాకీ క్లబ్బులు, క్రికెట్ క్లబ్బులు మొదలైన కార్యక్రమాలను చేపట్టి వారి సంక్షేమం కోసం జూలై 20, 1924 లో బహిష్కృత హితకారిణి సభను స్థాపించారు. రాయల్ కమిషన్ ఆఫ్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్‌కు 1942లో తన అభిప్రాయాలను తెలియచేశారు.

డా॥ అంబేద్కర్ సేవలను గుర్తించిన అప్పటి బొంబాయి గవర్నర్ ఫిబ్రవరి 19, 1927 నాడు బొంబాయి శాసన మండలిలో ఆయనను సభ్యునిగా నియమించారు.

డా॥ అంబేద్కర్ మొదలు పెట్టిన మొట్ట మొదటి సాంఘిక వివక్ష విముక్తి పోరాటం మహారాష్ట్రలోని కోలా జిల్లా, మహద్‌లోని చౌదరి చెరువులో నిమ్న జాతుల వారితో కలిసి, ఆ చెరువులో నీరు త్రాగటంతో ప్రారంభమయింది. ప్రజలలో చైతన్యం తీసుకుని రావటానికి ఏప్రిల్ 27, 1927 న 'బహిష్కృత భారత్' అనే మరాఠీ పక్ష పత్రికను స్థాపించారు.

సాంఘిక అసమానతలకు, అస్పృశ్యతకు, స్త్రీల హక్కుల నిరాకరణకు మూలమైన మనుస్మృతి ప్రతులను డిసెంబరు, 25, 1927 న బహిరంగంగా తగలబెట్టారు. సైమన్ కమిషన్ భారతదేశ పర్యటన సందర్భంగా, కమిషన్‌ను కలిసి నిమ్న జాతులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని డా॥ అంబేద్కర్ మహజరును సమర్పించారు.

గ్రేట్ బ్రిటన్‌లోని లండన్ నగరంలో 12, నవంబరు 1930 న ప్రారంభమయిన రౌండ్ టేబుల్ సమావేశాలకు నిమ్న జాతుల ప్రతినిధిగా హాజరయిన అంబేద్కర్ భారతదేశంలో అస్పృశ్యత, హక్కుల నిరాకరణతో మానవ మృగాలుగా బ్రతుకుతున్న నిమ్న జాతుల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, మతపరమైన అంశాలను శాస్త్రీయ కోణంలో విశ్లేషించి బ్రిటిష్ ప్రభుత్వం ముందుంచటంతో, నిమ్న జాతుల వారికి ప్రత్యేక నియోజక వర్గాల నుండి ఎన్నిక కాబడేందుకు వీలు కల్పించే కమ్యూనల్ అవార్డును ఆగస్టు, 1932 నాడు బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది.

కమ్యూనల్ అవార్డులో బ్రిటిష్ వారు ప్రకటించిన ప్రత్యేక నియోజక వర్గాల నుండి నిమ్న జాతుల ఎంపిక విధానానికి వ్యతిరేకంగా



Sthanika_Color_Apil13.indd 25 02/04/13 4:24 PM

## రాజ్యాంగ పరిషత్తు చివరి సమావేశంలోని అంబేద్కర్ ప్రసంగ భాగాలు

ఈ రాజ్యాంగ ముసాయిదా గురించి ఎంతవరకు బలపరచాలో అంతవరకు నా మిత్రులు సర్ అల్లాడి కృష్ణస్వామి, అయ్యర్ శ్రీ టి.టి. కృష్ణమాచారి బలపరచారు. కాబట్టి ఈ రాజ్యాంగం గుణగణాల జోలికి నేను వెళ్ళను. ఎందుకంటే ఎంతమంచి రాజ్యాంగమైనా దాన్ని అమలు పరచేవారు చెడ్డ వారైతే, ఫలితాలు చెడ్డగా వుంటాయి .......................... ...... చరిత్ర పునరావృతమవుతుందా?

ఈ ఆలోచనే నన్ను ఆదుర్దాకు లోనుగావిస్తోంది. ఎందుకంటే కులాలు, జాతుల రూపంలో మన పాత శత్రువులు ఒక పక్క పొంచి యుండగా, మరో పక్క విభిన్న పరస్పర విరుద్ధమైన రాజకీయ దృక్పథాలుగల పెక్కు రాజకీయ పార్టీలు ఇక మీదట రంగంలో ఉంటాయి.

భారతీయుడు తన వర్గ ప్రయోజనాలకు ముందు దేశ ప్రయోజనాల ను ఉంచుతాడా? లేక దేశ ప్రయోజనాల కంటే తన వర్గ ప్రయోజనాల కే ప్రాముఖ్యమిస్తాడా? నేను చెప్పలేను. కాని ఒకటి మాత్రం తథ్యం. రాజకీయ పార్టీలు దేశ ప్రయోజనాల కంటే తమ వర్గ ప్రయోజలకే ప్రాముఖ్యమిచ్చిన నాడు మన స్వాతంత్ర్యాన్ని రెండవసారి - బహుశ శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం తలెత్తుతుంది. అలా జరగకుండా అందరము ధృఢ సంకల్పంతో జాగ్రత్త వహించాలి. మన స్వాతంత్ర్యాన్ని మన చివరి రక్తపు బొట్టు వరకు రక్షించుకోవాలి.

*- ఏ. నాగేశ్వరరావు*

*సెంటర్ హెడ్, నీరు మరియు పారిశుద్ధ్య విభాగం , అపార్డ్*

మహాత్మాగాంధీ పూనాలోని ఎఱ్ఱవాడ జైలులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. గాంధీజీ ఆమరణ నిరాహార దీక్ష విరమణ కోసం డా॥ అంబేద్కర్, గాంధీజీల మధ్య 24, సెప్టెంబరు 1932 న కుదిరిన అంగీకారమే పూనా ఒడంబడికకు దారి తీసింది. పూనా ఒడంబడిక ప్రకారం షెడ్యూల్డు కులాలకు కల్పించిన ప్రత్యేక నియోజక వర్గాలకు బదులు రాజకీయ రిజర్వేషన్లతో పాటుగా, విద్యా సంస్థలలో, ఉద్యోగాలలో నిమ్న జాతుల వారికి రిజర్వేషన్లు, వారి అభివృద్ధికి నిధుల ను కేటాయించడానికి అంగీకారం కుదిరింది. డా॥ అంబేద్కర్ 1936 వ సంవత్సరం ఆగస్టు నెలలో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించి, 1937 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలలో 17 స్థానాలలో బొంబాయి శాసన సభకు పోటీ చేసి, 15 స్థానాలను దక్కించుకొని అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టారు.

తరువాత ఇండిపెండెంట్ లేబర్ పార్టీ స్థానే షెడ్యూల్డు కులాల ఫెడరేషన్‌ను స్థాపించారు. డా॥ అంబేద్కర్‌ని 1942 జూన్ నెలలో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోకి తీసుకొని కార్మిక శాఖ బాధ్యతలు అప్పచెప్పి, వారి ప్రతిభకు పట్టం కట్టారు. జూన్ 20, 1946 న డా॥ అంబేద్కర్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించి, నిమ్న జాతులకు విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందడానికి కృషి చేశారు.

డా॥ అంబేద్కర్ బెంగాలు నుండి రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికయ్యారు. ఆగస్టు 3, 1947 తేదీన అంబేద్కర్‌ని జవహర్‌లాల్ నెహ్రూ తన కేంద్ర కేబినెట్‌లో న్యాయ శాఖా మంత్రిగా తీసుకోవటం ద్వారా, అంబేద్కర్ న్యాయశాస్త్ర నైపుణాన్ని, రాజనీతిజ్ఞతను, మేధావితనాన్ని గుర్తించి, గౌరవించారు.

డా॥ అంబేద్కర్ అచంచల దేశ భక్తికి, రాజనీతిజ్ఞతకు, ప్రపంచ మేధావి తనానికి గుర్తింపుగా ఆగస్టు, 3, 1947 తేదీన రాజ్యాంగాన్ని రచించే అద్భుత అవకాశాన్ని కల్పిస్తూ డా॥ అంబేద్కర్‌ను రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షునిగా అంబేద్కర్ భారత రాజ్యాంగ ముసాయిదా ప్రతిని రాజ్యాంగ సభ 11, ఫిబ్రవరి 1948 న ఆమోదం కోసం సమర్పించారు.

26, నవంబరు 1949 తేదీ న రాజ్యంగాన్ని ఆమోదించగా, జనవరి 26, 1950 తేదీ నుండి నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రపంచ రాజ్యాంగాలలోని అనేక అంశాలను భారత రాజ్యాంగంలో పొందు పరచి, షెడ్యూల్డు కులాలకు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్య, ఉపాధి రంగాలలో అనేక రకాల రక్షణలను పొందుపరచటంలో డా॥అంబేద్కర్ కృతకృత్యులు కాగలిగారు.

అస్పృశ్యతకు, అసమానతలకు, కులవివక్షతకు మూలమైన మనుధర్మ శాస్త్రం స్థానంలో సమ సమాజ స్థాపనకు ఉద్దేశించిన హిందూ కోడ్ బిల్లును తయారు చేసి, న్యాయ శాఖ మంత్రిగా పార్లమెంటు ఆమోదం కోసం ఫిబ్రవరి, 5, 1951 లో ప్రవేశ పెట్టగా, దానికి నీరుగార్చే విధంగా సవరణలు చేసి, అస్థిపంజరం లాంటి ఉపయోగం లేని హిందూ కోడ్ బిల్లు ఆమోదించటంతో, నిరసనగా సెప్టెంబరు 27, 1951 న కేంద్ర న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి తన నిరసన తెలియ చేసిన గొప్ప ధీశాలి మరియు త్యాగశీలుడు డా॥అంబేద్కర్.

అంబేద్కర్ విశిష్ట సేవలను గుర్తించిన కొలంబియా విశ్వ విద్యాల యం జూన్ 5, 1952 తేదీ నాడు డాక్టర్ ఆఫ్ లాస్ గౌరవ డాక్టరేటు ఇచ్చి గౌరవించింది.

డా॥ అంబేద్కర్ గొప్పతనాన్ని, నైపుణ్యాన్ని గుర్తించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం జనవరి 12, 1953 తేదీన డాక్టర్ ఆఫ్ లిటరేచర్‌ని ప్రదానం చేసి గౌరవించింది. హిందూ మతపు ఛాందస భావాలకు, అసమానతలకు, అస్పృశ్యతలతో అనేక అవమానాలను చవిచూసిన డా॥ అంబేద్కర్ నాగపూర్ పట్టణంలో దాదాపు 5 లక్షల మంది ప్రజల సమక్షంలో మతం స్వీకరించి, చరమ దశలో ఉన్న బౌద్ధమతానికి ప్రాణం పోసి, నవ బుద్ధుడుగా ప్రసిద్ధి చెందారు.

కుల పునాదులపై ఒక జాతిని, నీతిని నిర్మించలేరని, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రత్వం మరియు న్యాయం ప్రాతిపదికగా సమ సమాజాన్ని నిర్మించాలనే ప్రగాఢ విశ్వాసంతో డా॥ అంబేద్కర్ అలుపెరుగని యోధునిగా, నిమ్న జాతుల హక్కుల పరి రక్షణకు చివరి వరకు పోరాటం చేశారు.

తన చివరి సందేశంగా "ఎంతో శ్రమించి ఇంత దూరం తీసుకు వచ్చిన ప్రజా హక్కుల ఉద్యమ రథాన్ని చేతనైతే ముందుకు తీసుకు వెళ్ళండి. దయచేసి వెనుకకు మాత్రం లాగకండి" అని తన చివరి సందేశాన్ని ఇచ్చి ఢిల్లీలో డిశంబరు 6, 1956 సంవత్సరంలో తన నివాసమైన 26, ఆలీపూర్ రోడ్‌లో కోట్లాది మంది అభిమానులను శోక సముద్రంలో ముంచి తుది శ్వాస విడిచారు డా॥ అంబేద్కర్.

ఆ మహోన్నత వ్యక్తి, దేశానికి చేసిన సేవలకు, దేశ భక్తికి, ప్రపంచ మేధావితత్వాన్ని, అత్యంత ప్రజాదరణ కలిగిన భారత మేధావితనాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1990 ఏప్రిల్, 14 వ తేదీన దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న ఇచ్చి అంబేద్కర్‌ని గౌరవించటం భారత జాతి గర్వించ దగ్గ విషయం.



Sthanika_Color_Apil13.indd 26 02/04/13 3:31 PM

# గొప్ప పరిపాలనాదక్షుడు బాబూ జగజ్జీవన్ రామ్

**భారత జాతి గర్వించ దగ్గ నవ భారత నిర్మాతలలో జగజ్జీవన్ రామ్ ఒకరు. జగజ్జీవన్ రామ్‌ని గౌరవంగా బాబూజీగా పిలవటం వారి అభిమానుల ఆనవాయితీ. మొదటి ఎస్‌సి ఉప ప్రధాని జన్మదినమైన ఏప్రిల్ 5వ తేదీ అణగారిన వర్గాలకు పండుగ రోజు. బాబూజీ ఏప్రిల్ 5, 1908 వ సంవత్సరంలో బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో బసంతీ దేవి - శోభారామ్ దంపతులకు ఎనిమిదవ సంతానంగా జన్మించారు.**

1925 వ సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పాసయ్యి, కలకత్తాలోని విద్యాసాగర్ కళాశాల నుండి 1931లో బి. యస్సీ డిగ్రీని తీసుకున్నారు. బాబూజీ విద్యార్థి దశనుండి గాంధీజీ గారి ఉద్యమాల పట్ల ఆకర్షితుడై, 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని, ఆయన దృష్టిని ఆకర్షించారు. బాబూజీ 1935 వ సంవత్సరంలో కాన్పూరు లో జరిగిన డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. అఖిల భారత డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌కు 1936 నుండి 1942 వరకు బాబూజీ అధ్యక్షులుగా ఉన్నారు.

బాబూజీని 1936 వ సంత్సరంలో నిమ్న జాతుల ప్రతినిధిగా బీహార్ విధాన పరిషత్‌కు ఎంపిక చేసారు. బాబూజీ 1942 ఆగస్టు 7 తేదీ నాడు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు అఖిల భారత డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం రద్దు చేసింది. 1946 లో బ్రిటిష్ కేబినెట్ మిషన్ భారతదేశాన్ని సందర్శించినప్పుడు నిమ్న జాతుల తరపున మహాజరు సమర్పించి, వెంటనే భారతదేశానికి స్వాతంత్రం ప్రకటించాలని బాబూజీ కోరటం జరిగింది.

బాబూజీ 1946 లో కేంద్ర ప్రభుత్వంలో 38 38 ఏళ్ళ అతి చిన్న వయస్సులోనే జవహర్ లాల్ నెహ్రూ గారి కేబినెట్‌లో కేంద్రమంత్రిగా చేరటం జరిగింది. తరువాత 1947లో రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి, 1963లో ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పచెప్పారు, 1966లో అఖిల భారత కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు బాబూజీ. 1946 నుండి 1963 వరకు కేంద్ర కేబినెట్‌లో వివిధ శాఖలను సమర్ధవంతంగా నిర్వహించారు.

బీహారులోని ససారాం పార్లమెంటరీ నియోజక వర్గం నుండి 1952 నుండి చనిపోయే వరకు ఓటమిని ఎరుగని రాజకీయ దురంధరుడు బాబూజీ. కేంద్ర ప్రభుత్వంలో కార్మిక, ఆహారం, ఉపాధి, పునరావాసం, రవాణా, తంతి, తపాలా, రైల్వే, సమాచార శాఖలను సమర్ధవంతంగా నిర్వహించారు. కేంద్ర రక్షణ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు బంగ్లాదేశ్ సమస్యపై పాకిస్తాన్‌తో చేసిన యుద్ధంలో పాకిస్థాన్‌పై విజయం సాధించి, దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసే విజయాన్ని సాధించారు బాబూజీ. ఆ తరువాత దేశం ఆహార సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో వ్యవసాయ శాఖను సమర్ధవంతంగా నిర్వహించడానికి ఆయనను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమించటం జరిగింది. బాబూజీ ఏ శాఖను నిర్వహించినా సమర్ధవంతంగా నిర్వహించటమే కాక, షెడ్యూల్డు కులాలు మరియు తెగలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రక్షణలు, హక్కులు, రిజర్వేషన్లు, ఇతర సదుపాయాలను వారు పొందడానికి, అనుభవించటానికి రాజీలేని పోరాటం చేశారు.

1946 నుండి అఖిల భారత కాంగ్రెస్‌ను ప్రభావితం చేస్తూ, భారత దేశ రాజకీయాలను శాసిస్తూ, అతి ముఖ్యమైన నాయకులలో ఒకరిగాను, కాంగ్రెస్ పార్టీకి మూలస్తంభంగా ఉంటూ వచ్చిన బాబూజీ, 1977లో అత్యవసర పరిస్థితి విధింపును వ్యతిరేకిస్తూ, కేంద్ర మంత్రి మండలికి రాజీనామా చేసి అదే సంవత్సరంలో కాంగ్రెస్ ఫర్ డెమోక్రసి పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించి, ఎన్నికలలో జనతా పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకొని విజయం సాధించారు. ఆ పార్టీని తరువాత

**ఏప్రిల్ 5**
**బాబూ**
**జగజ్జీవన్ రామ్**
**జయంతి**



జనతా పార్టీలో విలీనం చేసి షెడ్యూల్డు కులాల నుండి మొదటి ఉప ప్రధానిగా ఉంటూ రక్షణ శాఖ బాధ్యతలను నిర్వహించారు. జనతా పార్టీ అంత:కలహాల కారణంగా ప్రభుత్వం పడిపోవటంతో 1980లో కాంగ్రెస్ (జె) ను స్థాపించారు. జనతా పార్టీ ప్రభుత్వం పడిపోయినప్పుడు, బాబూజీకి దేశ ప్రధాని అవడానికి అవకాశం ఉన్ననూ, ఆ ఉన్నత పదవిని ఆయన పొందలేక పోయారు.

దేశ శ్రేయస్సే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, జీవితాంతం పోరాడిన బాబూజీ జూలై 6, 1986 సంవత్సరంలో మరణించారు. భారత దేశం గొప్ప రాజకీయవాది, పరిపాలనాదక్షుడు, అకళంకిత దేశభక్తుడు, పరిపాలనాదురంధరుడిని కోల్పోయింది. బాబూజీ తన అనుయాయులను, అభిమానులను శోక సముద్రంలో ముంచి వెళ్లిపోయారు. కేంద్రస్థాయిలో బడుగులకు ఉన్న ఏకైక నాయకుడిని వారు కోల్పోయారు. ఆ స్థానాన్ని ఆక్రమించే దళిత నాయకుడు భవిషత్తులో వస్తాడని ఆశిద్దాం.

దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవకు, అకళంకిత దేశభక్తికి, బాబూజీకి దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న ఇచ్చి గౌరవించ వలసిన ఉన్నది.

*- మట్టా మదన మోహన రావు, సెంటర్ హెడ్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ & వాలంటరీ యాక్షన్, ఎ.ఎమ్.ఆర్.అపార్డ్*



Sthanika_Color_Apil13.indd 27 02/04/13 3:31 PM

# ఉగాది వేళ సంబరాల హేల

**మూ**ర్తీభవించిన తెలుగు తనం, పరిఢవిల్లిన సంస్కృతి, దారి చూపే సంప్రదాయం, పరవశించే జాతి హృదయం, మొగ్గ తొడిగే ఆధ్యాత్మిక జీవనం, చివురు తొడిగే ఆశ, ఇవన్నీ కలిస్తే ఉగాది. తెలుగు నాట వెలుగు బాట విప్పారి, శోభాయమానంగా ప్రకృతి పరవశించి, అందులో వాండే స్వచ్ఛత, ప్రశాంతత ఆశావహ దృక్పథం, కర్తవ్యనిష్ఠ, ఆరోగ్యభాగ్యం... ఇవన్నీ మానవ జీవితానికి అన్వయించుకొమ్మని, జీవితాన్ని సుఖమయమూ, ఆనందమయమూ చేసుకొమ్మని ఉగాది పర్వదినం తెలుగు వారందరినీ స్వాగతిస్తున్న శుభమూహూర్తం.

భవభూతి ఉత్తర రామ చరితంలో 'కాలోహ్యయం నిరవధి విపులాచ పృథ్వీ' అంటాడు. ఎంతో కాలం ఉంది. కాలానికి అంతేలేదు. ఈ నేల కూడా విపులమైనదే. ఏదైనా సాధించాలనుకొంటే ఎప్పుడైనా సాధించవచ్చు. ఎవరో ఒకరు ఎపుడో అప్పుడు ఎక్కడో ఒక చోట.. మనల్ని గుర్తించకపోదు. మన వెలుగు లోకానికి అందకపోదు. సరిగ్గా ఉగాది ఇదే సందేశాన్నిస్తోంది. ఒక ఉగాది పోతే మరో ఉగాది, మరొకటి పోతే ఇంకొకటి. కాలం ఎపుడూ ఆగదు. ఎన్నో అవకాశాలను కాలమే మనకు ఇస్తుంది. ఒక ఉగాది నాడు ఏదో కొన్ని సంకల్పాలను స్వీకరిస్తాం. అవి నెరవేరకపోయినా పర్వాలేదు. మరో ఉగాది వస్తుంది. ఆప్యాయంగా ఒడిలోకి తీసుకొంటుంది. ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోమంటుంది. మళ్లీ నిర్ణయాలు తీసుకోమంటుంది. ఆశయ సాధనవైపు మనల్ని వేలు పట్టుకొని నడిచేలా చేస్తుంది. అందుకే ఉగాది అంటే అందరికీ ఇష్టం. జాతిని గౌరవించే వారికీ, భాషను గౌరవించే వారికీ, సంప్రదాయాన్ని నిలబెట్టేవారికీ, మూలాలను పరిరక్షించే వారికీ, సత్సంకల్పాలను చేసే వారికీ మరీ ఇష్టం. ఆ ఇష్టమే ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొని సత్ఫలితాలను పొందేలా చేస్తుంది. ఆనందం ఉప్పొంగి తోటి వారు కన్పించగానే హృదయపూర్వకంగా ఉగాది శుభాకాంక్షలు చెప్పుకుంటాం. అదే మన సంస్కృతి, సంస్కారం.

### వసంత గీతం

ఉగాది అనగానే గుర్తుకువచ్చేది వసంత ఋతువు, వేపపువ్వు పచ్చడి (దీనినే ఉగాది పచ్చడి అంటారు), కోకిల మధురస్వరం,



పంచాంగ శ్రవణం. వీటిలో వసంతం ప్రకృతి రమణీయతకూ, వేపపువ్వు పచ్చడి ఆరోగ్యానికీ, జీవితానికీ, కోకిల గానం కళా హృదయానికి, పంచాంగ శ్రవణం ఆధ్యాత్మికతలకు ప్రతీకలుగా నిలుస్తాయి. ఏదైనా ఒక శుభకార్యం ప్రారంభించేటప్పుడు ఉగాదితో ప్రారంభిస్తే శుభం జరుగుతుందంటారు. అందుకే రాక్షస సంహారం కోసం రాముడు ఉగాది నాడే ఉద్యమించాడు. దీనికారణంగా ఉగాది మొదలుకొని శ్రీరామనవమి వరకూ శరన్నవరాత్రుల్ని జరుపుకోవడం మనకు సంప్రదాయంగా వచ్చింది. సరస్వతి విద్యలకు అధి దేవత. ఆమెకు వసంతకాలమంటే ఎంతో ఇష్టం. అందువల్ల సరస్వతీ దేవిని పూజిస్తూ కూడా ఈ వసంత నవరాత్రుల్ని జరుపుకుంటారు. బుద్ధి, గ్రహణ శక్తి, సర్వజ్ఞానం కలగాలంటే సరస్వతి ఆరాధన తప్పనిసరి.



*కాలపురుషుడా కనికరించు*
*స్వస్తి మాత్ర ఉతపిత్రేనో అస్తు*
*స్వస్తి గోభ్యో జగతే పురుషేభ్యః*

అంటోంది అథర్వణ వేదం. లోకమంతా కాలపురుషుడి కనుసన్నలలోనే మెలగుతూ ఉంటుంది. కాలపురుషుడు కనికరిస్తే చాలు అసాధ్యాలు సుసాధ్యాలూ, సులభసాధ్యాలూ అవుతాయి. కాలపురుషుడంటే ఎవరోకాదు. సాక్షాత్తూ విష్ణుమూర్తే కాలరూపంలో ఉంటాడు. ఇతడికి సంవత్సరం అని పేరు అందుకే సంకల్పం చెప్తూ విష్ణువునే 'శ్రీ మహావిష్ణు రాజాయ ప్రవర్తమానస్య' అంటూ ధ్యానిస్తాం. స్మరిస్తాం. దీనికి ఆధారం కల్పమే. వీటిలో బ్రహ్మ కల్పం మొదటిది. ఇప్పుడు మనమున్నది శ్వేతవరాహకల్పం. ఇది పంచాంగ గణితమంతటికీ ఆధారభూతమైనది. చైత్ర శుద్ధ పాడ్యమిని 'కల్పాది' అంటారు.

### కొత్త చివుళ్ళూ కొంగొత్త ఆశలు

ఉగాది మానవ జీవితానికి ప్రతీక నిత్య ప్రవాహశీలమైన కాలం ఎప్పుడూ శుభాలను కలుగజేయాలనే ఆశతోనే జీవితం సాగిపోతూ ఉంటుంది. అందుకే ఉగాది నాడు ఏది చేస్తే సంవత్సరమంతా అలాగే



Sthanika_Color_Apil13.indd 19 02/04/13 3:31 PM



సాగుతుందని నమ్మకం. ఉగాది నాడు కొన్ని పనులను విధిగా చేయాలి. తలస్నానం చేయటం, కొత్త బట్టలు ధరించటం, భగవదారాధన చేయటం, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు చెప్పటం, వేప పూవు పచ్చడిని స్వీకరించటం, పంచాంగ శ్రవణం చేయటం మొదలైనవి. కొత్త సంవత్సరంలో కలగబోయే సుఖదు:ఖాలకు, తీపి గుర్తులకు, చేదు అనుభవాలకు ప్రతీక ఉగాది పచ్చడి. దీనిలో వాడే ప్రతిదీ ఔషధ గుణాలు కలదే. వేప రక్తాన్ని శుద్ధి చేస్తుంది. మామిడి కడుపుమంటకూ, వడదెబ్బకూ విరుగుడు. పంచాంగ శ్రవణం వల్ల రాబోయే సంవత్సరంలో కలగబోయే ఆదాయ వ్యయాలు, శుభాశుభాలు, గ్రహచారాలూ తెలుస్తాయి. సర్వజగత్తుకీ శుభం కలగాలనీ, దుష్ట గ్రహాలు అనుకూలంగా మారాలనీ, ప్రాణులంతా సఖ్యంగా మెలగాలనీ కోరుకుంటూ 'స్వస్త్యస్తు విశ్వస్య ఖల్ల ప్రసీదతాం' అంటూ విశ్వశాంతి మంత్రాన్ని జపించాలి.

### చారిత్రక ఉగాది

ఉగాది పర్వదినానికి చరిత్రలోనూ కొన్ని ఆనవాళ్ళు ఉన్నాయి.

1. శాలివాహన చక్రవర్తి పట్టాభిషిక్తుడైన రోజు ఉగాదే. అది క్రీ.శ. 79. ఆ కారణంగా ఈ యుగాన్ని శాలివాహన శకంగా పేర్కొన్నారు.

2. క్రీ.శ. 4వ శతాబ్దిలో వరాహమిహిరుడనే ఖగోళ శాస్త్రవేత్త వసంత విషువత్కాలాన్నే ఉగాదిగా ప్రకటించాడు. చాంద్రమానాన్ని అనుసరించి మాసగణన చేయాలనీ, శుక్ల పక్షంతో నెలను లెక్కించాలనీ కమలాకరభట్టు పేర్కొన్నాడు.

3. ద్వాపరం గతించిన తర్వాత విధాత కలియుగాన్ని ఉగాది రోజునే ప్రారంభించాడని పురాణాలు చెప్తున్నాయి. మహాభారత కాలం నుంచీ ఉగాదిని జరుపుకొనే ఆనవాయితీ ఉంది. 'చైత్రమాసి మహాబాహో పుణ్యాయ ప్రతివత్సరా...' అనే శ్లోక పాదం ద్వారా ఉగాదిని ప్రస్తావించాడు వేదవ్యాసుడు.

అందుకే ఉగాది అన్ని ప్రాంతాల వారికీ ఉంది. 'పోయిల బైశాఖ్' అని బెంగాలీలు, 'బైశా' అనే పేరుతో పంజాబ్ వారు, 'బిహు' అనే పేరుతో అస్సామీ వాళ్ళు ఈ ఉగాది పర్వదినాన్ని జరుపుకొంటారు. మహారాష్ట్రీయులు గుడిపడ్వా అనీ, మళయాళం వాళ్ళు విషుకైతనీమ్ అనీ ఉగాది జరుపుకొంటే, తమిళులు 'పుత్తాండ్ వాళ్తుక్కళ్' అంటూ ఉగాది శుభాకాంక్షలు చెప్పుకొంటారు.

ఏ ఒక్క దైవానికో చెందినది కాకుండా, ప్రకృతి ఆరాధనకు చెందిన పండుగగా దీనిని అభివర్ణిస్తారు. ఉగాది నాడు వేపపువ్వు పచ్చడి తింటే ఆరోగ్యం, పంచాంగ శ్రవణం చేస్తే ధైర్య శౌర్యాలు, విజయం, వైభవం లభిస్తాయి. నక్షత్ర గమనం ఆధారంగా మన జీవితం ఉంటుందని నిరూపించే పర్వదినం ఉగాది.

ఉగాది అనే వసంతం నిరాశలతో నిస్పృహలతో నీరసించిన జనులను జాగృతం చేసి, వారిని కర్తవ్యోన్ముఖుల్ని చేసి, ఆశల్ని చివురింపజేసి తద్వారా విజయం కరతలామలకం చేస్తుంది. మానవుడికి ప్రాకృతిక జ్ఞానం అవసరం. ప్రకృతికీ మానవుడికీ ఉన్న సంబంధం, ప్రకృతిని మానవుడు ఎలా ఉపయోగించుకోవాలో, ఎంత వరకూ ఉపయోగించుకోవాలో కూడా ఉగాది ద్వారా మనకు అందే సందేశం. దేనికైనా ఒక పరిధి ఉంటుంది. దానికి లోబడి, ఆ కాలంలోగా మనం

## ఉగాది వీణ

కాలాశ్వం గిట్టల కింద రోజులు నలిగిపోతున్నాయ్
సంవత్సరాల సముద్రాల్ని దాటి
సమయం స్వయం చోదితమవుతూ ఉంటుంది.
నిన్న రానిది
రేపు నమ్మరానిది
నిన్ను నీవు నిరూపించుకోవడానికే
నేడు ఉన్నది
అదే అభివృద్ధికి పునాది
ఆశయ సాధనకు నాంది
చివుళ్ళు తొడిగే వసంతం సాక్షిగా కాలాన్ని
ఉగాది కొలుస్తూనే ఉంటుంది
స్వాగత గీతాలు స్వాగత వచనాలూ
పికశుకాలు మూకుమ్మడిగా ఆలపిస్తూ
ఒక నిత్య నూతన చైతన్య ప్రవాహాన్ని
కళాత్మకంగా ఆవిష్కరిస్తాయి.
షడ్రుచుల సమ్మేళనంలో జీవితం ఏ ఒక్కదానికీ
బానిస కాకూడదంటూ
మానవత్వానికి పౌష్టికాహారంలోపం కూడదంటూ
ఉగాది పచ్చడి ముచ్చటిస్తూ ఉంటుంది
పంచాంగ శ్రవణంలో మూర్తీ భవించిన ఆశావ హృద్యకథ.
ఆటు పోట్లను సైతం అవలీలగా ఎదుర్కొమ్మంటు
ధైర్యం నూరి పోస్తూనే ఉంటుంది.
ఎన్ని సార్లు వచ్చినా ఎన్నెన్ని కొంగొత్త వింతల్ని మోసుకొచ్చినా
ఉగాదీ.. నీ విపంచి గానం ఎప్పుడూ హృద్యంగానే ఉంటుంది.
నువ్వెప్పుడూ అరచేతికి చిక్కని చందమామవే..
ఏడాదికోకసారి నిన్ను అరచేత పట్టుకొని సముదాయిస్తూ
కొత్త బాసలు చేసుకొంటూ... మళ్ళీ
నీ కోసమే... ఆశగా . . .



*- డా॥ ఎస్.ఏ.టి. రాజ్యలక్ష్మి, తెలుగు అకాడమీ*

చేయదల్చుకున్న విద్యుక్తధర్మాలను విధిగా, నిస్వార్థంగా నిర్వర్తించాలని ఉగాది స్వాగతం పలుకుతోంది. విజయం అందిస్తానంటూ విజయనామ సంవత్సరమై స్వాగతిస్తోంది. ఎప్పుడూ మనం ఉగాదికి స్వాగతం పలుకుతూ ఉంటాం. కానీ ఆలోచిస్తే ప్రతి ఉగాదీ జీవితం నిండా వసంతం నింపడం కోసం తానే మనల్ని స్వాగతిస్తుంది. ఆ స్వాగతాన్ని స్వీకరించి సఫలమూ, సార్థకమూ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది.

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*



Sthanika_Color_Apil13.indd 20 02/04/13 3:31 PM



చోళుల కాలంలో ఉతిర మేరూరు గ్రామంలో గ్రామసభలు జరిగినట్లు చరిత్రకారులు గుర్తించిన మండపం

# చోళ సామ్రాజ్యంలో స్థానిక పాలన- కొన్ని ఆసక్తికరమైన విషయాలు

**ఇటు భారతదేశంలో వేదకాలంలోని గ్రామసభలకు, అటు పశ్చిమాన ప్రాచీన గ్రీస్ దేశంలోని ప్రత్యక్ష ప్రజాపాలనకు ఆధారాలు ఉన్నప్పటికీ, అటువంటి స్థానిక పాలన రూపురేఖలు తెలిపే చారిత్రక ఆధారాలు చాలా తక్కువగా ఉన్నాయని చరిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. అటువంటి ఆధారాలను సమకూర్చే శిలా శాసనాలను తమిళనాడులోని ఉతిరమేరూరు అనే గ్రామంలో చరిత్ర పరిశోధకులు, పురావస్తు శాస్త్ర నిపుణులు వెలికితీసి ఆశ్చర్యకరమైన అంశాలను ప్రకటించారు.**

దక్షిణ భారతదేశాన్ని పాలించిన గొప్ప ప్రఖ్యాతిగాంచిన రాజవంశాల్లో చోళవంశం ఒకటి. క్రీస్తు పూర్వపు శిలాశాసనాల్లో చోళ రాజుల ప్రస్తావన ఉన్నప్పటికీ, ఖచ్చితమైన చారిత్రక ఆధారాల ప్రకారం నిరంతరాయంగా క్రీ.శ. 850 నుండి క్రీ.శ.1250 వరకు మాత్రమే దక్షిణ భారతదేశంలోని అధిక భాగంతో పాటు నేటి శ్రీలంక, మాల్దీవులు చోళ సామ్రాజ్యం ఆధీనంలో ఉండేవి. ఈ నాలుగు శతాబ్దాలలో అద్భుతమైన దేవాలయాల నిర్మాణం, సాహిత్యపోషణతో పాటు చోళ రాజులు విదేశీ వాణిజ్యం, విద్య, గ్రామాలలో స్వయంపాలన పట్ల విశేషమైన శ్రద్ధ చూపించారు.

క్రీ.శ.907 నుండి క్రీ.శ.950 వరకు చోళ సామ్రాజ్యాధినేతగా ఉన్న పరాంతక చోళుడు ఒకటవ గ్రామ పాలనా వ్యవస్థపై ఇచ్చిన ఆదేశాలు ఉతిరమేరూరు గ్రామంలో వెలికి తీసిన శిలా శాసనంలో లిఖితమై ఉన్నాయి. క్రీ.శ. 920 నాటి ఈ శిలాశాసనంలోని వివరాల ప్రకారం గ్రామ పాలనా వ్యవస్థ ఇలా ఉండేది.


**గ్రామసభల పరిధి :** గ్రామ పరిధిలో అభివృద్ధి పనుల రూపకల్పన, వాటిపై అజమాయిషీ, అవసరమైన మేరకు పన్నుల విధింపు ఇత్యాది అంశాలపై గ్రామసభకు సంపూర్ణ స్వాతంత్ర్యముండేది. రాజు గారిచే నియమించబడిన సిబ్బంది సలహాదారులు మాత్రమే. ఆదాయం, ఖర్చు లెక్కల పరిశీలన, అజమాయిషీ అధికారాలు గ్రామ సభదే.

ప్రతి గ్రామాన్ని కొన్ని విభాలుగా (వార్డు) విభజించి ఒక్కో విభాగం నుంచి ఒక పౌరుణ్ణి గ్రామసభ సభ్యుడిగా ఎన్నుకోవటం జరుగుతుంది. అలా ఎన్నుకోబడిన సభ్యులను వివిధ కమిటీలలో సభ్యులుగా నియమించడం జరుగుతుంది. విద్యాధికులు, సీనియర్లు, ఇతర కమిటీలలో పనిచేసిన అనుభవం ఉన్నవారిని అతిముఖ్యమైన సంపూర్ణ అజమాయిషీ కమిటీలో నియమించబడతారు. మిగతా సభ్యులను ఇతర కమిటీలకు నియమించడం జరుగుతుంది. (నీరు & తటాకాల కమిటీ, న్యాయపాలన కమిటీ, భద్రతా కమిటీ, ఆదాయకమిటీ, భూమి కమిటీ ఇత్యాదులు)



Sthanika_Color_Apil13.indd 22 02/04/13 3:31 PM

ఈ ఎన్నికల నిర్వహణ మరియు పైన పేర్కొనబడిన కమిటీల ఏర్పాటు 'బాధ్యతలు నిష్పక్షపాతం, నిజాయితీ వంటి గుణ గణాలను బట్టి ప్రతి గ్రామంలో నియమితుడైన 'మధ్యస్థ' అనే అధికారి వంతు. అలాగే జమాఖర్చుల లెక్కల నిర్వహణకు ఒక అధికారి ఉంటాడు.




### గ్రామ సభకు ఎన్నికలు

- ★ ముందుగా ప్రకటించిన తేదీన ఎన్నికల సభకు గ్రామస్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి (జబ్బుపడిన వారు, తీర్థయాత్రలకు వెళ్ళిన వారు తప్ప).
- ★ అందరి సమక్షంలో నిబంధనల ప్రకారం అభ్యర్థుల పేర్లను స్వీకరించి వాటిలో అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు. (వార్డు వారీగా).
- ★ అర్హులైన అభ్యర్థుల పేర్లను తాళ పత్రాలపై వ్రాస్తారు. వాటిని ఒక బిందెలో వేస్తారు.
- ★ ఒక నిరక్షరాస్యుడైన బాలుడు అందరి సమక్షంలో బిందెను బాగా కదిపి అందులోనుంచి లాటరీ పద్ధతిలో ఒక అభ్యర్థి తాళపత్రం తీసి 'మధ్యస్థకు' అందజేస్తాడు.
- ★ మధ్యస్థ అలా తీసిన తాళపత్రంలో ఉన్న పేరును బిగ్గరగా చదివి ఆ అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటిస్తాడు.
- ★ ఈ ఎన్నిక ప్రక్రియ గ్రామంలోని ప్రతి వార్డు నుండి సభ్యుని ఎంపిక విడివిడిగా జరుగుతుంది.

### గ్రామసభ ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థి అర్హతా నిబంధనలు

- ★ వయసు 35కు తగ్గకుండా 70 దాటకుండా ఉండాలి.
- ★ కనీస విద్యార్హతలు కలిగి ఉండాలి.
- ★ శిస్తు విధింపబడిన పొలం స్వతందారుడై ఉండాలి- ఆ శిస్తును సరిగా కడుతూ ఉండాలి.
- ★ న్యాయపరంగా తనకు చెందిన స్థలంలో కట్టిన ఇల్లు స్వంత దారుడై ఉండాలి. న్యాయబద్ధమైన ఆదాయంతోనే ఆ ఇంటిని కట్టి ఉండాలి.
- ★ గతంలో సభ్యుడుగా పనిచేసి ఉన్నట్లైతే, కనీసం 3 సంవత్సరాల వ్యవధి ఉండాలి. ఈ నిబంధన అతని సమీప బంధువులకు కూడా వర్తిస్తుంది.
- ★ గతంలో నిధుల దుర్వినియోగం, లంచం, ఇతర అసాంఘిక ఘటనలలో పాత్ర ఉండరాదు.
- ★ **ఎన్నికైన సభ్యునిపై అనర్హతా వేటు** (Disqualification and right to recall)

అవినీతి, నిధుల దుర్వినియోగం, లైంగిక నేరాలు, తీసికొన్న ప్రజాధనానికి సరిగా లెక్క చెప్పలేక పోవటం, సంఘ విద్రోహ చర్యలు ఇత్యాది వాటికి పాల్పడిన గ్రామసభ సభ్యులు శాశ్వతంగా సభ్యత్వానికి అనర్హులౌతారు. ఈ అనర్హత అతని దగ్గరి బంధువులకు కూడా వర్తిస్తుంది.

**పదవీకాలం :** ఎన్నికైన సభ్యులు (కమిటీ సభ్యులతో సహా) ఒక సంవత్సరం పాటు పదవిలో ఉంటారు.

***చారిత్రక ఆధారాల బట్టి చోళరాజుల కాలపు నాటి గ్రామ స్వయం పాలన గురించి గమనార్హమైన అంశాలు కొన్ని:***

- ★ ఈ ఎన్నిక విధానం గ్రామంలోని ప్రతి ఒక్క అర్హుడైన పౌరునికి తన జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా గ్రామసభ సభ్యునిగా పనిచేసే అవకాశం దొరుకుతుందనే ఉద్దేశంతో రూపకల్పన చేయబడింది.
- ★ మహారాజే సర్వాధికారి అయినప్పటికీ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి, వరిపాలనా అంశాలలో గ్రామసభలకు పూర్తి స్వతంత్రముండేది. మహారాజు నియమించిన సిబ్బందికి గాని, పాళెగార్ల లాటి ప్రాంతీయాధికారులకు గాని గ్రామపాలనలో తలదూర్చే అధికారం ఉండేది కాదు.
- ★ గ్రామపాలన గ్రామవికాసంలో గ్రామస్థులకు ప్రత్యక్ష పాత్ర కల్పించాలనే ధృడ అభిప్రాయం చోళరాజుల ఆదేశాలలో కన్పిస్తుంది.
- ★ మహారాజు ఆదేశాలు నియామక పత్రాలు తప్పనిసరిగా వ్రాత పూర్వకంగా ఉండినట్లు తెలుస్తోంది.
- ★ మహారాజు ఇచ్చిన నిర్దేశక సూత్రాలకు లోబడి గ్రామపాలనా నిబంధనలను, 'గ్రామ రాజ్యాంగాన్ని' సవరించుకొనే అధికారం గ్రామసభలకు ఉండినదని తెలుస్తోంది.
- ★ గ్రామ పాలకుల్లోను, అధికార్లలోను నిజాయితీ, సత్ప్రవర్తనలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది.

పరాంతక చోళుడు ఒకటవ ప్రవేశపెట్టిన గ్రామ స్వయం పాలనను అతని తరువాతి రాజులు కూడా కొనసాగించడమే కాకుండా ఇంకా మెరుగు పరచినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

ఉదాహరణకు క్రీ.శ 1150లో అప్పటి చోళరాజైన రాజరాజచోళుడు లిఖించిన శిలా శాసనంలో ఈ వాక్యాలున్నాయి చోళ రాజ్య ఆశయం ప్రతి పౌరుడు సంతుష్టుడై సంపూర్ణమైన, స్వేచ్ఛా జీవనం గడపటమే. అంతేకాకుండా పౌరులలో అసూయా ద్వేషాలు, వైషమ్యాలు లేకుండా చేయాలి. అన్ని రకాలైన జీవరాశుల పట్ల సాదరభావం చూపించాలి.

*- ఏ. నాగేశ్వరరావు, సెంటర్ హెడ్,*
*నీరు & పారిశుధ్య కేంద్రం, ఎ.ఎమ్.ఆర్. అపార్డ్*



Sthanika_Color_Apil13.indd 23 02/04/13 3:31 PM



# 394 మంది సుశిక్షితులైన పారిశుద్ధ్య దూతలను తయారు చేసిన ఎయంఆర్ అపార్డ్

**2012-2013 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమం క్రింద మొత్తం 5,490 గ్రామపంచాయితీలు ఎంపిక అయ్యాయి. మెదటి విడతలో ఈ గ్రామాలలో అందరికి సముచిత (వ్యక్తిగత) మరుగు దొడ్ల నిర్మాణం, వాడకాన్ని సాధించాలి. తద్వారా బహిరంగ మలవిసర్జనను సంపూర్ణంగా రూపుమాపే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పారిశుద్ధ్య సాకర్యాల కల్పనకు తగు ఏర్పాట్లు చేపట్టడానికి శ్రీకారం చుట్టారు.**

పారిశుద్ధ్య సౌకర్యాల కల్పనకై ప్రజలలో బలమైన కోరిక పుట్టడానికి కల్పించుకున్న నిర్మాణాలు/సౌకర్యాలు తదనుగుణంగా వినియోగించుకోవడానికి పరిస్థితులను ఆయా గ్రామ పంచాయితీలలో ఏర్పరచగలగాలి. అప్పుడే పథకం దాని ఉద్దేశం విజయవంతమవుతాయి.

### ఈ క్రమంలో అపార్డ్ పాత్ర ఏమిటి?

పారిశుద్ధ్య సౌకర్యాల పట్ల ప్రజల ఆలోచనా ధోరణులు, అల వాట్లలో మార్పు తీసుకువచ్చేందుకు క్షేత్ర స్థాయిలో మెరికలైన యువతీ, యువకులు అవసరం. అందుకే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ  కోరిన వెంటనే అపార్డ్ తన నీరు మరియు పారిశుద్ధ్య కేంద్రం ద్వారా -



★ ఇందుకు ఎవరిని ఎంపిక చేసుకోవాలి?
★ క్షేత్ర స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను ఎలా చేపట్టాలి?
★ అందుకు వారికి ఎలాంటి శిక్షణ అందించాలి?
★ శిక్షణ అనంతరం ఎలా ముందుకు సాగాలనే విషయాలపై స్పష్టమైన సూచనలను తయారు చేసి అందించింది.






### ఫలితం

22 జిల్లాల నుండి ఎంపికైన 394 మంది కార్యకర్తలను 11 బ్యాచ్‌లుగా 3 రోజుల పాటు అపార్డ్‌లో విస్తృత శిక్షణను అందించి సుశిక్షితులైన పారిశుద్ధ్య దూతలుగా తయారు చేయడం జరిగింది.

శిక్షణలో భాగంగా మొదటి రోజు వారికి కావలసిన ప్రాథమిక సమాచారం, క్షేత్ర స్థాయిలో ప్రజలతో మెలగవలసిన తీరుతెన్నులు, ఉపయోగించవలసిన విధానాలు వంటి వాటి పై సమగ్ర సమాచారం అందించడం జరిగింది.

తదుపరి రెండవ రోజు ప్రయోగశాలలో లాగా 10-12 మందిని ఒక బృందంగా ఏర్పరచి, అలా మూడు బృందాలను 3 గ్రామాలకు పంపడం, ఆ గ్రామాలలో ప్రజలతో వారు మమేకమై, తద్వారా ప్రజలలో పారిశుద్ధ్య సౌకర్యాల అవసరం పట్ల, వాటిని వాడవలసిన అవసరం పట్ల అవగాహన కల్పించడం జరిగింది. దీని వలన క్షేత్ర స్థాయిలో ఎలాంటి అనుకూల, ప్రతికూల అంశాలుంటాయో, ప్రజల స్పందన ఏ విధంగా ఉంటుందో, మనం ఎలా సమయానుకూలంగా వ్యవహరించాలో ప్రత్యక్షంగా నేర్చుకోవడం జరిగింది.

తదుపరి 3వ రోజు, 3 బృందాల సభ్యులు వారి వారి అనుభవాలను పరస్పరం ఒకరికి ఒకరు పంచుకోవడం, లోటుపాట్లను సమీక్షించుకోవడం, తదుపరి కార్యాచరణ ప్రణాళికను చర్చించుకొని రూపొందించుకోవడం విశేషం.




### ప్రయోగశాల నుండి క్షేత్ర స్థాయికి దీక్ష

అపార్డ్ అనే ప్రయోగశాలలో శిక్షణ తీసుకున్న ఈ 'దండు' ప్రజల ఆలోచన ధోరణులలో అనూహ్యమైన మార్పు తీసుకువచ్చేందుకు, తద్వారా వారి ప్రవర్తనలో / అలవాట్లలో మార్పు తీసుకువచ్చే దిశగా అడుగులు వేసేందుకు గ్రామ స్థాయి కదిలింది.

ఈ దండులో పారిశుద్ధ్య కార్యకర్తలు, యన్.జి.ఓ. ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కూడా ఉండడం ఓ వినూత్నమైన చెప్పుకోదగ్గ పరిణామం.


రానున్న నెలలో ఈ 5490 గ్రామాలలో మంచి ఫలితాలు వచ్చి అవి రాష్ట్రంలో పారిశుద్ధ్య విప్లవానికి నాంది పలుకుతాయని ఆశిద్దాం.

*- పి. మాధురి, అపార్డ్*



Sthanika_BW_April13.indd 30 02/04/13 3:55 PM





రైతుల సంక్షేమానికి, పశుగణ అభివృద్ధికి, వివిధ వర్గాల వారికి అనువుగా పశు సంవర్ధక శాఖ ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు చేస్తోంది. ఈ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మరియు నాబార్డు సహాయంతో అమలు చేయ బడుతున్నాయి. రైతుల సౌకర్యం కోసం పశుసంవర్ధక శాఖ ద్వారా అందుబాటులో ఉన్న కొన్ని పథకాల వివరాలను ఇక్కడ అందజేస్తున్నాం.

# పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలు

### 1. మినీ డైరీ పథకం

ఈ పథకం క్రింద సంకరజాతి ఆవులు, ముర్రాగేదెలు రాయితీపై అందచేస్తారు. దాని వివరాలు.

| క్రమ సంఖ్య | ఆవులు/ గేదెలు | ఒక్కొక్క పశువు ఖరీదు | ఒక్కొక్క పశువుపై లభించే రాయితీ (25%) | ఒక యూనిట్‌కు మంజూరు చేయ బడే పశువుల సంఖ్య | యూనిట్ పైలభించే మొత్తం రాయితీ |
|---|---|---|---|---|---|
| 1. | సంకర జాతి ఆవులు | రూ. 35000/- | రూ. 8750/- | 5 | రూ. 43,750/- |
| 2. | ముర్రా గేదెలు | రూ. 40000/- | రూ. 10000/- | 5 | రూ. 50,000/- |

రాయితీ పోను మిగిలిన డబ్బును బ్యాంకు రుణం ద్వారా లేదా సొంత వనరుల నుండి సమకూర్చుకోవలసి ఉంటుంది.

### అనుబంధ సౌకర్యాలు (లింకేజెస్)

- **పోషణ :** దాణా కొనుగోలుకు 25% రాయితీ చొప్పున ఒక్కొక్క పశువుకు 1125/- రూ. ల ప్రకారం 5 పాడి పశువులకు గరిష్ఠంగా రూ. 5625/- లు మంజూరు చేయబడుతుంది.
- ఒక్కొక్క పాడిపశువుకు మినరల్ సప్లమెంటేషన్ కోసం రూ. 150/- చొప్పున 5 పాడి పశువులకు రూ.750/-లు రాయితీగా మంజూరు చేయబడుతుంది.
- పాలు పిండే యంత్రాల కొనుగోలుకు 50% రాయితీ లభిస్తుంది. (రాయితీ గరిష్ట విలువ రూ. 10,000/-)
- గడ్డికోసే చాఫ్‌కట్టర్‌ల కొనుగోలుకు 50% రాయితీ లభిస్తుంది. (రాయితీ గరిష్ట విలువ రూ. 10,000/-)
- పశుగ్రాస సాగుకోసం రూ. 1000/- విలువగల పశుగ్రాస విత్తనాల కిట్ ఇవ్వబడుతుంది.

### పథకానికి అర్హత

అనుభవం కలిగిన రైతులు, నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల వారు అర్హులు. లబ్ధిదారులు 1-2 ఎకరాల స్వంత భూమిలో లేదా లీజుకు తీసుకున్న భూమిలో పశుగ్రాసాలను సాగుచేసుకోగలిగిన స్థోమత కలిగి ఉండాలి. ఎస్.సి., ఎస్.టి., బి.సి. వర్గాల వారికి ప్రాధాన్యత ఉంటుంది.

**ఎంపిక :** మండల అభివృద్ధి అధికారి, మండల పశువైద్య అధికారి, బ్యాంక్ ప్రతినిధులు, మిల్క్ ఛిల్లింగ్ సెంటర్ యజమాని సభ్యులుగా గల మండల స్థాయి కమిటీ లబ్దిదారులను ఎంపిక చేస్తుంది. తరువాత జిల్లా ఎంపిక కమిటీ ఆమోదించవలసి ఉంటుంది.

**అ) పాడి పశువుల పంపిణీ పథకం**

| క్రమ సంఖ్య | ఆవులు/ గేదెలు | ఒక్కొక్క పశువుపై లభించే రాయితీ | దాణా సబ్సిడీ | ఆరోగ్య సంరక్షణ | మొత్తం రాయితీ |
|---|---|---|---|---|---|
| 1. | సంకరజాతి ఆవులు చూడి ఆవులు, | రూ. 15000/- | రూ. 2500/- | రూ. 300/- | రూ. 17,800/- |
| 2. | పాడి గేదెలు చూడి గేదెలు | రూ. 17500/- | రూ. 2500/- | రూ. 300/- | రూ. 20,300/- |

ఆ) పెయ్యదూడల పథకం

| క్రమ సంఖ్య | ఆవులు/ గేదెలు | ఒక్కొక్క పశువులపై లభించే రాయితీ | దాణా సబ్సిడీ | మొత్తం రాయితీ |
|---|---|---|---|---|
| 1. | సంకర జాతి ఆవు పెయ్యలు చూడి పెయ్యలు | రూ. 10,000/- | రూ. 724/- | రూ. 10,724/- |
| 2. | ముర్రా పెయ్యలు, చూడి పెయ్యలు | రూ. 10,000/- | రూ. 724/- | రూ. 10,724/- |

**2. పశుక్రాంతి పథకం :** 50% రాయితీతో 2 మేలుజాతి పాడి పశువుల పంపిణీతో రాష్ట్ర ప్రభుత్వం పశుక్రాంతి పథకం అమలు చేస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువనున్న రైతులు అర్హులు. ఈ పథకానికి ఆర్.కె.వి.వై., ముఖ్యమంత్రి ప్యాకేజీల నుండి నిధులు సమకూరుస్తారు.

**3. కేంద్ర ప్రభుత్వ డైరీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి పథకం**

**25% (ఎస్‌సి, ఎస్‌టి కి 331/3%) నాబార్డు రాయితీతో రుణ సౌకర్యం.**

- 10 పాడిపశువులతో డైరీ ఫారం నిర్వహించడానికి (యూనిట్ ఖరీదు రూ. 5 లక్షలు)
- 20 పడ్డలు / పెయ్యలు పెంపకానికి (యూనిట్ ఖరీదు రూ. 4.8 లక్షలు)
- పాలు పితికే యంత్రాలు / పాల పరిశీలన యంత్రాలు / 2000 లీ॥ కెపాసిటి కలిగిన పాల శీతలీకరణ యంత్రాలు ఏర్పాటు చేయటానికి (యూనిట్ ఖరీదు రూ. 18 లక్షలు)
- దేశవాళీ పాల ఉప ఉత్పత్తుల తయారుచేసే పరికరాల కొనుగోలు నిమిత్తం (యూనిట్ ఖరీదు రూ. 12 లక్షలు)
- శీతలీకరణతో పాలు రవాణా చేసే వాహనాల కొనుగోలుకు (యూనిట్ ఖరీదు రూ. 24 లక్షలు)
- పాలు మరియు పాల ఉత్పత్తులు శీతలీకరణ పనిముట్లు / యూనిట్ల కొనుగోలుకు (యూనిట్ ఖరీదు రూ. 30 లక్షలు)

**పథకంలో లబ్ధిపొందుటకు సంప్రదించవలసిన అధికార్లు :** స్థానిక పశువైద్యాధికారి, జిల్లా కేంద్రంలో నాబార్డు ఎ.జి.యం, స్థానిక బ్యాంకరు.

**పాడి పశువుల బీమా పథకం**

ఒక్కోకరైతు రెండు పాడిపశువులను బీమా చేయించడానికి ప్రీమియంలో 50% రాయితీతో పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా పశు బీమాపథకం అన్ని జిల్లాలలో అమలు జరుగుతోంది. ఇందులో సంబంధిత రైతుకు కూడా బీమా సౌకర్యం కల్పించటం జరిగింది. ఈ క్రింది పట్టిక ప్రకారం ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. సంప్రదించవలసిన కార్యాలయం : స్థానిక పశువైద్య కేంద్రం.

పాడి పశువు విలువను బట్టి ఒక్కొక్క పశువుకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం

| గేదె/ఆవు విలువ రూ. | 1 సంవత్సరానికి 2.78% + ఎస్.టి. | | 3 సంవత్సరాలకు 7.11% + ఎస్.టి. | |
|---|---|---|---|---|
| | మొత్తం ప్రీమియం | రైతు చెల్లించవలసిన ప్రీమియం | మొత్తం ప్రీమియం | రైతు చెల్లించవలసిన ప్రీమియం |
| 10,000 | 307 | 154 | 784 | 392 |
| 15,000 | 460 | 230 | 1176 | 588 |
| 20,000 | 613 | 307 | 1568 | 784 |
| 25,000 | 767 | 384 | 1961 | 981 |
| 30,000 | 920 | 460 | 2353 | 1177 |

(ప్రీమియం మొత్తం రూ.లలో సుమారుగా)

**5. గొర్రెలు, మేకల అభివృద్ధి పథకాలు**

- **జీవక్రాంతి పథకం :** దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు 50% రాయితీతో పొట్టేలు పిల్లలు యూనిట్‌ని, గొర్రెలు మేకల యూనిట్‌ని, విత్తనపు పొట్టేలు పంపిణీలో ప్రోత్సాహం.
- **కేంద్ర ప్రభుత్వ గొర్రెల, మేకల సమగ్ర అభివృద్ధి పథకం :** ఒక లక్ష మూలధనం నందు 25% (ఎస్సీ, ఎస్టీ రైతులకు 33.33%) రాయితీతో (40 + 2) గొర్రెలు మేకలు యూనిట్ల స్థాపన (నాబార్డు ద్వారా).
- **గొర్రెలు మేకల ఉత్పత్తి (బ్రీడింగ్) కేంద్రం స్థాపించడానికి 25 లక్షల వరకు 25% (ఎస్సీ, ఎస్టీ రైతులకు 33.33%) మూలధనం నందు రాయితీ (నాబార్డు ద్వారా).**
- **గొర్రెల బీమా పథకం :**
    - గొర్రెలు బీమా చేయటానికి చెల్లించబడే ప్రీమియంలో 2/3 వ వంతు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.
    - గొర్రెల పెంపకం దారులందరూ అర్హులే.
    - బీమా చేసే గొర్రెల వయస్సును బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- **సంప్రదించవలసిన సంస్థ :** స్థానిక పశువైద్య కేంద్రం.

**ప్రీమియం వివరాలు**

**గొర్రె ఒక్కింటికి 1 సంవత్సరం వరకు బీమా చేయటానికి**

| గొర్రె వయస్సు | గొర్రె విలువ (రూ.లలో) | చెల్లించాల్సిన మొత్తం | రైతు వాటా ధనం | ప్రభుత్వ సబ్సిడీ రూ॥లలో |
|---|---|---|---|---|
| 4 నెలల నుండి 1 సం. వరకు | 1000/- | 49.63 | 19.63 | 30.00 |
| 1 సం. నుండి 7 సం. వరకు | 2000/- | 99.27 | 39.27 | 60.00 |
| **గొర్రె ఒక్కింటికి 2 సంవత్సరాల వరకు బీమా చేయుటకు** | | | | |
| 1. సం నుండి 7 సం. వరకు | 2000/- | 178.68 | 70.68 | 108.00 |

**6. కేంద్ర ప్రాయోజిత కోళ్ళ అభివృద్ధి పథకాలు :**

- 2011-12 నుంచి రాష్ట్రంలోని 6 జిల్లాల్లో గ్రామీణ పెరటి కోళ్ల పెంపక అభివృద్ధి పథకం అమలు జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం దీనికి నిధులు విడుదల చేస్తోంది. ఈ పథకంలో దారిద్ర్య రేఖకు దిగువనగల ఎంపికైన లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీపై 4 వారాల వయస్సుగల (గ్రామ ప్రియ, రాజశ్రీ, వనరాజ, గిరిరాజ) పిల్లలను ఒక్కొక్క లబ్ధిదారునికి 45 చొప్పున 3 విడతలలో 16 వారాలకొకసారి అందజేస్తారు.
- ఈ పథకంలో కోళ్లను శత్రువుల నుంచి మరియు ప్రతికూల పరిస్థితుల నుంచి కాపాడడానికి వసతి కల్పించబడుతుంది.
- **తల్లి యూనిట్లు :** ఇందులో ఎంపిక చేసిన లబ్ధిదారులు కోళ్ళ పొదుగుదల విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. ఇక్కడ కోడిపిల్లలను పంపిణీ దశ వరకు (4 వారాల వయస్సు) పెంచుతారు. ఈ సమయంలో ఇవ్వవలసిన టీకాలు ఇచ్చి పంపిణీకి సిద్ధంగా ఉంచుతారు. దీనికి 20% సబ్సిడీ (20,000) అందజేయబడుతుంది.

| క్రమ సం. | విభాగం | యూనిట్ వ్యయం (రూ.) | రాయితీ రేటు ప్రాజెక్టు వ్యయంలో 25% ఎస్సీ, ఎస్టీ, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి 33%) ఋణం ఆఖరి వాయిదాలకు సర్దుబాటు చేసే విధంగా |
|---|---|---|---|
| 1. | టర్కీలు, బాతులు, జపాను కౌజు పిట్టలు, ఈము పక్షులు మొదలైన 'లో ఇన్‌పుట్ టెక్నాలజీ' జాతుల పక్షిపిల్లల తయారీ కేంద్రాలకు | రూ. 30 లక్షలు (పక్షి జాతి, యూనిట్ సైజును బట్టి వ్యయం మారుతుంది.) | గరిష్ట పరిమితి రూ. 7.50 లక్షలు ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 10 లక్షలు |
| 2. | కేంద్రీకృత పెంపక యూనిట్లు (ఒక్కో బ్యాచ్‌కి 16000ల గ్రుడ్లు పెట్టే పక్షుల వరకూ) ఏడాదికి మూడు బ్యాచ్‌లు | రూ. 40 లక్షలు (16000 పక్షుల బ్యాచ్‌కి), (యూనిట్ సైజును బట్టి వ్యయం మారుతుంది.) | గరిష్ట పరిమితి రూ.10 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు సిక్కిం, బ్యాచ్‌కి, బ్యాచ్‌లోని పక్షుల సంఖ్యకు అనుపాతంలో రాయితీ ఉంటుంది) |
| 3. | హైబ్రీడు లేయరు (కోళ్ళు) యూనిట్లు, (ఒక్కో బ్యాచ్‌కి 5000 ల పక్షుల వరకూ) | రూ. 8 లక్షలు. (2000 పక్షుల బ్యాచ్‌కి, (యూనిట్ సైజునుబట్టి వ్యయం మారుతుంది.) | గరిష్ట పరిమితి ప్రతి 1000 పక్షులకి రూ.1 లక్ష ఎస్సీ, ఎస్టీలకు సిక్కిం, ఈశాన్య రాష్ట్రాలవారికి రూ. 1.33 లక్షలు. (పక్షుల సంఖ్య అనుపాతంలో రాయితీ ఉంటుంది). |
| 4. | హైబ్రీడు బ్రాయిలర్ (కోళ్ళు) యూనిట్లు, (ఒక్కో యూనిట్ 5000 ల పక్షుల వరకూ బ్యాచ్ అంతరం వారం, పక్షం, నెల ఏదైనా సరే అన్ని సమయాల్లోనూ యూనిట్‌లో ఉన్న పక్షుల సంఖ్య 5000 మించరాదు) | 1000 పక్షుల బ్యాచ్‌కి, రూ. 2.24 లక్షలు,(యూనిట్ సైజును బట్టి వ్యయం మారుతుంది.) | ప్రతి 1000 పక్షుల బ్యాచ్‌కి రూ. 56,000 లు. ఎస్సీ, ఎస్టీలకు సిక్కిం, ఈశాన్య రాష్ట్రాలవారికి రూ.74,600 లు (పక్షుల సంఖ్యకు అనుపాతం లో రాయితీ ఉంటుంది. గరిష్ట పరిమితి మొత్తం 5000ల పక్షుల యూనిట్‌కి రూ. 2.8 లక్షలకు, ఎస్సీ, ఎస్టీలకు సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 373 లక్షలు. |
| 5. | బ్రాయిలర్లూ, లేయర్లూ (వాణి జ్యాత్మకకోళ్ళు) కాక ఇతర పక్షి జాతుల పెంపకం | రూ. 10 లక్షలు. (పక్షి జాతి, యూనిట్ సైజును బట్టి వ్యయం మారుతుంది) | గరిష్ట పరిమితి రూ. 2,50 లక్షలు ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 3.33 లక్షలు. |
| 6. | దాణా తయారీ కేంద్రాలు (ఎఫ్.ఎం.పి.), వ్యాధి పరిశోధనాశాలలు (డి.ఐ.ఎల్.) | రూ. 16 లక్షలు. | గరిష్ట పరిమితి రూ. 4 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 5.33 లక్షలు |
| 7. | రవాణా వాహనాలు (ఓపెన్ కేజ్) | రూ. 8 లక్షలు | గరిష్ట పరిమితి రూ. 2 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 2.66 లక్షలు. |
| 8. | రవాణా వాహనాలు (రిఫ్రిజిరేటెడ్) | రూ. 15 లక్షలు | గరిష్ట పరిమితి రూ.3.75 లక్షలు ఎస్సీ,ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 5 లక్షలు. |
| 9. | చిల్లర విక్రయ కేంద్రాలు (డ్రెస్సింగ్ యూనిట్లు) | రూ. 6 లక్షలు | గరిష్ట పరిమితి రూ.1.50 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 2 లక్షలు. |
| 10. | చిల్లర విక్రయ కేంద్రాలు (మొబైల్ మార్కెటింగ్ యూనిట్లు) | రూ. 6 లక్షలు | గరిష్ట పరిమితి రూ.1.50 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 2.66 లక్షలు. |
| 11. | సంచార విక్రయ కేంద్రాలు (మొబైల్ మార్కెటింగ్ యూనిట్లు) | రూ. 8 లక్షలు | గరిష్ట పరిమితి రూ.2 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 2.66 లక్షలు. |
| 12. | కోళ్ళ ఉత్పత్తులకు శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు) | రూ. 20 లక్షలు | గరిష్ట పరిమితి రూ. 5 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 6.66 లక్షలు. |
| 13. | గ్రుడ్లు, బ్రాయిలర్ మాంసం బళ్ళు (కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు) | రూ. 10 వేలు | గరిష్ట పరిమితి రూ. 2,500 లు ఎస్సీ, ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 3,300 లు |
| 14. | గ్రుడ్లు, బ్రాయిలర్ మాంసం బళ్ళు (కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు) | రూ. 10 వేలు | గరిష్ట పరిమితి రూ.2,500 లు ఎస్సీ, ఎస్టీలకు సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 3,300 లక్షలు |
| 15. | గంటకు 2000 నుంచి 4000వరకూ పక్షులను సిద్ధం చేయ గల భారీ ప్రాసెసింగ్ యూనిట్లు | రూ. 500 లక్షలు | గరిష్ట పరిమితి రూ.125 లక్షలు ఎస్సీ, ఎస్టీలకు సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల వారికి రూ. 166,65 లక్షలు |
| 16. | ఈము ప్రాసెసింగ్ యూనిట్లు | యూనిట్ సైజును బట్టి వ్యయం మారుతుంది. | రాయితీ రేటు ప్రాజెక్టు వ్యయంలో 25% ఎస్సీ,ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాలవారికి 33% |
| 17. | ఈకల ప్రాసెసింగ్ యూనిట్లు | యూనిట్ సైజును బట్టి వ్యయం మారుతుంది. | రాయితీ రేటు ప్రాజెక్టు వ్యయంలో 25% ఎస్సీ,ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాలవారికి 33% |
| 18. | సాంకేతిక నవీనీకరణ | విభాగాన్నిబట్టి వ్యయం మారుతుంది | రాయితీ రేటు ప్రాజెక్టు వ్యయంలో 25% ఎస్సీ,ఎస్టీలకు, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాలవారికి 33% |

**7. పందుల పెంపకం**

- మేలుజాతి పందుల ఉత్పత్తి (బ్రీడింగ్) కేంద్రం స్థాపించుట కొరకు: (20 ఆడవి + 4 మగవి) (రూ. 6 లక్షల యూనిట్ ఖరీదులో 25% ప్రభుత్వ రాయితీ కొండప్రాంత మరియు ఈశాన్య భారత రాష్ట్రాలు మరియు ఎస్.సి., ఎస్.టి. రైతులకు 33 1/3% రాయితీ.
- మేలుజాతి పందుల పెంపకం కొరకు (రూ. 76 వేల యూనిట్‌లో 25% ప్రభుత్వ రాయితీ) కొండప్రాంత మరియు ఈశాన్య భారత రాష్ట్రాలు మరియు ఎస్.సి., ఎస్.టి. రైతులకు 33 1/3% రాయితీ.
- పందుల వర్తకం కొరకు (రూ. 5 లక్షల యూనిట్ కరీదులో 50% ప్రభుత్వ రాయితీ).
- పంది మాంసం రిటైల్ విక్రయ కేంద్రాల ఏర్పాటు. (రూ. 10 లక్షల యూనిట్ ఖరీదులో 50% ప్రభుత్వ రాయితీ).
- సంప్రదించవలసిన అధికార్లు : జిల్లా కేంద్రంలో నాబార్డు ఎ.జి.యం.

**8. కుందేళ్ళ పెంపకం**

- కుందేళ్ళ పెంపకం : రూ. 2.25 లక్షల యూనిట్ ఖరీదులో (ఎస్సీ, ఎస్టీ రైతులకు 33.33%) మూలధనం నందు 25% రాయితీ (నాబార్డు ద్వారా)
- సంప్రదించవలసిన అధికార్లు జిల్లా కేంద్రంలో నాబార్డు ఎ.జి.యం.

**9. పశుగ్రాసాభివృద్ధి పథకాలు**

**75% రాయితీతో మేలుజాతి పశుగ్రాస విత్తనాల సరఫరా**

నీటి వసతి కలిగి పశుగ్రాసం ఉత్పత్తి చేయగోరు రైతులకు 75% రాయితీతో మేలుజాతి పశుగ్రాస విత్తనాలు పశుసంవర్థక శాఖ పశు వైద్యశాలల ద్వారా అందజేస్తుంది. ఇందులో ముఖ్యంగా యస్.యస్.జి. 59-3, పి.సి -23 మొదలగు ఏకవార్షిక ధాన్యపు జాతి పశుగ్రాస విత్తనాలు సరఫరా చేయబడతాయి. వీటి ద్వారా 2 నుండి 3 కోతలు సులభంగా పొందవచ్చును. సన్న, చిన్నకారు రైతులు, ప్రభుత్వ పథకాల ద్వారా పాడి పశువులు/గొర్రెలు, మేకలు పొందిన లబ్దిదారులు అర్హులు.

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాస అభివృద్ధి కార్యక్రమాలు**

ఈ పథకం ద్వారా పశుగ్రాసాభివృద్ధి కార్యక్రమాలు రైతుశ్రేయస్సుకై, కరువు నివారణ చర్యలలో భాగంగా చేపట్టడం జరిగింది. జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు, షెడ్యూల్డు కులాలు మరియు జాతుల గ్రామీణులందరూ దీనికి అర్హులు. 100% రాయితీ.

**ఈ పథకంలో చేపట్టబడిన కార్యక్రమాలు యూనిట్ విలువ**

| | | |
|---|---|---|
| 1. పశుగ్రాస మొక్కజొన్న / జొన్న సాగు | - | 6,520/- |
| 2. సైలో పిట్ (పశుగ్రాసాన్ని పాతర చేయడానికి) | - | 17,206/- |
| 3. బహు వార్షిక పశుగ్రాస నర్సరీల పెంపకం | - | 19,158/- |
| 4. బహు వార్షిక పశుగ్రాసాల సాగు | - | 23,865/- |
| 5. సిల్వి పాశ్చరు - సుబాబుల్ / అవిశ మొక్కలు మరియు స్టైలో హెమాటా పెంపకం | - | 14,295/- |
| 6. చెరువులలో సామూహిక పశుగ్రాస సాగు (ఎకరాకు) : రూ | - | 3,975/- |

(చెరువు కాపలాకు 60 రోజులకు రూ. 7,500/- అదనం)

సంబంధిత పశువైద్యాధికారి మరియు ఉపాధి హామీ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుంది. దీర్ఘకాలికంగా పశుగ్రాసాల సాగు చేపట్టే ఆసక్తి గలిగిన రైతులు సంబంధిత పశు వైద్యాధికారిని సంప్రదించగలరు.

## కేంద్ర ప్రభుత్వ పశుగ్రాసాభివృద్ధి మరియు నిల్వ ప్రోత్సాహక పథకాలు

**అ) పాతర గడ్డి యూనిట్ల ఏర్పాటు :** పాతర గడ్డి తయారు చేసుకునే ఆసక్తిగల రైతులకు 100% ఆర్థిక సాయం అందజేయబడుతుంది. ఇందులో రూ. 75000/- పాతరగడ్డి గుంత కొరకు, 30,000/- గడ్డి కత్తిరించు యంత్రం కొరకు కేటాయింపుతో రూ. 1,05,000/- లు మంజూరు చేయబడుతుంది. పశుక్రాంతి, మినీ డైరీ, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులు, ఆత్మ, కెవికెలకు చెందిన రైతులు అర్హులు. అట్టి లబ్దిదారులకు పశుగ్రాస ఉత్పత్తికి ఉచితంగా మొక్కజొన్న జె-1006, జొన్న విత్తనాల చిరు సంచులను అందజేయటం జరుగుతుంది. పాతర గడ్డి తయారీ గుంత ఎస్టిమేట్స్ సంబంధిత జిల్లా / మండల పశు సంవర్థక శాఖ అధికారి ద్వారా పొందాలి. ఈస్టు బెల్లపు మడ్డి, సిల్పాలిన్ షీట్ మొదలగు వాటికి అయ్యే స్వల్ప ఖర్చులు రైతులు భరించాలి.

**ఆ) మోటారుతో నడిచే గడ్డి కత్తిరించు యంత్రాలు (చాఫ్ కట్టర్స్) :** 20 వేల రూపాయల యూనిట్ విలువతో లేదా చాఫ్‌కట్టర్ విలువ నందు 75% విలువలో ఏది తక్కువైతే దానికి రాయితీపై చాఫ్‌కట్టర్స్ (15,000/- రూపాయల గరిష్ట సబ్సిడి) అందజేయబడుతుంది. మిగతా 25% రైతు భరించాలి. పశుక్రాంతి, మినీ డైరీ, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులు, స్వయం సహాయక సంఘ సభ్యులు అర్హులు. ఇంతకుముందు రాయితీపై చాఫ్‌కట్టర్ సరఫరాతో లబ్దిపొంది ఉండరాదు.

**ఉపయోగాలు :** జొన్న, సజ్జ, మొక్కజొన్న లాంటి మేతల కాండాలు పెద్దగా, లావుగా ఉండటం వలన పశువులు మెత్తని భాగం, ఆకులు మాత్రమే తిని మిగిలిన మేతను (40 శాతం వరకు వృధా చేస్తాయి. పశుగ్రాసాల సక్రమ వినియోగానికి మేతను నరికి మేపడం వలన మేత పూర్తిగా సద్వినియోగం అయి మేత ఖర్చులు తగ్గించుకోవచ్చు.

**ఇ) అజొల్లా ఉత్పత్తికి ప్రోత్సాహం :** అజొల్లా ఉత్పత్తి చేయడానికి రూ.10,000/- యూనిట్ ఖరీదు నందు 50% రాయితీ (రూ.5000/-) అందజేయబడుతుంది. పశుక్రాంతి, మినీ డైరీ, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులు, స్వయం సహాయక సంఘ సభ్యులు అర్హులు, ఇంతకు ముందు రాయితీపై అజొల్లా యూనిట్‌తో లబ్దిపొంది ఉండరాదు. ■

# బాధ్యతాయుత భారత్ దిశగా... బిఎన్‌విలు

**ఓ భారతావనీ నీకు వందనం! అభివందనం!!**

**నీ చెట్టు నీడలో నీ ఫలాలు ఆరగించినవారు స్వప్రయోజనం కోసం ఆరాటపడుతూ, నీ, సంక్షేమం వదిలేశారు. నీ ఫలాలు అందరికీ అందనీకుండా అడ్డుపడుతున్నారు.**









అందుకే నీ పురిటినొప్పుల బాధ నీ బిడ్డలను కదిలించింది. అందులో ఒకరు ముందుకు కదిలారు. అడుగులు వేశారు భవిష్యత్ భారత్ కోసం. ఆ స్ఫూర్తితో నేడు భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అనే మొక్కలు నాటారు. ఈ మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి సంక్షేమ ఫలాలు అందరికి అందాలనే కాంక్షతో భారతావనిలో భాగమైన ఆంధ్రావనిలో ఈ మొక్కలు చిగురిస్తున్నాయి. ఇవి ఫలించాలనే కొండంత ఆశతో భారత్ నిర్మాణ్ రూపకర్తలు ఎదురుచూస్తున్నారు. నేను సహితం వాలంటీర్‌నవుతా అనే నినాదం ఆంధ్రావని యందంతటా వ్యాపిస్తోంది. ఏఎమ్ఆర్ - అపార్డ్ హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కార్యక్రమం బాధ్యతాయుత భారత్ దిశగా అడుగులు వేస్తోంది.

ముఖ్యంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని 46 మండలాల్లో "నేను సహితం-నా పల్లె కోసం, నా జన్మ భూమి కోసం సేవకుడిగా వస్తున్నా" అంటూ, బిఎన్‌విలుగా నమోదుకు యువతరం ఉత్సాహం చూపుతోంది. జిల్లాలో జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి, మండల అభివృద్ధి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, బి.ఎన్.వి.ల అవశ్యకతను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వాలంటీర్లు అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిలాంటి పల్లె సేవలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరులో బి.ఎన్.వి.లు నిర్మల్ భారత్ అభియాన్ ద్వారా గ్రామంలో 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నారు.

విడవలూరు మండలం అలగానిపాడులో రక్తదానశిబిరాలు, లైబ్రరీకి ప్రహరీ గోడ నిర్మాణం కోసం శ్రమదానాలు చేస్తూ వాలంటీర్లు పల్లెపై ప్రేమను చాటుతున్నారు. ముత్తుకూరు మండలంలో వాలంటీర్లు వృద్ధుల దినోత్సవాలు జరిపి పండ్లు పంపిణీ చేసి, మీకు మేమున్నామని ప్రేమానురాగాలు పంచుతున్నారు. యన్.టి.కాలనీలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.

వెంకటాచలం మండలం ఈదగాలిలో "గుప్పెడు బియ్యం" అనే కార్యక్రమం ద్వారా గ్రామంలోని నిరుపేదలకు బియ్యం అందిస్తున్నారు. గ్రామంలో ప్రతి యింటిలో ఓ పండ్ల మొక్కను నాటి వారి ఆదరాభిమానాలు పొందుతున్నారు.

గూడూరు మండలం తిరువెంగళాయపాలెంలో 108, ఆరోగ్యశ్రీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సీతారామపురం మండలంలోని జయపురం గ్రామం మద్య నిషేధ గ్రామంగా ఉంది. దీనిని కొనసాగిస్తూ, బి.ఎన్.విలు గ్రామస్తులను ఉత్తేజపరిచారు. పోలీసులు ఆ గ్రామంలోకి వెళ్ళరు. ఆ గ్రామస్తులు పోలీస్ స్టేషన్లు, కోర్టులకు వెళ్ళడం అనేది లేదు. శ్రమదానం ద్వారా పాఠశాలలు బాగుచేయటం, గ్రామంలో నూతన స్కూల్ బిల్డింగ్‌ను సాధించటం, గ్రామంలో మొక్కలు నాటడం, ఉపాధి పథకం సక్రమంగా అమలు, మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల గ్రామంలో వృద్ధాశ్రమం నిర్వాహకులకు ప్రోత్సాహం ఇచ్చారు. హెచ్ఐవిపై గ్రామంలో అవగాహనా సదస్సులు నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజిలు శుభ్రపరచటం, విద్యపై చల్లా యానాదులకు అవగాహన కల్పించటం, ఎస్.టి.ల జీవన విధానంలో మార్పులు తీసుకురావడం వంటి కార్యక్రమాలు కూడా వీరు నిర్వహించారు.

దగదర్తి మండలం వెలిపోడు గ్రామంలో వాలంటీర్లు అస్తవ్యస్థంగా ఉన్న స్కూల్ ఆవరణ బాగుచేయడం, మురుగు కాలువను నిర్మించటం, మంచినీటి సమస్యను పరిష్కరించటంతోపాటు, మరుగుదొడ్ల నిర్మాణంపై గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంకా పలు గ్రామాలలో వాలంటీర్లు సేవాకార్యక్రమాలు చేపట్టడానికి స్ఫూర్తిగా ఏఎమ్ఆర్ - అపార్డ్, హైదరాబాద్ వారిచ్చిన శిక్షణ, ఇ.టి.సి బాపట్ల శిక్షణలు తోడ్పడగా, మన-టీవి ద్వారా ఏఎమ్ఆర్ - అపార్డ్ కమీషనర్, ప్రసంగపాఠాలు యువతరానికి ఉత్తేజాన్ని కల్గించాయి. జిల్లాలో ఇప్పటివరకు మన-టీవి ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా బి.ఎన్.విల నమోదులో, సేవా కార్యక్రమాలలో భాగస్వాములైన వాలంటీర్లకు, అధికారులకు జనవరి 26, రిపబ్లిక్ డే సందర్భంగా ప్రశంసాపత్రాలు అందించటంతో, జిల్లాలో బి.ఎన్.విలు ఇంకా ఆసక్తిగా ముందుకొస్తున్నారు. భవిష్యత్ భారత్ కోసం సేవకులుగా మారుతున్నారు.

**ఎ.వై.శివ, జిల్లా ట్రైనింగ్ మేనేజర్, నెల్లూరు.**

# ధరిత్రీ పరిరక్షణ బాధ్యత అందరిదీ

**ఏప్రిల్ 22న ధరిత్రీ దినం. విశ్వాంతరాళంలో మానవ జాతి జీవించడానికి అత్యంత అనువైనది భూమి. నేటి మానవాళికి కావలసిన ముఖ్యమైన అంశాలు రెండు. అవి శాంతి, కాంతి.**

**ప్రపంచమంతా శాంతిని మాత్రమే కోరుకోవడం లేదు. ఆకుపచ్చ కాంతిని కూడా మనసారా కోరుకుంటున్నారు. అంటే పచ్చదనంతో మమేకమై జీవించాలని సర్వ మానవుల అభిమతం. ఆ స్వప్నం కల్లగా మిగలకుండా సాకారం కావాలని ప్రజల ఆకాంక్ష. భూగోళంపై పచ్చదనాన్ని విరబూయించే లక్ష్యంతో ప్రపంచ ప్రజలంతా 'ధరిత్రీ దినోత్సవాన్ని' జరుపుకుంటున్నాం. ఇప్పటి నినాదం బిలియన్ యాక్ట్ ఆఫ్ గ్రీన్ (Billion Act of Green).**

పచ్చని పరిసరాలు, స్వచ్ఛమైన నీటి వనరులు, పరిశుభ్రమైన, ఆహ్లాదభరితమైన వాతావరణం పెంపొందించి మానవావళి మనుగడకు అనువైన వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రణాళికలు వేయడం, దానికి అనుగుణంగా కార్యోన్ముఖులు కావడం ఈ సారి విశేషం. ఒక్క మాటలో విశదీకరించాలంటే ధరిత్రీ తలాన్ని ఆహ్లాదభరితంగా, ఆవాసయోగ్యంగా తీర్చిదిద్దటం. ఈ బృహత్ ఆశయం కార్యరూపం దాల్చాలంటే ఏ ఒక్కరో ప్రయత్నిస్తే అయ్యేపని కాదు. ప్రతి ఒక్కరూ తన వంతుగా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఈ భూమి మీద వున్న ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి.

ప్రకృతి వనరులను పరిరక్షించుకొనే పద్ధతులు ఇపుడు మనం కొత్తగా నేర్చుకుంటున్నవేమీ కాదు. అనాది మంచి మానవుడు ప్రకృతిని దైవంగా తలచాడు. ఆరాధించాడు కూడా. చతుర్వేదాలు, ఉపనిషత్తులలో ప్రకృతి ఆరాధనకు బీజాలు పడిన నాటి నుంచి నేటి వరకు ప్రకృతి మన ఆరాధ్య దైవమే. మన ప్రాచీన కట్టడాలలో కనిపించే నీటి సంరక్షణా పద్ధతుల



## ఏప్రిల్ 22న ధరిత్రీ దినం

ను గమనిస్తే, నాటి పాలకులు, ప్రజలు ప్రకృతిపరమైన వాటికి ఎంత ప్రాధాన్యత కల్పించారో చూడవచ్చు.

సింధు నాగరికతలో మొహంజదారో (Mohonjo Daro) లో స్నాన వాటిక (Great Bath), చోళుల కాలంలో ఎరి (Tank) పద్ధతులు, కాకతీయుల కాలంలో రామప్ప, పాకాల చెరువులు, రాజస్థాన్‌లో 'రాణిసర్' నీటి ట్యాంకులు ఈ కోవకు చెందినవే. నీరు పుష్కలంగా వుంటే, చెట్లు సమృద్ధిగా పెరుగుతాయి. తద్వారా ఆరోగ్యకరమైన వాయువులు లభిస్తాయి. దీనిని బట్టి చూస్తే, ఆనాటి పాలకులు, ప్రజలు ప్రకృతి పట్ల ఎలా వ్యవహరించాలో తెలుస్తుంది. వారు పర్యావరణానికి ఇచ్చిన విలువ కూడా అవగతం అవుతుంది. పర్యావరణ పరిరక్షణ చేస్తే, ఆహ్లాదభరితంగా జీవించగల్గుతామన్నది వారి భావన.

ఆధునిక మానవుని మన:స్థితి వేరుగా వున్నది. నేడు భిన్న కోణంలో పర్యావరణాన్ని చూస్తున్నారు. ఎన్నో ప్రయోగాలతో, నూతన ఆవిష్కరణలతో (Inventions) చేసిన అధునాతన సౌకర్యాల కారణంగా పర్యావరణాన్ని కాపాడలేకపోతున్నాడు. తన ఆవిష్కరణల వల్ల పర్యావరణానికి ఏ మేరకు నష్టం కలుగుతున్నదనే అంచనాకి రాలేకపోతున్నాడు. 150 ఏళ్ల క్రిందటి పారిశ్రామికీకరణతో మొదలైన వాతావరణ విధ్వంసం నేటికీ కొనసాగుతూనే వున్నది.

ఏయేటికాయేడు భూతాపం పెరిగి పోతున్నది. గడచిన యాభై ఏళ్ల నుంచి చూస్తే ప్రతి సంవత్సరం భూమి క్రమంగా వేడెక్కుతున్నది. భూమిలోని వాతావరణం రోజురోజుకూ వేడెక్కడం ప్రపంచ దేశాల ను కుదిపేస్తున్న సమస్య. దీనినే శాస్త్రవేత్తలు గ్లోబల్ వార్మింగ్ (Global warming) అంటారు. ముఖ్యంగా శీతల మండల దేశాలు వాటికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. మరి మిగతా దేశాల పరిస్థితి ఏమిటి? వీరు కూడా నిశ్చింతగా, నిర్భయంగా ఉండే వీలులేదు. ఎందుకంటే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూతాప ప్రమాద ఘంటికలు అన్ని దేశాలను కూడా కుదిపేస్తున్నాయి.

పసిఫిక్ మహా సముద్రంలో తరుచూ సంభవించే 'ఎల్‌నినో' ప్రభావం భారతదేశంపైన కూడా పడుతున్నది. తద్వారా మనదేశం కూడా పర్యావరణ మార్పులకు లోనవుతున్నది. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలో మంచు అధికంగా కరుగుతున్నది. దీని పర్యవసానం ఏమిటంటే, సముద్ర జలాల మట్టం పెరిగి లోతట్టు పట్టణ ప్రాంతాలు ముంపునకు గురై కనుమరుగయ్యే ప్రమాదం వుంది. పర్యావరణ శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం, సముద్ర మట్టం ఒక మీటరు పెరిగితే 50 శాతం రేవు పట్టణాలు సముద్ర గర్భంలో కలిసిపోతాయి. ఇది ఒక కోణం, మరొక కోణం తరచి చూస్తే, భూగోళంలో సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెంటీగ్రేడ్ పెరిగితే, 60 లక్షల టన్నుల గోధుమ ఉత్పత్తి తగ్గిపోతుందని అంతర్జాతీయ ఆహార వ్యవసాయ సంస్థ (International Food and Agriculture Organization) అంచనా. ఈ నష్టం ఒక్క



Sthanika_BW_April13.indd 31 02/04/13 3:55 PM


గోధుమ పంటకే కాదు, ఆహార ధాన్యాలైన వరి, కందులు, మినుములు, పెసలు, శెనగలు, వాణిజ్య పంటలయిన ప్రత్తి, వేరుశెనగ, పొగాకు, కాఫీ, టీ (Tea) లాంటి పంటలకు కూడా ఈ ప్రమాదం పొంచివుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆహార ధాన్యాల దిగుమతులు లక్ష్యం కన్నా 34 లక్షల టన్నులు తగ్గుతున్నాయి. అర్థ, గణాంక శాఖ ప్రకటన ప్రకారం జూన్ నుంచి ఆగస్టు దాకా వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ పంటల సాగు నిరాశాజనకంగా వుంది. కృష్ణా జిల్లా రిజర్వాయర్లలో నీరు లేకపోవడం వల్ల రెండో ఆయకట్టుకు నీరు లేక పంటల దిగుబడి దారుణంగా పడిపోయింది. వర్షాలు తగినంతగా కురవక పోవడానికి ముఖ్య కారణం వాతావరణ మార్పులే. సూర్య కిరణాల నుంచి వెలువడిన వేడిని కొద్ది శాతం నీరు పీల్చుకున్నా మిగతా కిరణాలు పరావర్తనం చెంది పర్యావరణంలోకి చేరుతాయి. ఈ గ్రీన్ హౌస్ (Green House) వాయువులు వేడిని సంగ్రహించి వాతావరణ ఉష్ణోగ్రత పెంపునకు దోహదకారులవుతాయి.

కూలర్, ఫ్రిజ్ మొదలైన శీతల ఉపకరణాల వల్ల కార్బన్ డై ఆక్సైడ్ (Co2), మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ప్రమాద వాయువులు వాతావరణంలో కలిసి పోయి అటు పంటలకు, ఇటు మానవుని ఆరోగ్య క్షీణతకు దోహదకారులవుతున్నాయి. పంటలపై వాతావరణ ప్రభావం పడటం వల్ల ఆహార దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. తద్వారా ఆహార సంక్షోభం సంభవించవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారు సరైన ఉపాధి దొరక్క, ధరల పెరుగుదల వల్ల ఆహారధాన్యాలకు ఖర్చుపెట్టలేని పరిస్థితి రావచ్చు. గ్రామీణ ప్రాంతాల వారి పరిస్థితి కడు దైన్యంగా మారే ప్రమాదం కూడా వుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలతోపాటు, అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ వంతు పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలి. సమస్త దేశాలు పర్యావరణ పరిరక్షణకు వడి వడిగా అడుగులు వేయాలి.

వాతావరణ మార్పులకు చాలా వరకు మానవ తప్పిదాలే కారణాలు. వాతావరణ కాలుష్యాన్ని మనమే పెంచి పోషిస్తున్నాం. కాలుష్య కారక ఇంధనాలను ఇబ్బడి ముబ్బడిగా వాడుతున్నాము. భూమిపై పెరుగుతున్న జనసాంద్రత కూడా కాలుష్యానికి ఒక కారణం. అధిక వనరుల వినియోగం, కలుషిత వాయువుల ఉద్గారాలు, పారిశ్రామిక వ్యర్థాలు, కాలుష్య వాయువులను విచ్చలవిడిగా పర్యావరణంలోకి వదలడంలాంటి ప్రమాదకర చర్యల వల్ల సహజ వనరులకు ప్రాణాంతకం అవుతున్నాయి. ఈ దెబ్బతిన్న భౌగోళిక పరిస్థితులను సరిదిద్దడం అంత తేలికైన పని కాదు. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. కఠినమైన చట్టాలను రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి.

భూమాతను పరిరక్షించుకోవడం అంటే ఈ భూమిమీద మనల్ని మనమే కాపాడుకోవడమే. మానవ మనుగడకు స్వచ్ఛమైన వాతావరణం కావాలి. పరిసరాలను, జంతుజాలాలను పరిరక్షించాలి. అటువంటి వాతావరణం కావాలి. కాని ఈనాడు జరుగుతున్నది ఏమిటి? కూర్చున్న చెట్టునే మనం నరుక్కొంటున్నాం. దీనికి మనమందరం బాధ్యత వహించాలి. ఈ ప్రధాన సమస్యపైన ప్రజలందరిలో అవగాహన కల్పించాలి. మన కుటుంబాలు, గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశం అందరం పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. పర్యావరణ




సమతుల్యంలో అడవుల భాగస్వామ్యం ఎంతైనా వుంది. పర్యావరణ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, 33% అడవులు వుండాలి. కాని నేడు దాదాపు ఇది 22%కి  పడిపోయింది. ఇంకా యదార్థ గణాంకాల ప్రకారం చూస్తే 19% మాత్రమే వుంది. భూమిపై అడవుల శాతం తగ్గితే నష్టం ఏమిటనే భావన చాలామందిలో ఉంది. వర్షపాతానికి మూలకారణం అడవులే. అన్ని ఆహార పదార్థాలకు, వనమూలికలకు ఆలవాలం అడవి. జీవావరణ వ్యవస్థలో ప్రకృతి, జీవరాశుల సమతుల్యాన్ని కాపాడడమేకాక, అడవులు వాతావరణంలోని విషపూరిత వాయువులను నియంత్రిస్తాయి. వరదలు రాకుండా కాపాడతాయి. అధిక వర్ష పాతం వల్ల భూసారం కొట్టుకుని పోకుండా కాపాడతాయి.

ధరిత్రీ పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, రాజీవ్ యువ వాలంటీర్లు, గ్రామీణాభివృద్ధి విభాగాలు, సహకార సంస్థలు పాలుపంచుకోవాలి. తమ వంతు కృషి చేయాలి. ఈ క్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహాయ సహకారాలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్గించాలి. స్వల్ప కర్బన్ల ఉద్గార సమాజం దిశగా ప్రజల్లో భారీ ఎత్తున చైతన్యం తేవాలి.

'వృక్షో రక్షతి రక్షత:' అన్న ఆర్యోక్తి ఇక్కడ స్ఫూర్తిదాయకం. చెట్లు మనకి ప్రాణవాయువు ఇస్తాయనటంలో ఎటువంటి సందేహం లేదు. పండ్లు, కూరగాయలు, పశువులు, కోళ్లు, చేపలు కూడా వ్యవసాయ భాగాలుగా చేపట్టే సమీకృత గ్రామీణ వ్యవసాయంతో ఒడిదుడుకులు లేని జీవనం సాగించాలి. అప్పుడే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాం. తద్వారా భూగోళంలో ప్రమాదకర వాయువులు తగ్గి, అతివృష్టి, అనావృష్టి, కరువు కాటకాల నుంచి ఉపశమనం కలుగుతుంది. అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుంది.

ఇలా మన ముందున్న పరిస్థితులకు ప్రాధాన్యత ఇస్తూ, వాటిని పరిష్కరిసన్తూ బయట ప్రపంచంపైన దృష్టి పెట్టాలి. జాతిపిత మహాత్మాగాంధీ గారు అన్నట్లు ప్రపంచంలో మార్పును చూడాలనుకుంటే ముందు నువ్వు మారాలి. మన వంతు బాధ్యతను మనం నిష్కామకర్మగా నిర్వర్తించిననాడు స్వచ్ఛమైన నీటిని, గాలిని ఆహ్లాద భరిత ధరిత్రిని మన తర్వాత తరాలకు కానుకగా ఇవ్వగల్గుతాం. ఈ మహాయజ్ఞాన్ని ముందుండి నడిపిద్దాం. కార్యోన్ముఖులమవుదాం. ధరిత్రిని కాపాడుకుందాం.

***- అంతటి అనంత్***



Sthanika_BW_April13.indd 32 02/04/13 3:55 PM

# చెదల నివారణ, రక్షణ చర్యలు

**చెదలు వ్యవసాయ పంటలతో పాటు, కలపను సమకూర్చే టేకు, వేప చెట్లకు కూడా పట్టటమే కాకుండా, నిల్వ వుంచిన వెదురు, గుడిసెలలోని కట్టడాలు, వంతెనలలోని కలప, ఇండ్లలోని కట్టె 'బీములు', ద్వారాలు, కిటికీలను కూడా నష్టపరుస్తాయి. ఇవేకాక, గ్రంథాలయాలలోని పుస్తకాలు, గిడ్డంగులలో నిల్వ చేసిన సరుకులకు కూడా అపారమైన నష్టం కలుగజేస్తాయి. వ్యవసాయ పంటలలో చేసే నష్టం ఒక ఎత్తయితే, మానవ వసతులకు చేసే నష్టం విలువ కట్టడం చాలా కష్టం. దీని వలనే చెదలు మిత్రులుగా కన్నా శత్రువులుగా గుర్తింపబడుతున్నాయి.**



వీటిని నివారించాలన్నా, నియంత్రించాలన్నా మొదట పుట్టు పూర్వోత్తరాల గురించి, వీటి ఆహారపుటలవాట్ల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. చెదలు ప్రాచీన కాలం నుండి అంటే 200 మిలియన్ సంవత్సరాల నుండి భూమిలో జీవిస్తున్నాయి. ప్రపంచంలో 2700 జాతులున్నప్పటికీ మనదేశంలో 300 జాతులున్నట్లు శాస్త్రవేత్తలు చెపుతున్నారు.

ఈ 300 జాతుల చెదలలో 6 జాతులకు చెందిన చెదలే మానవ వనరులను, పంటలను నష్టపరుస్తాయి. ఇవి మట్టిలోను, కట్టెలలోను నివసిస్తాయి. కొన్ని రకాల చెదలు భూమి అంతర్భాగంలోని పుట్టలలో నివసిస్తాయి. మరికొన్ని కట్టెలోపల భాగంలోను లేక కట్టె మీద గూళ్ళు కట్టుకొని నివసిస్తాయి. కొన్ని రకాల చెదలు ఆహార సేకరణ కోసం ప్రధాన పుట్ట నుండి 500 మీటర్ల దూరం వరకు వెళ్ళగలవు. ఈ చెదలకు ఆహారం మాత్రం 'సెల్యులోస్' అనే పదార్థం వున్న చెట్లు, చేమలు, కర్ర, కాగితం మరియు సేంద్రియ పదార్థాలు. చెదలు చాలా సున్నితమైన పురుగులు. ఎండను తట్టుకోలేవు. కనుక తేమ వున్న ప్రాంతాలకు దగ్గరగా పుట్టలు నిర్మిస్తాయి. పూర్వకాలంలో పుట్టలను బట్టి నీటి వనరులను గుర్తించేవారట.

వర్షం పడి భూమి బాగా తడిచినప్పుడు అనేక రకాలైన పురుగులు భూమి నుండి బయటకు వచ్చి, దీపాలచే ఆకర్షించబడతాయి. ఈ రెక్కల పురుగులలో ముఖ్యమైనవి ఉసుళ్ళు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వీధి దీపాల వద్ద కొన్ని వందల సంఖ్యలో ఉసుళ్ళు రెపరెపలాడడం అందరూ గమనించే వుంటారు. కాసేపటికి ఇవి భూమిపై పడి రెక్కలు విడిచి జతలు జతలుగా భూమిలోనికి దారివెతుక్కుంటాయి.

అంతేకాక, చాలా ప్రాంతాలలో మనుషులు వీటిని ఆహారంగా ఉపయోగిస్తారు. మిగిలిన ఉసుళ్ళు జతలు జతలుగా ఏర్పడి భూమిలో చేరి కొత్త పుట్టను ఏర్పరుస్తాయి. చీమలు, తేనెటీగలు, కందిరీగలలాగా చెదలలో కూడా నిర్దిష్టమైన సంఘ వ్యవస్థను చూడవచ్చు. ఒక కుటుంబంలో రాణి, రాజు, సైనిక, శ్రామిక వర్గాలుగా ఏర్పడి కుటుంబ సభ్యులందరికీ ఆహార, నీటి వనరులేకాక భద్రతను కూడా సమిష్టిగా చేకూర్చుకుంటాయి.

జత కట్టిన జత పురుగులలో ఆడ పురుగు గ్రుడ్లు పెడుతుంది. ఈ ఆడ పురుగే రాణి పురుగు. ఈ రాణి పురుగు పొట్టలో వేలకొలది గ్రుడ్లు నిండి వుండడం వలన, తటస్థంగా కదలకుండా, పుట్టలో క్రింద వుండిపోతుంది. ఈ గ్రుడ్లు బలవర్ధకమైన మాంసకృత్తులు కలిగి వుంటుంది. అంచేత మనలో కొంత మంది, పుట్టలు త్రవ్వి ఈ రాణి పురుగును పట్టి తింటుంటారు. రాణితో సంయోగం చెందే మగ పురుగు రాజు.

ఈ రాజు, రాణి సుమారు 15-50 సంవత్సరాలు జీవిస్తాయి. కాలక్రమేపి గ్రుడ్లు పిల్ల పురుగులుగా మారుతాయి. ఈ సంతతిలో సంతానోత్పత్తికి కావలసిన జననేంద్రియాలు వృద్ధి చెందనటువంటి ఆడ, మగ చెద పురుగులు సైనికులుగాను, శ్రామికులుగాను వుండిపోతాయి. వీటికి చూపు వుండదు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో శ్రామిక వర్గానికి చెందిన ఆడ, మగ పురుగులు జననేంద్రియాలను వృద్ధి చేసుకొని రెక్కలు లేని ద్వితీయ శ్రేణి సంతాన కారకులుగా మారుతాయి.

ఇక సైనికులు పుట్టలోని మిగతా సభ్యులకు రక్షణ కల్పిస్తాయి. చెద పుట్టలను త్రవ్వినప్పుడు ఎక్కువగా కనిపించేవి శ్రామిక జాతికి చెందిన చెదలే. ఇవి పుట్టలోని మిగతా సభ్యులకు ఆహార సేకరణలోను, పిల్ల పురుగుల పోషణ మరియు పుట్ట నిర్మాణం, శుభ్రత వంటి పనులను చేపడుతాయి. మానవ వసతులను తిని నష్టపరిచేవి ఈ శ్రామిక పురుగులే.

పంట కణాలలోని 'సెల్యూలోజ్' అనే పదార్థాన్ని జీర్ణించుకోగలిగే శక్తి శ్రామికుల జీర్ణకోశంలోని సూక్ష్మ జీవులకు ఉంది. జీర్ణించుకున్న ఆహారాన్ని నోటి ద్వారా మిగతా సభ్యులకు అందించడమే వీటి ప్రత్యేకత.

మానవ వసతులలో నివసించే చెదలు వాటి ఉనికి కనబడకుండా జీవిస్తాయి. ఈ మానవ స్థావరాలలో నివసించే చెదలను పసికట్టడం ఎలా? తొలకరి వర్షం తర్వాత, గృహాలు, గిడ్డంగులు, గ్రంథాలయాలలో ఉసుళ్ళు కనిపించినా, వదిలేసిన వాటి రెక్కలు కనిపించినా, నేలను తాకే గోడ అంచులలో మట్టి గూళ్ల గోడమీదకు ఎగప్రాకుతూ కనిపించినా, అక్కడ చెదలాశించినట్లు గుర్తించాలి. సజీవంగా వున్న మట్టి గూళ్ళా, కావా అని నిర్ణయించడానికి ఆ గూళ్ళను కూల్చి వేస్తే చెదలు కనిపించాలి లేదా కూల్చివేసిన గూడు మళ్ళీ మళ్ళీ యధావిధిగా కట్టినట్టు గమనిస్తే చెదలున్నట్టు లెక్క. ఇటువంటి నిఘా తరచుగా లేదా సంవత్సరానికొకసారి అయినా చేయాలి.

ఇళ్ళలోని ద్వారాలు, కిటికీలు, కర్ర సామాగ్రిని చెదలు ఆశించినపుడు కనుక్కోవడం కష్టతరం. ఇవి కనిపించకుండా లోపల చేరి మెత్తటి



Sthanika_BW_April13.indd 26 02/04/13 3:55 PM

కలపను తినివేయడం వల్ల బయట ఆకారం అంటే ఫ్రేమ్ యథాతథంగా వుంటుంది. పూర్తిగా నాశనం చేసేంత వరకు వీటి ఉనికిని గుర్తించడం సాధ్యం కాదు. చెదలాశించిన కర్రను వేళ్ళతో కొట్టి చూస్తే లోపల డొల్లగా మారడం వల్ల బోలు శబ్దం వినిపిస్తుంది. ఏదైనా ఇనుపరాడ్‌తో పొడిచి చూస్తే సులభంగా లోపలికి దిగి చెదలు విసర్జించిన మట్టి, కర్రపొడితో నిండిన చట్రం కనిపిస్తుంది. ఎక్కడైతే గోడలలో నీరు, లేదా చెమ్మ చేరే అవకాశముందో అంటే గోడల మధ్య ఇరుకులలో ఎలక్ట్రికల్ పైపుల వెంబడి చెదలు చేరి వృద్ధి చెందడానికి పరిస్థితులు అనుకూలంగా వుంటాయి.

## చెదల నివారణకు ముందస్తు చర్యలు

చెదల నుండి మానవ వసతులను కాపాడుకోవాలంటే ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం చాలా ముఖ్యం. చెదలను తేమ చేరే ప్రదేశాలు అకట్టుకుంటాయి. కాబట్టి వాటికి నీరు, తేమ అందుబాటులో లేకుండా జాగ్రత్త పడాలి.

☆ మానవ వసతులు - అంటే ఇండ్లు కట్టక మునుపు పునాదుల వద్ద నీరు చేరకుండా వుండే వసతి కల్పించాలి.

☆ మట్టి నింపేటప్పుడు వాలు కల్పించి వర్షపు నీరు ఇంకిపోయేలా సదుపాయం కల్పించాలి.

☆ పునాదుల మధ్య మట్టి నింపేటప్పుడు దానిలో 'సెల్యూలోస్' కలిగిన కట్టె, చెత్త, కాగితం లాంటి పదార్థాలు లేకుండా ఏరి వేయాలి.

☆ కొత్తగా నిర్మించే కట్టడాల క్రింద ఎండిపోయిన చెట్టు మొదళ్ళు, కొమ్మలు లేకుండా జాగ్రత్త పడాలి.

☆ అలాగే ఇంటికి దారి తీసే మెట్లు, ద్వారాలు, కిటికీలు నేల నుండి 6 అడుగుల ఎత్తున వుండాలి.

☆ కట్టడాలకు అనుకొని పాకే తీగ మొక్కలను పెంచకుంటే మంచిది.

☆ ఇంటి గోడలను ఆనుకొని కట్టెలను, కాగితాలను పేర్చకూడదు.

కట్టిన తర్వాత నిర్మాణాలలో చెదలను నివారించడం కన్నా, కట్టకముందే నేల క్రింద మట్టిని, పునాదులను ఆనుకొని రసాయనాలు వాడితే 5 నుండి 10 సంవత్సరాల వరకు రక్షించవచ్చు. ఇటువంటి నివారణ చర్యలు చేపట్టడానికి నిపుణులను కీటక నివారణ సంస్థల ద్వారా సంప్రదించవచ్చును.

***చెదలు నివారణకు వాడే కొన్ని రసాయనాలు***

☆ సైపర్ మెత్రిన్ ☆ పర్ మెథ్ ☆ ఫిప్రోనిల్ మొదలైనవి.

వీటిని వివిధ వ్యాపార సంస్థలు పలు వ్యాపార నామాలతో పిలుస్తారు. ఈ రసాయనాలను, నిర్దేశించిన మోతాదులో కాంక్రీట్ పోయకముందే మట్టిని శుద్ధి చేసి చెదలను నివారించవచ్చు. ఇలా చెదలను నివారించడానికి 200 కేజీ పైగా ద్రావణం ఉపయోగించాల్సి వస్తుంది.

## కట్టడాలకు చెదల నుండి రక్షణ కల్పించే విధానం

ఇక కట్టడాల విషయానికి వస్తే, కట్టడం బయట మరియు లోపల కూడా రసాయనాలతో రక్షణ కల్పించాలి.

☆ పునాదులపైనున్న గోడలనానుకున్న మట్టిని సిఫారసు చేసిన రసాయనాలతో తగిన మోతాదులో వాడి బాగా తడపాలి. దీనికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారు డ్రిల్లు సహాయంతో లేదా ఇతర పరికరాలతో పునాదుల వద్ద, పిల్లర్ల వద్ద అడుగున్నర గుంత త్రవ్వి రసాయనాలను పిచికారి చేస్తారు. దీనివలన రసాయనాలు భూమి లోపలికి జొరబడి చెదలు నిర్మాణం లోపలికి వెళ్ళకుండా రక్షణ కవచంలా అడ్డుకుంటాయి.

☆ ఇళ్ళలో ఫ్లోరింగ్ నుండి గోడలకు చెదలు ఎగబ్రాకకుండా క్రింది నేలను తడపడానికి డ్రిల్ సహాయంతో నిర్దిష్టమైన స్థలంలో, అంటే అడుగు ఎడమలో రంధ్రాలు చేసి, అందులో సిఫార్సు చేసిన రసాయన ద్రావణాన్ని ఒక పైపు ద్వారా భూమిలోనికి ప్రవేశపెడతారు.

☆ ఇదేవిధంగా ఇంటి గోడల బయల కూడా చేయాలి.

☆ ఇకపోతే ఎలక్ట్రికల్ పైపులు, ప్లంబింగ్ పైపులు, ద్వారాలు, కిటికీల ప్రక్కగోడలలో 45˚ కోణంలో డ్రిల్‌ను వాడి, రసాయనాలతో శుద్ధి చేయడం మరువకూడదు.

ఎక్కువ రసాయన ద్రావణం వాడి, భూమిని కలుషితం చేయకుండా, ఇతర జీవులు నష్టపోకుండా చెదలను నివారించేందుకు సుదీర్ఘంగా పని చేసే విషపు ఎరలను విదేశాలలో ప్రయోగిస్తున్నారు. ఎర స్థావరాలను ఇంటి చుట్టూ భూమి లోపల 10-20 అడుగుల ఎడమలో ఇంటికి రెండడుగుల దూరంలో పెట్టాలి.



రసాయనాలను పొందుపరచిన చెక్కబద్దను ఒక ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి విషపు ఎరగా వాడాలి. ఈ స్థావరాలను నెలకొకసారి పరిశీలించి చెదల పై నిఘా వుంచాలి. ఆహారాన్ని సేకరించే శ్రామిక చెదలు వీటిని తిని మిగతా సమూహ సభ్యులకు చేరవేస్తాయి. దీని వలన సమూహమంతా పూర్తిగా నశిస్తుంది. వీటిని ఫర్స్ట్‌లైన్, ఎక్స్‌టెర్రా, ప్రెమిస్ సెంట్రికాన్ అనే పేర్లతో వివిధ కీటక నివారణ సంస్థలు ఉపయోగిస్తున్నారు.

ఈ విషపు ఎరలలో కీటకనాశినులను తక్కువ మోతాదులో వాడటమేకాక పనివారు, ఇంటి బయట ఈ ఎరలను అమర్చగలరు. ఇంట్లో గోడలకు, నేలకు రంధ్రాలు చేసి పాడుచేయకుండా విషపు ఎరలు బయట పెట్టవచ్చు. కాకపోతే ఈ విషపు ఎరలను పెట్టే వారు చెదల అలవాట్లు తెలిసిన నిపుణులై వుండాలి. వీటివల్ల చెదల నివారణకు కొన్ని నెలల నుండి సంవత్సరం వరకు పట్టవచ్చు.

రసాయనాలు వాడకూడదన్నప్పుడు ఇసుక, స్టెయిన్‌లెస్, గ్లాస్ ముక్కలు వంటి భౌతిక అడ్డంకులను కూడా ప్రయోగిస్తున్నారు. చెదలు కొన్ని సైజుల ఇసుక రేణువులను, గ్లాస్, ప్లాస్టిక్, స్టీల్ మొదలైన వాటిని ఆహారంగా తీసుకోవు. కాబట్టి వీటితో పిల్లర్లను, పునాదులను కప్పినట్లైతే చెదలను అడ్డుకోవచ్చు. కాని కొన్ని సార్లు చెదలు వీటిపై మట్టి గూళ్ళు కట్టుకొని వీటిని దాటి కట్టడాలనాశించినట్లు తెలుస్తున్నది.

ప్రస్తుతం రసాయన అడ్డంకులే చెదల నివారణకు సమర్థవంతమైన అస్త్రం. ఈ అస్త్రాన్ని విచక్షణా రహితంగా ఉపయోగించకుండా, చెదలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించకుండా మనకు మంచి చేసే విధంగా వాటితోపాటు సహజీవనం సాగించాలి.

కర్ర సామాగ్రికి చెదలు పట్టినప్పుడు వాటి నుండి అవి ఏర్పరచిన మట్టి గూళ్ళను పూర్తిగా తీసివేసి ఆపై క్లోరోపైరిపాస్ కలిపిన ద్రావణంతో పూత పూయాలి. ఇటీవల కాలంలో ద్వారాలకు చెదలాశించకుండా, ప్రెషర్ ట్రీట్ చేయబడిన చెక్క లభ్యమవుతుంది.


***- డాక్టర్. వి. అనిత,*** *ఎ.ఆర్.ఐ., ఆగ్రో, హైదరాబాద్*



Sthanika_BW_April13.indd 27 02/04/13 3:55 PM

# మహిళలపై హింసకు విరుగుడు సామాజిక దృక్పథంలో మార్పు

## జస్టిస్ వర్మ కమిటీ నివేదిక


REPORT OF THE COMMITTEE ON
AMENDMENTS TO CRIMINAL LAW

JUSTICE J.S. VERMA (RETD)
CHAIRMAN

JUSTICE LEILA SETH (RETD)
MEMBER

GOPAL SUBRAMANIUM
MEMBER

JANUARY 23, 2013

**డిశంబర్ 16, 2012 తేదీన దేశ రాజధాని నగరంలో జరిగిన ఘోరమైన ఘాతుకం అందరికీ తెలిసిందే. ఈ సంఘటన తాలూకు పూర్వాపరాలు వ్యవస్థలోని లోపాల విచారణ నిమిత్తం భారత ప్రభుత్వం డిశంబర్ 23 వ తేదీన జస్టిస్ వర్మ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించిన విషయం కూడా అందరికీ తెలిసిందే. ఈ త్రిసభ్య కమిటీ పూర్తి వివరాలతో కూడినటువంటి తమ నివేదికను జనవరి 23, 2013 న భారత ప్రభుత్వానికి సమర్పించింది.**

జస్టిస్ వర్మ కమిటీ నివేదికను గనుక మనం నిశితంగా పరిశీలించినట్లైతే ప్రస్తుతం సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న వివిధ దురాగతాలకు మరియు ఇతర హింసాత్మక సంఘటనలకు ప్రస్తుత సామాజిక దృక్పథమే ముఖ్య కారణమని తెలుస్తోంది. దీనితో పాటు సామాన్య పౌరులు, అధికారులు మొదలుకుని రాజకీయ నాయకులు మరియు పాలకులు అందరూ తమతమ బాధ్యతలను విస్మరించటం కూడా మరో ముఖ్య కారణమనీ, అంతే కాకుండా, ప్రజాస్వామ్యానికి మూల స్థంభమైన న్యాయ పరిరక్షణ చేయవలసిన అవసరం కూడా ఎంతో వుందని ఈ కమిటీ పేర్కొంది.

**జస్టిస్ వర్మ కమిటీ పేర్కొన్న ముఖ్యమైన లోపాలు ఇలా ఉన్నాయి**

- విద్యా వ్యవస్థలోని లోపాలు / సవరించవలసిన అంశాలు
- సామాజిక ధృక్పథంలో మార్పు
- సుపరిపాలనను అందించటంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం
- రక్షణ విభాగంలో జాతీయ పోలీస్ కమీషన్ నివేదిక, సలహాలను అమలు పరచకపోవటం
- లింగ వివక్షతను రూపు మాపుటకు కావలసిన చర్యలను చేపట్టక పోవటం
- చట్టాలు ఎన్నున్నా వాటిని సక్రమంగా అమలు పరచకపోవటం

“ఈనాడు భారతదేశానికి కావలసింది. దేశాన్ని, దేశసౌభాగ్యాన్ని కాపాడే నిజమైన మానవతా వాదులు, నైతిక ప్రవర్తనను కలిగిన పౌరులే” అని కూడా వ్యాఖ్యానించింది. ప్రస్తుత తరుణంలో వెను వెంటనే చేయవలసిందీ, మహిళలకు కావలసిందీ....

- మహిళల గౌరవానికి కనీస హామీ
- మహిళలు ఖచ్చితంగా విద్యార్జన చేసేటట్లు చేయటం.
- ఇంటర్మీడియట్ స్థాయి వరకు మహిళలకు ఉచిత విద్య
- ఒంటరి మహిళలకు, వారికి కావలసిన సదుపాయాలను సమకూర్చటం
- అనాధ మహిళలకు పునరావాసం
- అక్రమ రవాణాను నిరోధించడం, అంతేకాకుండా భారత సమాజం మహిళల రక్షణకై మరియు లింగ సమానత్వానికై ఆషామాషీగా కాకుండా, దృఢంగా ప్రయత్నిస్తోందని తెలియజేసే చర్యలను చేపట్టటం అవసరమని సూచించింది.

సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న హింస (సెక్స్యువల్ అసాల్ట్) వివిధ నేరాల క్రిందకు రూపాంతరం చెందుతోందనీ, మహిళ ఇంటా బయటా కూడా అనేక రకాలుగా అసభ్యంగా లైంగిక, దాడికి గురవుతోందని, ఇందుకు ప్రధాన కారణంగా సమాజంలో మహిళల స్థాయి, కుల వివక్ష, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటం, తరతరాలుగా సమాజపు నరనరాల్లోను జీర్ణించుకుపోయిన పితృస్వామ వ్యవస్థ మూలాలుగా పేర్కొంటూ, ఇవన్నీ కూడా లింగ అసమానత్వానికి దారి తీస్తున్నాయని తెలియజెప్పడం జరిగింది.



ఇక విద్యా వ్యవస్థను చూసినట్లైతే విద్య అనేది ప్రతి ఒక్కరికీ పుట్టినప్పటి నుంచీ మొట్ట మొదటగా ఇంటి నుండే ప్రారంభమవుతుందనీ, ఆ విద్య జ్ఞానాన్ని ప్రసాదించేది కావటంతో పాటు వ్యక్తిత్వాన్ని వృద్ధి చేసేదిగా జీవితకాలం సామాజంలో ఒక మంచి వ్యక్తిగా స్థిరపడేందుకు దోహదం చేయాలనీ, తద్వారా సామాజిక నైతిక విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలనీ వ్యాఖ్యానించింది.

ప్రస్తుతం వివిధ సంఘటనల పట్ల వెల్లువెత్తుతున్న నిరసనలను గమనించినట్లైతే, భారతదేశం తన పాత తరపు ఆలోచనలు అలవాట్లు, దురాచారాలకు స్వస్తి చెప్పి, మహిళల సాధికారతకు, వారి రక్షణకు తగిన విధంగా మారాల్సిన అవసరానికి ఇది సూచన అనీ తెలియజేసింది. అంతే కాకుండా ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న దిగువ తెలిపిన అంశాలకు చట్టాలలో సరైన స్థానం లేకపోవటంతో, శిక్ష విధించటానికి వీలు లేకుండా పోతోందనీ, అందువల్ల ప్రస్తుతం అమలులో వున్న చట్టాలను సవరించవలసిన అవసరం ఎంతైనా వుందనీ కమిటీ తెలియజేసింది.

- యాసిడ్ దాడులు
- లైంగిక బెదిరింపులు / హింస
- వాయురిజం (Voyeurigm)
- వెంబడించి, వేధించడం మొదలైప వాటికి ఇండియన్ పీనల్ కోడ్‌లో స్థానం కల్పించి వాటికి సరైన శిక్షలు విధించాలని కూడా సూచించింది.

**ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ కమిటీ తన నివేదికలో పేర్కొన్న ముఖ్య సూచనలు :-**

- రాజ్యాంగంలో పొందుపరచబడిన విధంగా మహిళల సమానత్వాన్ని కాపాడటం. వారిని, వారి హక్కులను గౌరవించడం.
- భారత దేశంలో జరిగే వివాహాలన్నింటినీ (వారి వారి చట్టాలతో సంబంధం లేకుండా) తప్పని సరిగా మేజిస్ట్రేట్ ఎదురుగా నమోదు చేయడం.
- నివేదికలో సూచించిన విధంగా క్రిమినల్ లా అమెండ్ మెంట్ యాక్ట్ 2012 ను రూపొందించి ప్రజా విశ్వాసాన్ని చూరగొనటం.
- రేప్ జరిగినట్లుగా వచ్చే ప్రతి ఫిర్యాదును పోలీసు వారు నమోదు చేయటం, అంతే కాకుండా సామాన్య ప్రజానీకం దృష్టిలోకి వచ్చిన ఇటువంటి సంఘటనలపై ఫిర్యాదు చేయటంలో పౌరులు తమ వంతు పాత్ర నిర్వహించటం.
- ఫిర్యాదులను నమోదు చేయని అధికారులను శిక్షించటం.
- రేప్‌కి గురైన వారు అందుమూలంగా వికలాంగత్వాన్ని పొందినట్లైతే వారికి సక్రమ న్యాయం అందించే ఏర్పాట్లు చేయడం.
- ప్రకాష్ సింగ్ కేసులో సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పులోని విధానాన్ని అనుసరించి ప్రతి పోలీసు కమీషనర్ మరియు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసును సెలెక్ట్ చేయడం
- విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన పోలీసులను, సంబంధిత చట్టం మరియు వారి సేవా నియమాలను బట్టి శిక్షించటం.
- ప్రతిజిల్లా మేజిస్ట్రేటు తన పరిధిలోని "కనబడని పిల్లల" లెక్కలు తయారు చేయటం. అందుకు బాధ్యత వహించటం.
- భారతదేశం ఆర్థికంగా బలోపేతం కావటానికి "బాల కార్మిక వ్యవస్థ" ను సాధనంగా వాడుకోరాదు.
- "కమ్యూనిటీ పోలీసింగ్" వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు పౌరులుగా తను బాధ్యతను నిర్వర్తించటానికి సామాన్య ప్రజానీకాన్ని ప్రేరేపించవచ్చును.
- చీకటి ప్రాంతాలలో ఎక్కువ నేరాలు జరగడానికి అవకాశం వుంది కాబట్టి ప్రతి ప్రాంతంలోనూ వీధి దీపాలు ఏర్పాటు చేయటం.
- వీధులలో నిర్వహించే చిల్లర వ్యాపారాలను సామాన్య ప్రజానీకానికి ఆహారాన్ని కల్పించే వాటిగా మాత్రమే కాకుండా బస్‌స్టాప్‌లు, ఫుట్‌పాత్‌లపై కూడా అనుమతించడం ద్వారా పాదచారులకు, సమాజానికి కూడా ఒక విధంగా రక్షణ కల్పించవచ్చును.
- రాజ్యాంగ పరంగా మరొక కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్‌ను నియమించినట్లైతే మహిళలు, పిల్లలకు అవసరమైన విద్యను అందించటం, వివక్షతను రూపుమాపటం కొరకు కృషి చేయవచ్చును.
- ప్రజా ప్రాతినిధ్య చట్టం - 1951 ను సవరించటం ద్వారా నేర చరిత్ర కలిగిన రాజకీయ నాయకులను నిరోధించటం, తద్వారా నిజమైన నాయకులను స్థానం కల్పించటం.
- ఈ చట్టంలో సెక్షన్ 33 ఎ ను సవరించటంతో పాటు, నామినేషన్‌తో పాటు నేర చరిత్ర లేనట్లుగా హైకోర్టు రిజిస్ట్రార్ ఇచ్చిన ధృవ పత్రాన్ని సమర్పించటం.
- అన్ని రాజకీయ పార్టీలు ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయబడేటట్లుగా చట్టాన్ని చేయడం.

ఈ సూచనలతో పాటుగా కమిటీ నివేదికలో పొందుపరచబడిన ఇతర అంశాలను కూడా త్వరితగతిన అమలు పరచనట్లైతే ఈ కమిటీని నియమించిన ఉద్దేశ్యం మరియు అత్యంత వేగంగా కమిటీ సమర్పించిన నివేదిక కూడా అర్థం లేకుండా పోతాయని కమిటీ తన నివేదికలో అంతిమంగా పేర్కొంది.

**జి. సత్యవాణి, ఫ్యాకల్టీ మెంబర్, సిడిపి అండ్ ఎ, ఎఎంఆర్- అపార్డ్**



# ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వ పథకాలు

## ప్రచారోద్యమం చేపట్టిన కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార విభాగం

**మాతా, శిశు ఆరోగ్య రక్షణకు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్.ఆర్.హెచ్.ఎం) ద్వారా అనేక సదుపాయాలు కల్పించినా, ఇంకా చాలా మంది ప్రజలు వాటిని పూర్తిగా ఉపయోగించుకోలేక పోతున్నారు. నేటికీ దేశంలో ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు రక్తహీనతతో బాధపడుతున్నారు. గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకోని కారణంగా గ్రామీణ ప్రాంతాలలో సగం మంది పిల్లలు పుట్టిన వెంటనే ఉండవలసిన బరువు కంటే (కనీసం 2.5) కేజీలు తక్కువ బరువుతో పుడుతున్నారు. సుమారు 20 శాతం కాన్పులు ఇంటి వద్దనే జరుగుతున్నాయి.**

జన్మించే ప్రతి వెయ్యి మంది శిశువులలో 46 మంది మొదట పుట్టిన రోజు బరువు తెలుసుకోకుండానే కన్నుమూస్తున్నారు. ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోని కారణంగా తక్షణ వైద్య సహాయం అందక ప్రతి లక్షమంది బాలింతలలో 134 మంది ప్రసవ సమయంలో మరణిస్తున్నారు. ఇంకా అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించని వారు కూడా చాలా మంది ఉన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్య లోపం మూలంగా అతిసారం, మలేరియా, డెంగూ, చికెన్ గున్యా జ్వరాలతో గ్రామాలలో ప్రజలు బాధ పడుతున్నారు.

ధూమపానం, మద్యపానం లాంటి దురలవాట్లు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, కేన్సర్, శ్వాసకోశ వ్యాధుల కేసులు కూడా గ్రామాలలో విజృంభిస్తున్నాయి. దేశ ప్రజల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు ఏదో ఒక జీవనశైలి వ్యాధితో బాధపడుతున్నట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అంచనా వేసింది. ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు, ఆహారపు నియమాలు పాటిస్తే, ఈ రోగాలు రాకుండా రక్షించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో పల్లె ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి, ప్రభుత్వం కల్పించే సదుపాయాలను గురించి చైతన్య పరచాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వంలోని క్షేత్ర ప్రచార విభాగం రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బాగా వెనుకబడిన గ్రామాలలో విస్తృత ప్రచార కార్యక్రమం చేపట్టింది.

ముఖ్యంగా మహిళలు, పిల్లల ఆరోగ్య రక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జననీ శిశు సురక్ష కార్యక్రమం, జనని సురక్ష యోజన, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, జీవనశైలి వ్యాధుల గురించి సదస్సులు, కళాజాత ప్రదర్శనలు, ర్యాలీలు, క్విజ్ పోటీలు, సినిమా ప్రదర్శనలు, ఫొటో ఎగ్జిబిషన్స్ నిర్వహించారు.

అక్టోబరు నుంచి నాలుగు నెలలపాటు నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో మూడు జిల్లాలలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్), నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకె) జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఇంకా కేంద్ర గేయ, నాటక విభాగం, ఫొటో ప్రదర్శన విభాగం, (డిఎవిపి), స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకొనే ముఖ్యమైన నాలుగు ఆరోగ్య పథకాల గురించి ఈ సదస్సుల్లో వివరించారు. ఈ నాలుగు కార్యక్రమాల గూర్చి వివరంగా తెలుసుకుందాం.

### జననీ శిశు సురక్ష కార్యక్రమం

శిశు మరణాలను నివారించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలోని ముఖ్యాంశాలు :

**గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రి అందించే ఉచిత సేవలు**

★ ఉచిత ప్రసూతి / కాన్పులు ★ ఉచిత సిజేరియన్ శస్త్రచికిత్స



Sthanika_BW_April13.indd 19 02/04/13 3:55 PM

★ ఉచిత మందులు (గర్భిణీ స్త్రీలకు మరియు ప్రసవాలకు)
★ ఉచిత ఆరోగ్య పరీక్షలు
★ ఉచిత ఆహారం (ప్రసవ సమయంలో)
★ ఉచిత రక్తం ★ ఉచిత రవాణా సౌకర్యం

**అనారోగ్య నవజాత శిశువుకు ప్రభుత్వ ఆసుప్రతిలో అందించే ఉచిత సేవలు (పుట్టిన తేది నుండి 30 రోజుల వరకు)**

★ ఉచిత మందులు ★ ఉచిత ఆరోగ్య పరీక్షలు
★ ఉచిత రక్తం
★ పుట్టిన వెంటనే (0 డోస్) వేసే వ్యాధి నిరోధక టీకాలు
★ ఉచిత రవాణా సౌకర్యం

ఇంటినుండి సమీప ప్రభుత్వ ఆసుప్రతికి (లేదా) ఒక ఆసుపత్రి నుండి సమీప పెద్ద ఆసుపత్రికి, తిరిగి ఇంటి వద్దకు 108 అంబులెన్స్ లేదా ప్రభుత్వ అంబులెన్స్ సేవలు.

## జననీ సురక్ష యోజన

★ ప్రతి గర్భిణీ స్త్రీ సమీప ఆసుపత్రిలో గాని, ఆరోగ్య కేంద్రంలో గాని పేరు నమోదు చేసుకోవాలి.
★ కనీసం 3 సార్లు గర్భిణీ స్త్రీ ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం, రక్తహీనత రాకుండా 100 ఐరన్ మాత్రలు, టి.టి. ఇంజక్షన్‌లు రెండు తీసుకోవాలి.
★ ప్రమాద చిహ్నాలు - రక్తహీనత, రక్తస్రావం, మూర్ఛ, రక్తపోటు, కవలలు మొదలైన వాటిని స్త్రీలు ముందుగా గుర్తించి ఆసుపత్రిలో చికిత్స పొందాలి.
★ ఆసుపత్రిలో ప్రసవం చేయడానికి శిక్షణ పొందిన డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారు.
★ ప్రసవానంతరం 2 సార్లు పరీక్షలు చేయించుకోవడం, అదీ 48 గంటలలోపు చేయించుకున్నట్లయితే పుట్టిన బిడ్డ సురక్షితం.
★ బాలింత దశ ముఖ్యమైనది - పరిశుభ్రత, పోషకాహారం మొదలైన వాటివలన మాతా శిశు మరణాలను నిరోధించగలం.
★ పేద మహిళలు ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పు చేయించు కున్నట్లయితే గ్రామీణ ప్రాంతాలలో రూ. 1000, పట్టణ ప్రాంతాలలో రూ. 600 నగదు పారితోషికం ఇస్తారు.
★ 19 సంవత్సరాల వయస్సు కంటే ఎక్కువ ఉన్న స్త్రీలకు రెండు కాన్పుల వరకు నగదు ప్రోత్సాహకం లభిస్తుంది.

## జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం

1985 లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా పేద ప్రజలందరికీ ఈ క్రింద పేర్కొన్న టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది.

గర్భం దాల్చిన వెంటనే టి.టి. 1 ఇంజక్షన్. టి.టి. 1 వేసిన ఒక నెల తరువాత శిశువుకు టి.టి. 2 లేదా టి.టి. బూస్టర్ (ఇంజక్షన్).

బిడ్డ పుట్టగానే బి.సి.జి. పోలియో, హైపటైటిస్ 'బి' (0 మోతాదు, ఒకటిన్నర నెలలు (6 వారాలు) డి.పి.టి. పోలియో, హైపటైసిస్ 'బి' (మొదటి మోతాదు), రెండున్నర నెలలు (10 వారాలు) డి.పి.టి. పోలియో, హైపటైసిస్ 'బి' (రెండవ మోతాదు), మూడున్నర నెలలు (14 వారాలు) డి.పి.టి. పోలియో, హైపటైసిస్ 'బి' (మూడవ మోతాదు)

9 నెలలు తట్టు (మీజల్స్) ఇంజక్షన్, విటమిన్ - ఎ మొదటి మోతాదు, (6నెలల వ్యవధితో విటమిన్ - ఎ 9 మోతాదు, 16 నుండి 24 నెలలకు డి.పి.టి. పోలియో బూస్టర్ మోతాదు

సంవత్సరంలోపు పిల్లలందరికీ సకాలంలో టీకాలు వేయిస్తే, భవిష్యత్తులో వచ్చే 7 ప్రాణాంతక వ్యాధుల నుండి పిల్లలకు రక్షణ లభిస్తుంది.

## జీవనశైలి వ్యాధులు - జాగ్రత్తలు

మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, కేన్సర్, దీర్ఘకాల శ్వాస కోశ వ్యాధులను 'జీవనశైలి వ్యాధులు' అంటారు. మన దేశంలో పట్టణ ప్రాంతాలలో మృతి చెందే ప్రతి పదిమందిలో ఎనిమిది మంది, గ్రామీణ ప్రాంతాలలో మృతి చెందే ప్రతి పదిమందిలో ఆరుగురు ఈ వ్యాధుల కారణంగానే మరణిస్తున్నారు.

ముఖ్యంగా మధ్య వయసులో ఉన్న వారు (35 సంవత్సరాల నుండి 64 సంవత్సరాలు) ఈ వ్యాధులకు ఎక్కువగా గురవటం మరింత ఆందోళనకరమైన విషయం, జీవనశైలి వ్యాధుల కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రతి సంవత్సరం 2.8 కోట్ల మంది కన్ను మూస్తున్నారని, కొన్ని ముందస్తు జాగ్రత్తల ద్వారా ఈ మరణాలలో సగం తగ్గించవచ్చని ''ప్రపంచ ఆరోగ్య సంస్థ' పేర్కొంది.

ఒక్క మధుమేహం వ్యాధితో మన దేశంలో ఆరు కోట్ల మంది బాధపడుతున్నారు. ఒక్క కేన్సర్ వ్యాధితో 2011 లో 5.56 లక్షల మంది మరణించారు. గుండె జబ్బులు, మధుమేహం, కేన్సర్ లాంటి జబ్బుల వలన ప్రతి ఏటా 1.42 కోట్లమంది చనిపోతున్నారు. ఆహార నియమాలు పాటిస్తూ కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ప్రాణాలను హరించే వీటి నుంచి మన ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. అలాగే ఈ వ్యాధులు సోకిన వారికి వైద్య సహాయం అందించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వంద ఎంపిక చేసిన జిల్లాల్లో జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

***జీవనశైలి వ్యాధులు రాకుండా కొన్ని ముఖ్యమైన ముందస్తు జాగ్రత్తలు :***

★ బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎమ్.ఐ.) ఎపుడూ 25 లోపు ఉండేవిధంగా చూసుకోవాలి.
★ 35 సంవత్సరాలు దాటిన వాందరూ ప్రతి సంవత్సరం షుగర్, బిపి, గుండె, మూత్రపిండాల పరీక్ష చేయించుకోవాలి. ఏదైనా తేడా ఉంటే డాక్టరు సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
★ ధూమపానం, గుట్కాలు నమలటం, మద్యపానం పూర్తిగా మానేయాలి.
★ ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు,వేపుళ్ళు, జంక్‌ఫుడ్ బాగా తగ్గించాలి.
★ పీచు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, తృణ ధాన్యాలు ఎక్కువగా తినాలి. మాంసాహారం బాగా తగ్గించాలి.
★ ప్రతిరోజూ ఒక గంటసేపు వ్యాయామం (యోగ, నడక, ఈత, జాగింగ్, ఏరోబిక్ ఎక్సర్‌సైజులు) చేయాలి. బరువు పెరగకుండా చూసుకోవాలి.
★ మానసిక వత్తిడికి గురవకుండా ఉల్లాసంగా ఉండాలి.
★ రోజుకు కనీసం మూడు లీటర్ల సురక్షిత మంచినీరు త్రాగాలి.

*- రామేశ్వర్, జిల్లా శిక్షణా మేనేజర్, రంగారెడ్డి జిల్లా*


Sthanika_BW_April13.indd 20 02/04/13 3:55 PM




# జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో...

**యూపిఏ ప్రభుత్వం తొలివిడత అధికారంలోకి వచ్చిన తర్వాత 2005లో చట్టరూపం దాల్చింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) గా దీనికి నామకరణం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల పాటు కచ్చితంగా ఉపాధి భద్రతను కల్పించడం ఈ పథకం ఉద్దేశం.**

**పనితీరు ఇదీ....**

- ☆ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 12.55 కోట్ల మేర జాబ్ కార్డులు జారీ అయ్యాయి.
- ☆ రోజువారీ వేతనం ప్రస్తుతం రూ. 100గా ఉంది. దీనిపై ఎంతైనా అదనంగా చెల్లించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. మన రాష్ట్రంలో రూ. 137 వరకు చెల్లిస్తున్నారు.




**వార్షిక ప్రణాళికల్లో కేటాయింపులు**

| | |
|---|---|
| 2013-14 బడ్జెట్ | : రూ. 33,000 కోట్లు |
| 2012-13లో బడ్జెట్ | : రూ. 33,000 కోట్లు |
| 2011-12లో బడ్జెట్ | : రూ. 40,000 కోట్లు |

- ☆ 2012-13లో ఇప్పటిదాకా 4.49 కోట్ల కుటుంబాలకు పని కల్పించారు.
- ☆ నిధులను ఖర్చుచేయడంలో రాష్ట్రాలు వెనుకబడుతున్నాయి. 2012-13లో రూ. 25 వేల కోట్లే ఖర్చు చేశారు.
- ☆ కరువు ప్రాంతాల్లో ఈ పథకం కింద ఏడాదికి పని రోజులను 100 నుంచి 150కి పెంచారు.
- ☆ ఈ స్కీమ్ లబ్ధిదారులకు వేతనాలను బ్యాంక్ ఖాతాలకే జమ చేసేలా ఆధార్ ఆధారిత చెల్లింపు విధానాన్ని 46 గ్రామీణ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుకింద అమల్లోకి తీసుకొచ్చారు.

**రాష్ట్రంలో పరిస్థితి ఇదీ....**

ఇప్పటిదాకా 1.31 కోట్ల జాబ్ కార్డులు ఇచ్చారు. 2012-13లో కొత్తగా 6.76 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు జారీ అయ్యాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 56.32 లక్షల కుటుంబాలకు పని కల్పించారు. 7.92 లక్షల కుటుంబాలు 100 రోజుల పనిని సద్వినియోగం చేసుకున్నాయి.

2012-13లో 15.26 లక్షల పనులను చేపట్టగా, ఇప్పటిదాకా 6.73 లక్షల పనులే పూర్తయ్యాయి. ఈ పనులకు రూ. 1,743 కోట్లు అందుబాటులో ఉన్నప్పటికీ, పూర్తయిన పనులకు రూ. 558 కోట్లు ఖర్చు చేశారు.

◆



Sthanika_BW_April13.indd 28 02/04/13 3:55 PM

# రైతు కూలీ నుండి కూరగాయల రైతుగా.....

**గ్రామీణ ప్రాంతంలో రైతు కూలీలుగా అధిక శాతంలో ఉండే షెడ్యూల్డ్ కులాల వారి కోసం ప్రభుత్వం అమలు జరుపుతున్న కార్యక్రమాలు, ముఖ్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకొని రైతు కూలీ దశ నుండి కూరగాయలు పండించే రైతు స్థాయికి చేరిన షెడ్యూల్డ్ కులానికి చెందిన కొండపాక రవీందర్ విజయగాధను తెలుసుకుందాం.**

| | | |
|---|---|---|
| పేరు | - | కొండపాక రవీందర్ |
| గ్రామం | - | వెంకటాపూర్ |
| మండలం | - | నంగునూర్ |
| జిల్లా | - | మెదక్ |
| జాబ్ కార్డు నెం. | - | 0094 |
| సర్వే నెం. | - | 46 |
| విస్తీర్ణం | - | 2 ఎకరాలు |
| వివరాలు సేకరించిన తేది | - | 9-1-2013 |



తెలంగాణ ప్రాంతంలోని మెదక్ జిల్లా మారుమూల ప్రాంతం అయిన వెంకటాపూర్ (నంగనూర్ మండలం) గ్రామానికి చెందిన కొండపాక రవీందర్ షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి. వారి తాత, ముత్తాతల కాలం నుండి గ్రామంలోని ఆసాముల (పెద్ద రైతుల) వద్ద వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారు. అతనికి రెండు ఎకరాల భూమి ఉన్నా, అది కేవలం నామమాత్రంగానే ఉండేది. అంటే రాళ్ళు, రప్పలు, పొదలతో కూడుకుని ఉండటంతో, సేద్యానికి అనుకూలమైనది కాదు.

ఆ భూమిని అభివృద్ధి చేసుకోలేక, భూమి అభివృద్ధికి అవసరమైన పెట్టుబడికి తగిన ఆర్థిక స్థోమత లేక ఏమీ పండించుకోలేక పోయేవాడు. అందువలన రవీందర్ తనకి 2 ఎకరాల భూమి ఉన్నట్లు కూడా మరిచిపోయి, రైతు కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు.

ఈయనకు ఉన్న 2 ఎకరాల భూమి సేద్యానికి అనుకూలంగా లేకపోవటం వల్ల, పంట సేద్యం చేయలేక తాపి మేస్త్రీ పనితో జీవనం గడుపుతున్నాడు. అందుకు రోజుకు రూ. 100 లభించేవి.

ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో భాగంగా భూమి అభివృద్ధి చేసుకోవచ్చునని మండల అభివృద్ధి అధికారి ద్వారా తెలుసుకున్నాడు. అధికారులను ఆశ్రయించగా, 2004-2008 సంవత్సరంలో ఒక ఎకరానికి 70 మామిడి మొక్కలను గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సరఫరా చేయడం జరిగింది. మొదటి సంవత్సరంలోనే ఆయన 100 శాతం అంటే 70 మొక్కలు సజీవంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకున్నాడు.

ప్రస్తుతం మామిడి తోట కూడా బాగా ఉంది. బోరులో నీరు తక్కువగా ఉండటం వల్ల, మామిడి తోటకు యం.జి.యన్.ఆర్.జి.యస్. ద్వారా బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) సదుపాయం కూడా కల్పించారు.

మామిడి తోట నుండి 4 వ సంవత్సరంలో రూ॥ 10,000లు ఆదాయం వచ్చింది. దీనిలో ప్రస్తుతం అంతర్ పంటగా టమాటా పంటను తీసుకొవడం జరిగింది. టమాటా పంటలో కూడా చాలా మంచి దిగుబడి రావటం జరిగింది. టమాటాలు అమ్మటం వలన ఆయనకు రూ॥ 60,000 ఆదాయం వచ్చింది.

ఈయనకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేసింది. అది పూర్తి కానందున తనకు వచ్చిన ఆదాయంతో మంచి ఇల్లు కట్టుకున్నానని తెలిపాడు. అతనికి ఇద్దరు సంతానం. ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కూతురు 10వ తరగతి, కొడుకు 5వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు.

"నాకు ఇద్దరు పిల్లల్నీ బాగా చదివించాలని ఉంది. నేను మాత్రం 9 వ తరగతి పాసై, 10 వ తరగతి పెయిల్ అయ్యాను. కాబట్టి నా పిల్లలనైనా బాగా చదివిస్తాను. వచ్చిన ఆదాయంతో సుఖంగా జీవనం గడుపుతున్నాను. నాకు నాన్న, అమ్మ కూడా ఉన్నారు. ఈ మామిడి తోట చుట్టూ సరిహద్దుగా 30 కొబ్బరి చెట్లు కూడా నాటాను. వాటి వలన ఇప్పటి వరకు రూ॥ 10,000 ఆదాయం వచ్చింది. ప్రస్తుతం తోట పని చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నాను" అని రవీందర్ తెలిపాడు.

రవీందర్‌కు ఉన్న ఇంకొక ఎకరంలో గ్రామీణ ఉపాధి పథకం ద్వారా మంజూరు చేయించుకొన్న పందిరి వేసి దానికి బిందు సేద్యం ద్వారా నీటి వసతి కల్పించుకుని అందులో తీగ జాతికి సంబంధించిన బీర, పొట్ల వేసుకున్నాడు. ఈ సంవత్సరంలో రూ॥ 35,000 ఆదాయం వచ్చింది. ఈ పందిరి విధానంలో కూరగాయలు సాగుచేయటం ద్వారా తీగ జాతి మొక్కలను చీడ పీడల నుండి రక్షణ కల్పించవచ్చు.

అదే విధంగా సమగ్ర సస్య రక్షణ పద్ధతుల్ని, దీపం ఎరలు (లైట్ ట్రాప్స్) మరియు జిగురు కాగితాలను తన క్షేత్రంలో పాటిస్తుండటం వల్లన కీటకనాశనులను వాడే అవసరం లేకుండా అధిక దిగుబడిని సాధించడం, తక్కువ పెట్టుబడితో కూరగాయలను పండించడం జరుగుతున్నది. పైన పేర్కొన్న దీపం ఎరలను కూడా ఉపాధి హామీ పథకం ద్వారా పొందడం జరిగింది.

రవీందర్ కేవలం తన ఒక ఎకరం వ్యవసాయ క్షేత్రంలో మొదటి సంవత్సరం బీర, పొట్ల ద్వారా రూ. 35,000, రెండో సంవత్సరం బీర పంట దిగుబడి ద్వారా రూ. 42,000 ఆదాయం పొందాడు.

ఒకప్పుడు సాగుకు అనుకూలంగా లేని తన భూమిని ఉపాధి హామీ పథకం ద్వారా భూమిని అభివృద్ధి చేసుకుని, సాగుకు యోగ్యంగా మార్చి కొంత విస్తీర్ణంలో కూరగాయలు పెంచటం, పందిళ్లు, సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటించడమే కాకుండా, బిందు సేద్యం వంటి సాంకేతికతను, అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ ముందంజ వేస్తున్నాడు రవీందర్.

మన ప్రభుత్వం అమలు జరుపుతున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా సాగుకు యోగ్యంగా లేని షెడ్యూల్డ్ కులాల రైతుల భూములు భూమి అభివృద్ధి ద్వారా అత్యంత ఆదాయ వనరులుగా పరివర్తనం చెందటమే కాకుండా, షెడ్యూల్డ్ కులాల వారికి సామాజిక హోదాతో పాటు, ఆత్మస్థైర్యం కలుగుతుందనడానికి రవీందర్ విజయగాధ ఒక తార్కాణం, ఒక నిదర్శనం.

*- యం. మొగులయ్య, ఎం.ఎస్.సి. (ఎజి)*
*ఫ్యాకల్టీ (సి.యన్.ఆర్.యమ్.)*



Sthanika_Color_Apil13.indd 28 02/04/13 3:31 PM



73 వ రాజ్యాంగ సవరణను అనుసరించి రాష్ట్రంలో అమలులోకి తీసుకురాబడిన ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం వలన రాష్ట్రంలో పంచాయితీరాజ్ సంస్థలలో పలు సంస్కరణలు వచ్చాయి. వ్యవస్థాగతంగా సంస్థల నిర్మాణం బాగా జరిగినప్పటికీ, సంస్థల పరిపుష్టికి ప్రభుత్వం బదలాయించవలసిన విధులు,

# పంచాయితీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

**నిధులు, సిబ్బంది ఇంకా పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం అమల్లోకి వచ్చి 2 దశాబ్దాలు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ ఉద్యోగుల, సంక్షేమసంఘం హైదరాబాద్‌లో మార్చి 3న ఒక రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది.**

ఈ సమావేశానికి శ్రీ టి.ఎం.బి. బుచ్చిరాజు అధ్యక్షత వహించగా, పంచాయితీ రాజ్ డిప్యూటీ కమీషనరు డా.ఎం. సుధాకరరావు, ఛీఫ్ అక్కౌంట్స్ అధికారి శ్రీ కె. రాజశేఖర రావులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. పలు జిల్లాల నుండి ఉద్యోగ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని పంచాయితీ రాజ్ వ్యవస్థ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. వ్యవస్థ బలోపేతం కోసం



29 శాఖలకు చెందిన విధులు, నిధులు, సిబ్బందిని బదిలీ చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. పంచాయితీ కార్యదర్శుల ఉద్యోగాలను భర్తీ చేయటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు సూచించారు. అదే విధంగా దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారికి సముచితమయిన శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. పంచాయితీ రాజ్ సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించి అందుకు అవసరమైన విధులు, నిధులు సిబ్బందిని బదలాయించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

పంచాయితీ రాజ్ సంస్థలకు ప్రభుత్వం బకాయి పడిన నిధులను విడుదల చేయాలని, పంచాయితీ పరిధిలోని వీధి దీపాల స్తంభాలకు, ట్రాన్స్ ఫారాలకు విద్యుత్ శాఖ వారు పన్ను చెల్లించే విధంగా సంస్కరణలు తీసుకురావల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. పంచాయితీ రాజ్ వ్యవస్థలోని అన్ని వర్గాల ఉద్యోగులకు తగు శిక్షణ అందచేయటం ద్వారా వారి సామర్థ్యాలను పెంపొందించాలని పలువురు సూచించారు. పంచాయితీ రాజ్ ఉద్యోగులందరిలో స్ఫూర్తి నింపేలా త్వరలో ఒక రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించాలని ఈ సదస్సు తీర్మానించింది.

ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖా మాత్యులు శ్రీ జానారెడ్డి విడుదల చేసిన పంచాయితీ రాజ్ ఉద్యోగుల కరదీపిక 3వ పుస్తకాన్ని పంపిణీ చేసారు. ప్రభుత్వ ఉత్తర్వులను సంకలనం చేస్తూ రూపొందించిన ఈ పుస్తకం పంచాయితీ రాజ్ ఉద్యోగులకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. ■

# పల్లె ప్రాంతాల ప్రగతి సోపానాలు గ్రామీణ సంతలు

గ్రామీణ సంతలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన అంశం అంటే అతిశయోక్తికాదు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉత్పత్తిదారులను, వినియోగదారులను ఒక చోటికి చేర్చే వ్యవస్థలే గ్రామీణ సంతలు. వారి ఉమ్మడి లావాదేవీల వేదికయే గ్రామీణ సంతలు. ఈ సంతలు కేవలం ఆర్థికపరమైన లావాదేవీలకే పరిమితం కాలేదు. సాంస్కృతిక మరియు సామాజిక మార్పులకు వేదికలై మన సంస్కృతి అభివృద్ధికై ఎంతగానో తోడ్పడ్డాయి.

ఇలాంటి ఈ సంతలకు ఏవో కొన్ని గ్రామాల్లో తప్పితే, సరియైన మౌలిక వసతులు లేనటువంటి నేపథ్యంలో, నాబార్డు గ్రామీణ సంతల నిర్మాణానికి తోడ్పడే ఉద్దేశ్యంతో ఈ పథకానికి రూపకల్పన చేసింది. ఈ సంత షెడ్లు ఏర్పాటు చేయటం వలన అటు ఉత్పత్తిదారులు, వ్యాపారస్తులు, ఇటు వినియోగదారులు ఎంతో అనువుగా ఎండా వానల వలన ఇబ్బంది పడకుండా వ్యాపారాన్ని నిర్వహించుకోగలుగుతున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులతోపాటు ఈ సంతలు వ్యవసాయానికి అవసరమయ్యే పనిముట్లు, విత్తనాలు మొదలైన వాటి వ్యాపారానికి కూడా కేంద్ర బిందువులయ్యాయి. ప్రాథమిక అవసరాలైన మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం వలన సంతలకు వచ్చే వాళ్ళందరికి ఎంతో సౌకర్యవంతంగా వుంటున్నాయి.

మన రాష్ట్రంలో ఈ పథకాన్ని ఎంతగానో ప్రోత్సహించడం జరిగింది. దేశంలో గ్రామీణ సంతల పథకం అమలులో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో వుంది. దాదాపు అన్ని జిల్లాల్లో నాబార్డు గ్రామీణ సంతల కార్యక్రమం ద్వారా కొన్ని సంతల నిర్మాణానికి, పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

ఈ సంతలు ఆయా ప్రాంతాల గ్రామస్థుల జీవితాల్లో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రగతికి చేయూతనిస్తున్నాయి. గ్రామస్థుల జీవితాల్లో చిరునవ్వులను తీసుకువస్తున్నాయి. అలాంటి కొన్ని నాబార్డు గ్రామీణ సంతల విజయగాథలివి. ఇలాంటి కార్యక్రమాన్ని కేవలం నాబార్డే కాదు, ప్రభుత్వ, ప్రభుత్వేతర, వాణిజ్య సంస్థలు కూడా అమలు చేయాల్సిన అవసరం వుంది. గ్రామీణ సంతలను బలోపేతం చేయడం వలన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగలదు. పల్లె ప్రాంతాల ప్రగతికి గ్రామీణ సంతలు సోపానాలు కాగలవు.....

## చిత్తూరు జిల్లా

ఇరవైనాలుగు గ్రామాలతో ఏర్పడిన పంచాయితీ కొలమాసనపల్లి. జనాభా 8 వేలకు పైనే ! అందరూ వ్యవసాయ పనులు, చిన్న వ్యాపారాలు మీద ఆధారపడి బతుకుతున్నవారే!

చిత్తూరు జిల్లా, పలమనేరు మండలంలోనిదే కొలమాసనపల్లి. నాబార్డు నిధులతో స్వచ్ఛంద సంస్థ 'మాస్' ఇక్కడ గ్రామీణ సంతను నిర్మించింది. వీధుల్లో తోపుడు బండ్లమీద కూరగాయలు అమ్ముకుని బతుకుతున్న చిరు వ్యాపారులకు ఈ సంత ఒక నీడనిచ్చింది. ఐతే సంతలు నిర్మించడానికి గ్రామస్థులు చాలా సమస్యలే ఎదుర్కోవాల్సి వచ్చింది. నాబార్డు నిధులు ఇచ్చినప్పటికీ, ఇక్కడ రెవెన్యూ శాఖ నుండి అనుమతులు అంత త్వరగా రాలేదు. అయినప్పటికీ, గ్రామస్థులంతా ఏకమై సాధించారు... నేడు కొలమాసనపల్లి గ్రామస్థులు తమ అవసరాలకు కావాల్సిన వస్తువులన్నీ ఈ సంతలో కొంటున్నారు.

*- **బి. సునంద,** సెక్రెటరీ, మిత్రా అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీసెస్, పలమనేరు, చిత్తూరు జిల్లా*

### సంతల కోసం ఉద్యమించాం

కొలమాసనపల్లిలో సంత నిర్మించడానికి స్థానిక అధికారుల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చింది. చివరికి గ్రామస్థుల సహకారంతో నిరసన కార్యక్రమం చేపట్టి సాధించాం. ఒకప్పుడు పలమనేరు నుండి కృష్ణగిరికి వెళ్ళే హైవేలో రోడ్డు పక్కనే దుకాణాలు పెట్టుకునేవారు. రూరల్ హాట్ నిర్మించాక వాళ్ళంతా షెడ్లకింద సురక్షితంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సంత జరుగుతుంది. సంతలో 78 దుకాణాలు ఏర్పాటయ్యాయి. వ్యవసాయ పనులకు పోయినవారు సాయంత్రం సంత చేసుకుని ఇంటికి వెళ్తున్నారు.

సంతచుట్టూ కాంపౌండ్ వాల్, గేట్ ఏర్పాటు చేశాం. షెడ్లు పరిశుభ్రంగా ఉంచడానికి 'కన్నమ్మ' అనే మహిళకు ఉపాధి కల్పించాం. చుట్టుప్రక్కల నుండి కూరగాయలను ఇక్కడికి తేవడానికి ఆటోలు, ట్రాలీలు ఇరవై వరకు తిరుగుతున్నాయి. వారికి పరోక్ష ఉపాధి కలుగుతోంది.

*- **బెస్త సెల్వరాజు,** మాజీ సర్పంచ్, కొలమాసనపల్లి*

### తాజా సరుకు, తక్కువ ధర

"ప్రతి మంగళవారం ఈ సంతలో ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలు కొంటాను. నాబార్డు ఇక్కడ సంత ఏర్పాటు చేయక ముందు రోడ్డు పక్క దుమ్ము, ధూళీలో సరుకులు కొనాల్సి వచ్చేది. ఇపుడా పరిస్థితి లేదు. తాజా కూరగాయలు తక్కువ ధరకే దొరుకుతున్నాయి."

*- దేవకి*





Sthanika_Color_Apil13.indd 29 02/04/13 3:31 PM

## రంగారెడ్డి జిల్లా

కాయగూరలు అధికంగా పండించే చిన్న గ్రామాల మధ్య రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల ఉండటంతో ఇక్కడ ఏర్పాటయిన నాబార్డు గ్రామీణసంత ఉదయం 10 గంటల నుండే సందడిగా ఉంటుంది. ఎండలను కూడా లెక్కచేయకుండా గ్రామీణులు తమకు అవసరమైన నిత్యావసర సరుకులు కొనుగోలులో బిజీగా కన్పిస్తారు. నాబార్డు ఆర్థికసాయం రూ. 4.95 లక్షలకు తోడు పంచాయితీ ఇచ్చే రూ. 50 వేలతో ఎస్ఎస్ఎస్ సంస్థ ఇక్కడ గ్రామీణ సంతలకోసం



షెడ్లు నిర్మించి వాటి నిర్వహణను పంచాయితీకి అప్పగించారు. ప్రతి గురువారం ఇక్కడ సంత జరుగుతుంది. రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి, నంచెర్ల గ్రామాలలో కూడా మరో రెండు గ్రామీణ సంతలు ఏర్పాటయ్యాయి.

### రోజుకు రూ. 3 వందలు లాభం

నాబార్డు ఈ షెడ్లు నిర్మించక ముందు ఎండకు, వానకు చాలా అవస్థలు పడేవాళ్ళం. ఇపుడు షెడ్లు కింద ప్రశాంతంగా కూరగాయలు అమ్ముకుంటున్నాం. పైన వేసిన రూఫ్ వల్ల వేడి రాకుండా వుంది. గురువారం ఇక్కడ, మిగతా రోజుల్లో ఇతర గ్రామాల సంతలో వ్యాపారం చేస్తాం. అమ్మకాలపై రోజుకు రూ. 3 వందలకు పైగా లాభం వస్తుంది. హోల్‌సేల్ రైతుల దగ్గర కొని ఇక్కడ అమ్ముకుంటాం. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు కొనేవాళ్లు వస్తూనే వుంటారు. కరెంట్ సౌకర్యం కల్పిస్తే రాత్రి 8 గంటల వరకు అమ్మకాలు చేసే అవకాశం వుంది. సంతలు నిర్మించాక కొనేవాళ్ళ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. వారానికి ఒక్కసారి కాకుండా కనీసం మూడు రోజులు ఇక్కడ సంతలు పెడితే మాకు ఆదాయం పెరుగుతుంది. పంచాయితీవారు కరెంటు బల్బులు ఏర్పాటు చేయాలి.

*- వెంకటమ్మ, చేవెళ్ల*

## వరంగల్ జిల్లా .....

దేశవ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో 'సంత'ల కోసం షెడ్లు నిర్మించాలనే పథకం అమలుకు నాబార్డు శ్రీకారం చుట్టాక గ్రామీణ ప్రాంత వినియోగదారులకు పక్కా నిర్మాణాలతో కూడిన షెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వరంగల్ జిల్లా ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో 27-11-2009లో నాబార్డు నిధులతో శక్తి సేవా సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ గ్రామీణ సంతలకు షెడ్లు ఏర్పాటు చేసింది.

వరంగల్ జిల్లాలో ఖ్యాతిగాంచిన 800 సంవత్సరాల నాటి రామప్ప దేవాలయానికి 3 కిలోమీటర్ల దూరంలోనే ఈ సంతలు నిర్మించారు. కాజీపేట నుండి రామప్ప దేవాలయానికి వెళ్ళే ప్రధాన రహదారి పక్కనే ఈ సంతలు ఏర్పాటు చేయడం, చుట్టూ ఉన్న చిన్న గ్రామాలకు ఎంతో అనువుగా వుంది.

ప్రతి బుధవారం ఈ సంత ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనుగోలుదారులతో సందడిగా వుంటోంది. సీజనల్‌గా దొరికే పండ్లతో పాటు తాజా కూరగాయలు, కిరాణా సరుకులు కూడా ఇక్కడి పల్లె ప్రజలకు అందుబాటులో వుంటాయి. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా జంగాలపల్లి చుట్టూ ఉన్న 20 గ్రామాల నుండి వచ్చే ప్రజలతో ఈ సంత ఒక తిరునాళ్ళలా వుంటుంది....

### పంచాయితీ ఆదాయం రెట్టింపు

"మూడేళ్ళ క్రితం ఇక్కడ సంత జరిగేది కానీ చెట్లకిందనే... రోడ్లపక్క ఎండ, వానలో ఇబ్బందులు పడుతూ అమ్మకాలు జరిగేవి. నాబార్డు సంతలు నిర్మించాక జంగాలపల్లికి కొత్తకళ వచ్చింది. అమ్మకందారులు, కొనుగోలు దారులు పెరిగారు. పంచాయితీ తరపున నలుగురు స్వీపర్స్‌ని పెట్టి సంతల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నాం. త్వరలో టాయిలెట్స్ ఏర్పాటు చేయబోతున్నాం. ఒకప్పుడు ఈ సంతలవల్ల రూ. 30 వేలే పంచాయితీకి ఆదాయం వచ్చేది. నాబార్డు షెడ్లు నిర్మించాక అమ్మకందార్ల సంఖ్య పెరిగింది. నేడు రూ. 75 వేలు సంవత్సరానికి ఆదాయం వస్తుంది."

*- ఎన్.శ్రీధర్, మాజీ సర్పంచ్, జంగాలపల్లి, వరంగల్ జిల్లా*

### ఆదాయం పెరిగింది, పొదుపు చేస్తున్నాం

"17 కిలో మీటర్ల దూరం నుండి వచ్చి ఇక్కడ కూరగాయలు అమ్ముకుంటున్నాం. ఇక్కడ నాబార్డు వారు షెడ్లు వేయక ముందు చెట్ల కిందనే అంగడి పెట్టుకునేవాళ్ళం. అపుడు వానల వల్ల ఇబ్బందులు పడేవాళ్ళం. ఇపుడా భయం లేదు. ధీమాగా అమ్ముకుంటున్నాం. ఇక్కడే హోల్‌సేల్ వ్యాపారి కళావతి దగ్గర కూరగాయలు తీసుకొని అమ్ముతాను. రోజుకో గ్రామంలో కూరగాయలు అమ్మితే నెలకు రూ. 5 వేలకు పైగా ఆదాయం వస్తుంది. భారతి పొదుపు సంఘంలో చేరి నెలనెలా కొంత పొదుపు చేస్తున్నాను."

*- అరుణ, కూరగాయల వ్యాపారి (చల్వాయి)*



Sthanika_Color_Apil13.indd 30 02/04/13 3:31 PM

# విశాఖ జిల్లా

విశాఖ జిల్లా, మాడుగులలో ఏర్పాటయిన గ్రామీణ సంత ఈ ప్రాంతపు గిరిజనులు అటవీ ఉత్పత్తులను అమ్ముకోవడానికి కేంద్రమైంది. రూరల్ హాట్ నిర్మించక ముందు ఇక్కడ అపరిశుభ్రమైన వాతావరణంలోనే అమ్మకాలు జరిగేవి. వానాకాలంలో నీడలేక ఉత్పత్తులు దెబ్బతిని గిట్టుబాటు ధరలేక అమ్మకందారులు నష్టపోయేవారు. నేడు నాబార్డు నిధులతో ఓఆర్ఆర్సి స్వచ్ఛంద సంస్థ రూరల్‌హాట్ నిర్మించాక అమ్మకందార్లు నిశ్చింతగా వ్యాపారాలు చేసుకొని లాభాలు పొందుతున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో పటిష్టమైన నిర్మాణాలు చేసినప్పటికీ, మాడుగుల గ్రామ పంచాయితీ సంతలను నిర్వహణలో శ్రద్ధ చూపడంలేదు. సంతకు వచ్చేవారికి కనీస అవసరాలు తీర్చడంలో పంచాయితీ మరికొంత కృషిచేస్తే అమ్మకందార్లు, కొనుగోలుదార్లు పెరిగి గ్రామీణాభివృద్ధి జరుగుతుంది.



### గిరిజనుల వస్తుమార్పిడి

చుట్టుప్రక్కల ఇరవై గ్రామాల నుండి గిరిజనులు, రైతులు ఈ సంతకు వస్తుంటారు. వారానికి ఒక్కసారి కాకుండా ప్రతీ రోజూ సంత ఏర్పాటు చేస్తే బాగుంటుంది. గిరిజనులు చింతపండు, కుంకుళ్ళు లాంటి ఉత్పత్తులు తెచ్చుకొని అమ్ముకొని ఆ డబ్బుతో వారికి అవసరమైన వస్తువులు ఇదే సంతలో కొనుక్కొని ఇళ్ళకు చేరతారు.

*- దాసన్న, పాడేరు*

### దుస్తులు వ్యాపారం బాగుంది

ఈ సంతలో దుస్తుల వ్యాపారం చాలా పెద్దగా సాగుతుంది. సంతకు వచ్చే వారిలో సగం మంది దుస్తులు కొనడానికే వస్తారు. షెడ్లు వేయడం వల్ల నీడ పట్టున సంత చేసుకునే అవకాశం కల్గింది.

*- ఎర్ర సన్యాసమ్మ, వడ్డాది*

# పశ్చిమగోదావరి జిల్లా

పశ్చిమగోదావరి, ఉండి మండలం, పెదపుల్లేరులో 2010లో రూరల్‌హాట్ నిర్మాణం పూర్తయింది. ప్రతీ గురువారం పెదపుల్లేరులో జరిగే సంతలో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. అదే రోజు సమీపంలోనే ఉన్న 'ఉండి' గ్రామంలో కూడా సంత జరుగుతుండటంతో కొందరు అటువైపు వెళ్తున్నారు. అందుకే మరో రోజుకు సంతను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

నాబార్డ్ షెడ్ల నిర్మాణం పూర్తయ్యాక పెదపుల్లేరు పంచాయితీ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. 'నాబార్డు' ఇక్కడ సంతలు నిర్మించక ముందు ఈ ప్రాంత ప్రజలంతా 'ఉండి' సంతకు వెళ్లేవారు. ఇపుడు ఇక్కడ కూడా వినియోగదారుల సంఖ్య పెరిగి పంచాయితీ ఆదాయం పెరిగింది. పరోక్షంగా టీ, టిఫిన్స్ అమ్ముకునేవారికి ఉపాధి కలిగిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు పంచాయితీ కార్యదర్శి.



### వ్యాపారం పెరిగింది

పెదపుల్లేరు సంతకోసం నాబార్డు షెడ్లు నిర్మించడం వల్ల మాకెంతో మేలు జరుగుతుంది. ఎండ, వానల బారిన పడకుండా మాకు, మా సరుకులకు రక్షణ కలిగింది. ఫిబ్రవరి నెలలో జరిగే సత్తెమ్మతల్లి తిరునాళ్లకు కూడా ఈ షెడ్లు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఈ సంత ఊరికి దూరంగా ఉండటంతో వ్యాపారం కొద్దిగా మందగించింది. అయినప్పటికీ ఇక్కడ జనం క్రమంగా పెరుగుతున్నారు. సంతకు పక్కనే పంచాయితీ మంచి నీటి సౌకర్యం, టాయిలెట్స్ ఏర్పాటు చేయడం వల్ల అందరికీ సౌకర్యంగా ఉంది.



*- కొండా రామచంద్రరావు, మేడవరం*

### చేపల చెరువుల రైతులకు మంచి డిమాండ్

"పాలమూరు సంతలో అన్ని సరుకులకంటే చేపలే ఎక్కువగా అమ్ముడవుతాయి. రోజుకు రూ. 500 నుండి రూ. 1500 వరకు అమ్మకాలు సాగుతాయి. చేపల చెరువుల నుండి ఎప్పటికప్పుడు తాజా చేపలు ఈ సంతకు సరఫరా చేస్తారు. వాటిని మేము చిల్లరగా కొని అమ్ముతాము. నాబార్డువారు షెడ్లు నిర్మించాక పాలమూరు పంచాయితీ ఇక్కడ ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తుంది. ఈ సంతల వల్ల కూరగాయల వ్యాపారులతోపాటు చేపల చెరువుల రైతులు, మాలాంటి అమ్మకందార్ల ఆదాయం పెరిగింది".

*- చేపల వ్యాపారి, పాలమూరు, పశ్చిమగోదావరి జిల్లా*



Sthanika_Color_Apil13.indd 31 02/04/13 3:31 PM

# గ్రామీణ ఆదాయం పెంచిన గ్రామసంతలు

గ్రామీణ సంస్కృతిలో విడదీయలేని ఒక భాగం సంతలు. వారపు సంతలు పల్లె ప్రజల జీవనసరళికి ప్రతీకలు. సంతలు కేవలం అమ్మకాలు, కొనుగోళ్లు జరిపే వ్యాపార కేంద్రాలుగానే కాక వివిధ గ్రామాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు కలుసుకొని కష్టసుఖాలు చెప్పుకునే కూడళ్లు కూడా!

సంతలలో స్థానికంగా లభించే ఉత్పత్తులు, వ్యవసాయేతర సరుకులు అమ్మడం ద్వారా స్థానిక అమ్మకందారులకు మేలు జరుగుతుంది. కానీ గ్రామాలలో తరతరాలుగా ఏర్పాటవుతున్న సంతలు రోడ్ల పక్కనో, చెట్లకిందనో కన్పిస్తాయి. పేద, బడుగు అమ్మకందారులను మండుటెండలనుంచి, భారీ వర్షాల నుంచి కాపాడే ఏర్పాట్లేమీ లేవు. వాతావరణ ప్రభావాల వల్ల వారి ఉత్పత్తులు చెడిపోయి నష్టపోవాల్సి వస్తోంది. అంతేకాక తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు కూడా గ్రామాల్లో వీరికి దొరకవు. ఈ నేపథ్యంలో గ్రామసంతలకు మెరుగైన వసతులు కల్పించి అమ్మకందారులకు, వినియోగదారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి నాబార్డు కొత్త గ్రామీణ సంతల నిర్మాణం, ఉన్న వాటిని మెరుగు పరచడంకోసం గ్రామీణ సంతల పథకాన్ని రూపొందించింది.

నాబార్డు గ్రామీణ సంతలు నిర్మించాక గ్రామస్థులకు కలిగిన సౌకర్యాలు, అమ్మకందారుల ఆదాయంలో వచ్చిన మార్పు, పంచాయితీలకు పెరిగిన ఆదాయం, ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిగిన ఉపాధి అవకాశాలను పరిశీలించడానికి 9 జిల్లాలు పర్యటించగా మా దృష్టికి వచ్చిన అంశాలివి :

- గ్రామపంచాయితీలు, ప్రాథమిక వ్యవసాయ సంఘాలు (ప్యాక్స్), విలేజ్ డెవలప్‌మెంట్ బోర్డులు, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్.జీ.ఓ) స్వయం సహాయక బృందాలకు గ్రామీణ సంతలను నిర్మించే అవకాశం నాబార్డు కల్పించింది. మొత్తం ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో 90 శాతం లేదా రూ. 5 లక్షలు నాబార్డు గ్రాంటుగా ఇచ్చింది.
- నాబార్డు గ్రామీణ సంతల పథకం మొదలయ్యాక నేటికి మన రాష్ట్రంలో 18 జిల్లాల్లో 84 సంతలు నిర్మాణం పూర్తిచేసుకొని వినియోగంలోకి వచ్చాయి. రాష్ట్రం మొత్తం మీద గ్రామీణ సంతల నిర్మాణంలో చిత్తూరు జిల్లా (13) మొదటి స్థానంలో ఉండగా, విశాఖజిల్లా రెండవ స్థానంలో (12), వరంగల్ జిల్లా మూడవ (11) స్థానంలో వుంది.
- నాబార్డు రూరల్ హాట్స్ నిర్మించాక పేద అమ్మకందారుల సరుకులకు రక్షణ లభించింది. షెల్టరు కింద ఏ ఇబ్బందులూ





లేకుండా వ్యాపారం చేస్తున్నారు. గతంలో రోడ్లపక్కన చెట్లకింద అంగళ్ళు పెట్టుకొని ఎండా, వానలకు నష్టపోయేవారు. ఇపుడా పరిస్థితి మారిందని అందరూ ఆనందం వ్యక్తంచేసారు.

- గతంలో ఏడాదికి సంతలవల్ల ఇరవైవేలు కూడా ఆదాయం రాని పంచాయితీలకు నాబార్డు రూరల్‌హాట్స్ నిర్మించాక ఆదాయం రెట్టింపు అయింది. కాంట్రాక్టర్లు పోటీపడి సంతల వేలంలో పాల్గొంటున్నారు.
- సంతలకు వచ్చే వినియోగదారులు పెరగడంవల్ల సంతల వెలుపల ఇతర వ్యాపారాలు కూడా పెరిగాయి. మొత్తంమీద గ్రామాల ఆదాయం పెరిగింది. ఉపాధి అవకాశాలు పెరిగాయి.
- నాబార్డు నిర్మించిన షెడ్లను వారానికి ఒక్కరోజే సంతలకు వాడుతున్నారు. మిగతా రోజుల్లో కూడా నల్గొండ జిల్లా గ్రామస్థులు వీటిని శుభకార్యాల విందులకు, గ్రామసభలకు, పంచాయితీ తీర్మానాలకు, ఉపయోగించుకుంటున్నారు.
- సంతలో అమ్మకానికి కూరగాయలు, ఇతర సరుకులు రవాణా చేస్తున్న ఆటోలు, ట్రాలీలు, ఎడ్లబండ్లు నడిపే వారికి పరోక్ష ఉపాధి కలుగుతోంది.
- ఒకప్పుడు రోడ్లపక్కన జరిగిన అమ్మకాల కంటే నేడు షెడ్లకింద అమ్మకాలు పెరిగాయి, పేద వ్యాపారస్థుల ఆదాయం పెరిగి వారు పొదుపు గ్రూపుల్లో కొంత పొదుపు చేయడం కూడా మొదలుపెట్టారు.
- మంచినీళ్ళు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించడంవల్ల మహిళలకు సౌకర్యంగా ఉంది. ఈ సంతల్లో అమ్మకందారులు, కొనుగోలు దారులు ఎక్కువగా మహిళలే!
- ఎత్తయిన అరుగులపై సంతల నిర్మించడం మంచిదే అయినప్పటికీ, వాటిపైకి వెళ్లడానికి మెట్లు నిర్మించలేదు. దీనివల్ల వృద్ధులు, పెద్దవారు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఒక్క సంత షెడ్లకు కూడా మెట్లు లేవు. ఇప్పటికైనా దీనిని సరిదిద్దుకోవచ్చు.
- కొన్ని సంతలకు కరెంట్ బల్బులు ఏర్పాటు చేయలేదు. దీనివల్ల సాయంత్రం అమ్మకాలు జరపడంలో సమస్యలు ఎదురవుతున్నాయని వరంగల్ జిల్లా జంగాలపల్లి, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల గ్రామస్థులు అంటున్నారు.
- మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం పనులు చేయడంలో చాలా పంచాయితీలు నిర్లక్ష్యంగా ఉన్నాయి. నాబార్డు 5 లక్షల వ్యయంతో పటిష్టంగా నిర్మించిన ఈ సంతలను పంచాయితీలు శ్రద్ధగా నిర్వహిస్తే గ్రామస్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

*- శ్యాంమోహన్ (రూరల్ మీడియా)*



Sthanika_Color_Apil13.indd 32 02/04/13 3:31 PM

వ్యవసాయానికి వర్షపు నీరు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. ఈ వర్షపు నీటిని అన్ని నేలలకు, అన్ని పంటలకు వినియోగించవచ్చు. వర్షాకాలపు నీటికి, ఎండాకాలంలో నీటికి నాణ్యతలో తేడా వుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగటు వర్షపాతం 900 మి.మీ. ఈ సగటు వర్షపాతంలో దాదాపు నలబై శాతం నేలలోకి ఇంకిపోకుండా వృధాగా పోతున్నది. తొమ్మిది శాతం నేల పొరలోకి ఇంకి భూగర్భ జలాల్లో కలిసిపోతుంది. నలబై ఒక్క శాతం మాత్రం నేల నుండి ఆవిరిగా మరియు మొక్కల ఆకుల నుండి భాష్పోత్సేకం రూపంలో ఆవిరి అవుతుంది. కేవలం పది శాతం మాత్రమే నేలలో వుండి మొక్కల అవసరాల దృష్ట్యా వినియోగించబడుతుంది.



# వాన నీటి సంరక్షణతో రైతుకు లాభాలు

రాష్ట్రంలో సాగులో వినియోగించబడే భూమిలో సుమారు 60 శాతం వ్యవసాయం వర్షాధారంగా జరుగుతుంది. పంటలు బాగా పండాలంటే వర్షపునీటిని వివిధ రూపాలలో సమృద్ధిగా సద్వినియోగపరచుకోవాలి. వర్షపు నీరు పంటపొలాల్లో వృధాగా కొట్టుకుని పోవటం వల్ల వర్షం నీరు వృధాగా పోవటమే కాక, పంట మొక్కలకు ఎంతో విలువైన పోషక ఖనిజాలు, నేలలోని విలువైన పదార్థాల నష్టం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు ప్రకృతిలో మార్పుల వల్ల, సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల పంట దిగుబడులు గణనీయంగా తగ్గి, రైతులోకానికి నష్టం వాటిల్లుతుంది. ఇటువంటి పరిస్థితులలో వర్షపు నీటి సంరక్షణ పద్ధతులగూర్చి అవగాహన పెంచుకోవడం ప్రతి రైతు బాధ్యత, కర్తవ్యం.

**వర్షపు నీటి సంరక్షణ, సద్వినియోగంలో ప్రధాన అంశాలు**


- వర్షం కురిసిన తర్వాత భూమిలోకి ఇంకిపోయే విధంగా నేలను తయారు చేయడం
- భూమిలో వీలైనంత వరకు చాలా నీటిని నింపే విధంగా చేయడం
- నేలలో వున్న తేమ నష్టాన్ని తగ్గించి పంటలు ఉపయోగించుకొనేలా చేయడం.

పంట గుణగణాలు, నేలల స్వభావం, వాతావరణ పరిస్థితులను బట్టి వర్షపు నీటి సంరక్షణ చేయాలి. ఈ సంరక్షణ పద్ధతుల్లో ముఖ్యంగా నీటి సంరక్షణ సాళ్ళు ఏర్పాటు చేయడం అనేది ప్రధానమైనది.

నీటి సంరక్షణ సాళ్ల వల్ల దాదాపుగా 75 శాతం వరకు వృధాగా వెళ్ళే నీటిని సంరక్షించవచ్చు. మెట్ట పంటలను వాలుకు అడ్డుగా వేసిన చేలల్లో విత్తనం మొలిచిన 20-25 రోజుల తరువాత నేలలో తగిన తేమ వున్నప్పుడు సాళ్ళ మధ్య దూరం 2.5 నుండి 3.6మీ. మధ్య దూరం ఉండే విధంగా లోతైన నాగటి సాళ్ళు చేయాలి. ఈ నీటి సంరక్షణ సాళ్ళు భూమిపై నీటి ప్రవాహాన్ని తగ్గించి ఎక్కువ నీటిని పీల్చి నేలలో తేమశాతం పెంచుతాయి. తద్వారా పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

వాలుకు అడ్డుగా పంటలను పెంచడాన్ని 'కాంటూరు సేద్యం'

అని పిలుస్తారు. ఈ కాంటూరు సేద్య విధానంలో వర్షపు నీటి ప్రవాహవేగం తగ్గి నేలలోకి ఇంకి నీటి నిలువ పెరుగుతుంది. ఈ కాంటూరు పద్ధతిలో వాలు శాతం 2 నుండి 3 వరకు వున్నప్పుడు రైతులు తమ పంట పొలాల్లో అత్యధిక వర్షపాతపు నీటిని సంరక్షించుకోగలరు. కాంటూర్ సేద్యంలో గట్ల మీద సుబాబుల్, గ్లైరిసీడియం వంటి మొక్కలను పెంచుకోవాలి.




పంట కాలువలు, బోదెల ద్వారా కూడా వర్షపు నీటిని సంరక్షించవచ్చు. లోతు తక్కువ భూమిలో పంట మొలకెత్తిన 20 నుండి 25 రోజుల మధ్య గాని తర్వాత గాని ప్రతి రెండు సాళ్ళ మధ్య బోదె నాగలిని పడపాలి. దీనివల్ల, పొలం అంతటా మొక్కల మొదళ్ళకు తగినంత మట్టి ఎగదోయబడి గాలులకు మొక్కలు పడిపోకుండా ఉంటాయి. వర్షపు నీరు సాళ్ళలో నిలబడి నేలలోకి ఇంకిపోయి నేలలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల మొక్కలు వర్షపు నీటిని ఎక్కువగా సంరక్షించుకోవచ్చు. పంట దిగుబడి కూడా ఎక్కువగా పెరుగుతుంది.

లోతైన దుక్కులు దున్నడం వల్ల భూమిలోని గట్టిపొర పగిలి నేల బాగా మెత్తగా అవుతుంది. ముఖ్యంగా లోతు తక్కువైన ఎర్ర చెల్కలలోను, అడుగు గట్టిగా వుండే నేలలోను లోతు దుక్కులు దున్నటం చాలా ఉపయోగం. లోతు దుక్కలను 35 నుండి 40 సెం.మీ వరకు దున్నాలి. దీనివల్ల వర్షపు నీరు నేలలోకి ఇంకి పంటల వేర్లకు నీటి లభ్యత ఎక్కువ కలుగుతుంది. వర్షపు నీరు నేలలోని ఇసుక రేణువుల గుండా ప్రవహించి భూమిలో నిల్వ ఉంటుంది. పంట వేర్లు నేల లోపలికి బాగా పెరిగి నేలలోని పోషకాలు, ఖనిజ లవణాలను నీటితో పాటు గ్రహించి పంట దిగుబడిని 35-40 శాతం పెంచుకొనే అవకాశం వుంటుంది. లోతైన దుక్కల వల్ల 2 నుండి 3 సంవత్సరాల పాటు పంట నేలలకు మేలు చేకూరుతుంది.

సేంద్రియ పదార్థాలను ఎర్రచెల్క నేలల్లో వర్షం పడక ముందు వాడాలి. ఎందుకంటే, ఎర్రచెల్క నేలల్లో సేంద్రియ పదార్థాలు తక్కువగా వుండటం వల్ల వర్షం పడిన తర్వాత నేలలో పైపొర గట్టిపడి నీరు ఇంకి పోకుండా చేస్తుంది. అందువల్ల సేంద్రియ పదార్థాలు భూమిలో వేసి దున్నాలి. విత్తనాలు మొలకెత్తి నీటిని సద్వినియోగం పరచుకొని పంట దిగుబడి పెంచుకుంటాయి.

అంతర పంటలను పెంచడం వల్ల వర్షపు నీరు త్వరగా నేలలోకి ఇంకిపోతుంది. పంట చిన్నదిగా వున్నప్పుడు నేలలో తేమ ఆవిరి రూపంలో వృధా అవుతుంది. ఈ నష్టాన్ని తగ్గించడానికి పంట సాళ్ళ మధ్య గుంటక త్రోలడం వల్ల నేలపై పొరమట్టి పొరవలె ఏర్పడి, నేల లోపలి పొరలో తేమ ఆవిరికావడం తగ్గుతుంది. అంతేకాక కలుపు బెడద తగ్గుతుంది. ఇది రైతాంగానికి ఆర్థికంగాను, సులువుగా వర్షపు నీటిని సంరక్షించుకునే లాభసాటి పద్ధతి.

ఎరువులను నేలల స్వభావం బట్టి వాడాలి. సమగ్రమైన యాజమాన్య పద్ధతులలో పంటలను పెంచడం మరియు పంటల పోషకాల సమగ్ర యాజమాన్యంలో కూడా శ్రద్ధ అవసరం. మెట్ట భూములు నీటిని ఎక్కువగా పీల్చుతాయి. నేలలో నత్రజని, భాస్వరం, గంధకం, జింకులోపాలు ఉన్నట్లయితే, అటువంటి నేలకు సరైన మోతాదులో రసాయనిక ఎరువులతో పాటు పశువుల ఎరువు, కంపోస్ట్, జీవన ఎరువులు, పచ్చిరొట్టె వంటి సేంద్రియ ఎరువులు వాడి భూమి భౌతిక రసాయన గుణగణాలను వృద్ధి చెందిస్తే వర్షపు నీరు సద్వినియోగం అవుతుంది.

ఈ విధంగా పంటల యాజమాన్యంలో వర్షపు నీటిని సరైన సంరక్షణ పద్ధతుల ద్వారా వినియోగించడం వల్ల ప్రతి వర్షపు బొట్టు సద్వినియోగం జరిగి పంట దిగుబడి పెరిగి, రైతుకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. వర్షం నీరు వృధా కాకుండా ఎంత ఎక్కువ నీటిని సంరక్షిస్తే, రైతు అంత ఎక్కువ లాభం పొందవచ్చు.

**- జి. సంతోష్‌కుమార్,** పిహెచ్.డి. స్కాలర్, రాజేంద్రనగర్, ఎఎన్‌జిఆర్‌ఎయు
**- ఎ. ఉమా రాజశేఖర్,** ఎం.ఎస్.సి (అగ్రికల్చర్), రాజేంద్రనగర్, ఎఎన్‌జిఆర్‌ఎయు

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**